




ESTD: 1999

www.voodayam.com

# వుదయం






వరంగల్ 27-08-2026 గురువారం | సంపుటి : 11 | సంచిక : 259 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on

## పెట్టుబడులే లక్ష్యంగా

**దేశీయ, అంతర్జాతీయ రోడ్ షోలు**

# ఇన్వెస్ట్ తెలంగాణ



**మంత్రివర్గ ఉపసంఘం అత్యున్నత భేటీ**
**వివిధ కమిటీలలో నిపుణుల భాగస్వామ్యం**
**గత అవగాహన ఒప్పందాలపై సమీక్ష**

**హైదరాబాద్, ఆగస్టు 26 (వుదయం) :**

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 ఇన్వెస్ట్ తెలంగాణ' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమ్మిట్ సన్నాహకాల్లో భాగంగా మహాత్మా పూలే ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రజాభవన్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం, వార్ రూమ్ బాధ్యతలను ఒక సీనియర్ అధికారికి అప్పగిస్తూ సీఎస్ పర్యవేక్షణను పటిష్టం చేయాలని స్పష్టం చేశారు.



వచ్చే డిసెంబర్‌లో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతస్థాయిలో రోడ్ షోలు నిర్వహించి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. సమ్మిట్ నిర్వహణ కోసం ఏర్పాటయ్యే వివిధ కమిటీల్లో సంబంధిత రంగాల నిపుణులను, కీలక అధికారులను భాగస్వాములను చేయాలన్నారు. అలాగే గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ల సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలు (MoUs) ఏ మేరకు అమలయ్యాయో లోతుగా విశ్లేషించే బాధ్యతను ఒక ప్రత్యేక కమిటీకి అప్పగించాలని స్పష్టం చేశారు. అతిథులకు పంపే ఆహ్వాన పత్రాల ప్రక్రియను ఎటువంటి ఆలస్యం లేకుండా వేగవంతం చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని సూచించారు. నిర్ణీత సమయపాలన (టైమ్‌లైన్) ప్రకారం ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను పక్కాగా పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

# ప్రకృతి ప్రకోపం



- 95 మంది మృతి, 500 మందికి పైగా గల్లంతు
- నేపాల్ వరదల్లో 105 మంది భారత పర్యాటకులు గల్లంతు
- మానసరోవర్ యాత్రికుల తీవ్ర ఆందోళన
- హైదరాబాద్, ఆదోని వాసులు సురక్షితం
- నేపాల్ వరదల ప్రభావం చైనా
- సరిహద్దు రాష్ట్రాలపై తీవ్రం



**కాఠ్‌మాండూ, ఆగస్టు 26 (ఎఎంస్) :**

నేపాల్‌లో భోటెకోశీ నది బుధవారం ఉదయం ఒక్కసారిగా ఉప్పొంగడంతో ఆకస్మిక మెరుపు వరదలు సంభవించి తీవ్ర విషాదం నింపాయి. నదీ ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో రసువా జిల్లా పరిధిలోని పలు గ్రామాలు, ఇళ్లు, ప్రాజెక్టు కేంద్రాలు మరియు వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రకృతి విపత్తు దాటికి ఇప్పటివరకు 95 మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 500 మందికి పైగా గల్లంతయ్యారని అధికారులు వెల్లడించారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయ పర్యాటకులు, 37 మంది ప్రవాస భారతీయులు, 93 మంది నేపాల్ జాతీయులతో పాటు 41 మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. పర్వత ప్రాంతాలు కావడంతో నేపాల్ సైన్యం చేపడుతున్న సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

**చైనాపై విపత్తు ప్రభావం.. సరిహద్దు రాష్ట్రాలకు కేంద్రం అడ్వైజరీ**

ఈ మెరుపు వరదల ప్రభావం చైనాలోని టిబెట్ ప్రాంతంపైనా పడింది. చైనానేపాల్ సరిహద్దుల్లో భారీగా కొండచరియలు విరిగిపడటంతో నివాస ప్రాంతాలు దెబ్బతిని ప్రాణనష్టం వాటిల్లింది. దీంతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పూర్తిస్థాయి సహాయక చర్యలకు ఆదేశించారు. అయితే, వరదలపై ముందస్తు సమాచారం ఇవ్వడంలో చైనా విఫలమైందనే ఆరోపణలు వినవస్తున్నాయి. మరోవైపు, నేపాల్‌ను ఆనుకుని ఉన్న బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. గండక్ నదీ పరివాహక ప్రాంత ప్రజలు జాగరూకతతో ఉండాలని సూచించింది.

**హైదరాబాద్ యాత్రికులు సురక్షితం.. నేపాల్‌లో ఆదోని కుటుంబం చిక్కులు**

హైదరాబాద్‌కు చెందిన 153 మంది యాత్రికులు ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నేపాల్ వెళ్లగా, వారిలో 16 మంది అనారోగ్యంతో గదిలోనే ఉండిపోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. మిగిలిన యాత్రికులు కూడా సురక్షితంగానే ఉన్నట్లు సమాచారం అందుతోంది. మరోవైపు, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన భాస్కర్ శాస్త్రి కుటుంబం కైలాస మానసరోవర్ యాత్రకు వెళ్లి చైనా ఇమిగ్రేషన్ ప్రాంతమైన దార్సింగ్‌లో చిక్కుకుపోయింది. తామంతా సురక్షితంగా ఉన్నామని, అయితే మార్గాలు కొట్టుకుపోవడంతో కాఠ్‌మాండూ చేరుకోవడం క్లిష్టంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆ కుటుంబంతో మాట్లాడి, సురక్షితంగా స్వస్థలానికి తీసుకువచ్చేలా ప్రభుత్వంతో మాట్లాడతానని భరోసానిచ్చారు.

## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం





**ఆరుగురు ప్రయాణికుల దుర్మరణం**
**కోదాడ వద్ద ఘోర బస్సు ప్రమాదం**
**ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు**
**తీవ్ర గాయాలతో 20 మంది ఆసుపత్రిపాలు**
**సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

**కోదాడ, ఆగస్టు 26 (వుదయం) :**

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారు జాతీయ రహదారిపై తెల్లవారుజామున అత్యంత విషాదకర సంఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, మార్గమధ్యంలో ఐరన్ సామగ్రితో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ఘోర ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**ఐరన్ షీట్లు చొచ్చుకెళ్లడంతో మిన్నంటిన కేకలు**

రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీలో ఉన్న ఐరన్ షీట్లు, ఢీకొట్టిన తీవ్రతకు బస్సు ముందు భాగాన్ని చీల్చుకుంటూ లోపలికి చొచ్చుకెళ్లాయి. ఆ సమయంలో తీవ్ర నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలకు ఈ ఐరన్ షీట్లు నేరుగా గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత పెరిగి మరణాలు సంభవించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన ఈ బస్సు, డ్రైవర్ మల్లికార్జున నిద్రమత్తు మరియు అతివేగం కారణంగానే ప్రమాదానికి గురైనట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి డ్రైవర్ పరారవ్వగా, మృతులను ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం కోదాడ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

కోదాడ సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలతో సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీలు వెంటనే కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి వైద్య సేవలపై పర్యవేక్షించారు. మరోవైపు, ఈ ప్రమాదంపై ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇస్తూ, ప్రయాణికుల భద్రత విషయంలో బస్సు యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌ను వీడేది లేదు

**అధిష్ఠానంపై సంపూర్ణ విశ్వాసం ఉందన్న కొండా మురళి**

**హైదరాబాద్, ఆగస్టు 26 (వుదయం)**



రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో తాను కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తి లేదని సీనియర్ నేత, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి స్పష్టం చేశారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలతో కొండా మురళి సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాజా రాజకీయాలపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నాయకత్వంపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని వ్యాఖ్యానించారు. తమ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆమె ప్లాన్‌ఎ ప్రకారమే ఆ వ్యాఖ్యలు చేసిందని తెలిపారు. మంత్రి సురేఖ క్రమశిక్షణ కలిగిన నాయకురాలని, ఆమె ఇప్పటికే ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ తుది నిర్ణయం వెలువడే వరకు ఈ అంశంపై మరేమీ మాట్లాడబోనని ఆయన తేల్చిచెప్పారు.

**నియోజకవర్గ నిధుల కోసమే భేటీ: సీఎంకు వ్యతిరేకం కాదన్న రాజగోపాల్‌రెడ్డి**

తన నియోజకవర్గ అభివృద్ధి బిల్లుల విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలవడానికే తాను ప్రజాభవన్‌కు వచ్చానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. అక్కడికి వచ్చేసరికే కొండా మురళి ఉన్నారని, సౌజన్యపూర్వకంగానే మాట్లాడనని తెలిపారు. తాను ఎప్పుడూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడలేదని ఈ సందర్భంగా ఆయన వివరణ ఇచ్చారు. మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ తీసుకోబోయే నిర్ణయమే ఆఖరిదని, ఈ విషయంలో ముఖ్యమంత్రి అభిప్రాయమే తన అభిప్రాయమని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

బంగారం, వెండిపై దిగుమతి సుంకాల తగ్గింపు ?

దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించాలని పరిశ్రమ వర్గాల డిమాండ్

స్మగ్లింగ్ పెరుగుదలపై ఆందోళన..

అధికారిక దిగుమతుల పెంపే లక్ష్యం

## ఇంతే కదా...!




## ప్రయాణికులు, సరకు రవాణా

# సామర్థ్యం పెంపే లక్ష్యం

**దేశంలో 7 కీలక రైలు మార్గాల విస్తరణ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఎఎంస్) :**



దేశంలో అత్యధిక ప్రయాణికుల రద్దీ మరియు సరకు రవాణా కలిగిన ఏడు కీలక రైలు మార్గాల ఆధునికీకరణ, విస్తరణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రధాన రైలు మార్గాలను నాలుగు లైన్లుగా (ఫోర్ లైనింగ్) విస్తరిస్తున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన వివరాలను పంచుకున్నారు. భవిష్యత్తులో పెరగనున్న ప్యాసింజర్, సరకు రవాణా డిమాండ్లను సమర్థవంతంగా తట్టుకోవడానికి, తక్కువ నిర్వహణ వ్యయంతో కూడిన పర్యావరణహిత రైల్వే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి ఈ క్వాడ్రపులింగ్ ప్రాజెక్టు అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ హౌడా, హౌడాచెన్నై, చెన్నై ముంబయి, ముంబయిఢిల్లీ, ఢిల్లీచెన్నై, ముంబయి హౌడా, ఢిల్లీగువాహటి మార్గాలు దేశంలోనే అత్యధిక రద్దీ కలిగిన 'హైడెన్సిటీ నెట్‌వర్క్' కిందకు వస్తాయని కేంద్రమంత్రి తెలిపారు. దాదాపు 11 వేల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ ఏడు మార్గాలు దేశ మొత్తం రైల్వే నెట్‌వర్క్‌లో 16 శాతమే అయినప్పటికీ, మొత్తం రైలు ట్రాఫిక్‌లో దాదాపు 41 శాతం రాకపోకలు వీటి నుంచే సాగుతున్నాయని వివరించారు. ఈ మార్గాల్లో ఇప్పటికే కొన్ని చోట్ల నాలుగు లైన్లు అందుబాటులో ఉండగా, మిగిలిన పూర్తి నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లుగా విస్తరించడం ద్వారా రైళ్ల వేగం పెరగడంతో పాటు ప్రయాణికులు, సరకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# 'జెన్‌జీ'ల వేట

**న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఎఎంస్)**

దేశంలో సరికొత్త రాజకీయ సమీకరణాలు మరియు నిరసనల నేపథ్యంలో 'జెన్‌జీ' (నేటి తరం యువత)ని ఆకట్టుకోవడానికి దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు సోషల్ మీడియాను ప్రధాన వేదికగా ఎంచుకున్నాయి. ఢిల్లీలో ఇటీవల చోటుచేసుకున్న కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల అనంతరం యువతకు మరింత దగ్గరయ్యేందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షాలు ముమ్మర చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులను ఉద్దేశించి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేక వీడియోలను షేర్ చేయగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఆస్క్ మీ ఎనీథింగ్' వంటి ప్రత్యేక సెషన్లు నిర్వహించి ఆ వీడియోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. పలువురు కేంద్ర మంత్రులు కూడా యువతతో మమేకమయ్యేందుకు ఆసక్తి చూపించడంతో వీరి డిజిటల్ ప్రభావం గణనీయంగా పెరిగినట్లు 'డేటా బిగిన్స్' సంస్థ వెల్లడించింది.

'డేటా బిగిన్స్' సంస్థ జులై 20 తర్వాత సేకరించిన గణాంకాల ప్రకారం.. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ ఎంగేజ్‌మెంట్ రేట్ (వ్యూస్, లైక్స్, షేర్లు, కామెంట్లు) ఏకంగా 289.9 శాతం మేర పెరిగింది. ఆయన ఒక్కో పోస్టుకు సగటు ఎంగేజ్‌మెంట్ గతంలో ఉన్న 11.90 లక్షల నుంచి 46.30 లక్షలకు చేరి, దాదాపు 3.9 రెట్ల మేర వృద్ధి నమోదు చేసింది. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇన్‌స్టా ఎంగేజ్‌మెంట్ రేట్ 180.7 శాతం పెరిగి, ఆయన సగటు ఎంగేజ్‌మెంట్ 1.52 లక్షల నుంచి 4.26 లక్షలకు పుంజుకుంది. యువతను తమవైపు తిప్పుకోవడానికి, రాజకీయంగా తమ ముద్ర వేయడానికి ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ అత్యంత కీలకమైన డిజిటల్ వేదికగా మారిందని ఈ నివేదిక స్పష్టం చేసింది.

## కేసీఆర్ పాలన ప్రజల కోసం..
## కాంగ్రెస్ పాలన భూముల కోసం

**కూకట్‌పల్లిలో 22ఏ భూ బాధితుల సమావేశం**
**ప్రభుత్వమే ప్రజల భూములకు కబ్జాదారుగా మారింది**

**హైదరాబాద్, ఆగస్టు 26 (వుదయం)**



ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆస్తుల పాలిట కబ్జాదారుగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూకట్‌పల్లిలో నిర్వహించిన 22ఏ నిషేధిత భూముల బాధితుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు చెందిన సొంత ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజల అవసరాలే కేంద్రంగా సుపరిపాలన సాగిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భూములను విక్రయించడమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని విమర్శించారు. కేసీఆర్ అధికారంలోకి రాగానే తాగునీరు, విద్యుత్, సకాలంలో ప్రాజెక్టుల నిర్మాణం వంటి కీలక ప్రజా సమస్యలను పరిష్కరించి, ధాన్యం దిగుబడిలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలోనే రూ. 30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం విక్రయించిందని హరీశ్‌రావు ఆరోపించారు. భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు కూడా స్థలాలు లేకుండా ఇష్టారీతిన అమ్మకాలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఒకడుగు ముందుకేసి ప్రజల భూములను కూడా 22ఏ జాబితాలో చేర్చి వారి వద్ద నుంచి లాక్కొని, తమ అనుచరులకు కట్టబెట్టే కుట్రలు చేస్తున్నారని ఆయన తీవ్ర విమర్శలు చేశారు.



# 4వ 'లోక కల్యాణార్థమై' పాదయాత్ర గోడపత్రికా ఆవిష్కరణ

కోహీర్ ఆగస్టు 26
(వుదయం ప్రతినిధి )

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం బడంపేట గ్రామం లో ప్రసిద్ధి గాంచిన శ్రీ రచ్చన్న స్వామి దేవస్థాన ఆలయంలో లోక, కల్యాణర్థమై పాదయాత్ర గోడపత్రిక ఆవిష్కరించారు ఈ సందర్భంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ చేపడుతున్న 4వ పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికను,ఆహ్వాన పత్రాలను స్థానిక ఆలయ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ దయానంద్ పాటిల్ మరియు నిర్వాహకులు, భక్తులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక పాదయాత్ర విశేషాలను వెల్లడించారు. ఈ ఆధ్యాత్మిక పాదయాత్రను సెప్టెంబర్ 6, 2026 న నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి జహీరాబాద్, బీదర్, నారాయణ్‌ఖేడ్, చిట్గుప్ప, సదాశివపేట్ లలోని 'వేంకటేశ్వర షాపింగ్ మాల్' సహకారం అందిస్తోంది.తెలియజేసారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు, కమిటీ సభ్యులు పోస్టర్లతో పాటు ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు.ఈ లోక కల్యాణ పాదయాత్రలో భక్తులందరూ విశేష సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.



# క్రిమిసంహారక మందు పిచికారీ

- "దోమల నివారణకు గ్రామ పంచాయతీ చర్యలు"

కోహీర్ ఆగస్టు 26
( వుదయం ప్రతినిధి )

కోహీర్ మండలం లోని గుర్జివాడ గ్రామం లో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. దోమలు, క్రిమికీటకాల బెడదను అరికట్టి గ్రామాన్ని ఆరోగ్యకరంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈ మందుల పిచికారీ చేపట్టారు.
గ్రామ ప్రతి గల్లీ, ప్రధాన రహదారులు మరియు అన్ని కాలనీల ప్రాంతాల్లో యంత్రాల ద్వారా క్రిమిసంహారక మందును చల్లారు.ఈగలు, దోమలు ఎక్కువగా వృద్ధి చెందే మురుగు కాలువలు మరియు చెత్త కుప్పల వద్ద ప్రత్యేకంగా మందును పిచికారీ చేశారు.
వర్షపు నీరు నిలిచి ఉన్న నీటి గుంటలు, రద్దీ ప్రదేశాలలో దోమల లార్వాలను అంతం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా జాగ్రత్తపడాలని సర్పంచ్ కోరారు.
సీజన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ముందస్తు సూచనలు చేశారు.వర్షాకాలంలో తాగునీటి ద్వారా రోగాలు వ్యాపించే ప్రమాదం ఉన్నందున ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. రాబోయే రోజుల్లో కూడా గ్రామంలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు మరియు స్ప్రేయింగ్ కొనసాగిస్తామని పంచాయతీ వర్గాలు తెలిపారు.

# వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నాయకులు



సిద్దిపేట, ఆగస్టు 26
(వుదయం బ్యూరో)

సిద్ది పేట పట్టణ కేంద్రంలోని బుధవారం సీసీ గార్డెన్‌లో 23వ వార్డు మాజీ కౌన్సిలర్ నాయకం పుష్పలతలక్ష్మణ్ దంపతుల కుమార్తె సౌమ్య గౌరవ్‌ల వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులను అక్షతలు వేసి ఆశీర్వదించారు.అనంతరం, ఎన్జీఓస్ కాలనీ (8వ వార్డు)కి చెందిన వారాల సురేష్ కుమార్ గత వారం గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకున్న వంశీధర్ రావు, ఆయన నివాసానికి వెళ్లారు. సురేష్ కుమార్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిలాద్ - ఉన్- నబీ సందర్భంగా రక్తదాన శిబిరం

మహబూబ్ నగర్ ఆగస్టు26
(వుదయం ప్రతినిధి)



మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా టీమ్ సోషల్ వర్కర్స్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినందుకు సమాజ సేవలో అంకిత భావంతో కృషి చేస్తున్నందుకు టీమ్ సోషల్ వర్కర్స్ సభ్యులను, స్వచ్ఛంద కార్యకర్తలను అభినందించారు. స్వచ్ఛంద రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, రక్తదానం అనేది విలువైన ప్రాణాలను కాపాడగలిగే ఒక గొప్ప కార్యమని ఆయన పేర్కొన్నారు. రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, క్రమం తప్పకుండా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన ప్రోత్సహించారు. రక్తదాతల విలువైన సహకారాన్ని అభినందించడంతో పాటు, ప్రజలలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకుల కృషిని కూడా ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీమ్ సోషల్ వర్కర్స్ సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, రక్తదాతలు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# తిమ్మాజిపేట ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల నుంచి తొలగించాలి

నాగర్ కర్నూల్, ఆగస్టు 26
(వుదయం ప్రతినిధి):



తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్‌లో విచారణ పేరుతో పాలమూరు మహేందర్‌పై జరిగినట్లు ఆరోపిస్తున్న దాడి ఘటనను బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తీవ్రంగా ఖండించింది. బాధ్యులైన తిమ్మాజిపేట ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లను తక్షణమే విధుల నుంచి తొలగించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేందర్‌ను పృథ్వీరాజ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు పిలిచిన మహేందర్‌ను ఎస్సై తీవ్రంగా కొట్టినట్లు ఆరోపించారు. అంతేకాకుండా, విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ మహేందర్ మెడపై కాలు పెట్టగా, ఎస్సై మూత్ర విసర్జన చేసినట్లు బాధితుడు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలు నిజమైతే ఘటన అత్యంత అమానుషమని అన్నారు.
బాధితుడికి, ఆయన కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని, పోలీసుల రక్షణలోనే చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. ఘటనపై ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. మహేందర్ ఆరోగ్యం కుదుటపడిన అనంతరం ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని పృథ్వీరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి సి.కళ్యాణ్, జిల్లా ఈసీ మెంబర్ బాలస్వామి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహర్ష ముదిరాజ్, అసెంబ్లీ అధ్యక్షులు పరశురామ్, కార్యదర్శి మధు, మండల అధ్యక్షులు శంకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుతంగా మిలాద్-ఉన్-నబీ ర్యాలీ

- రక్తదాన శిబిరాన్ని అభినందించిన సీఐ సైదిరెడ్డి..

వుదయం, తెల్లాపూర్
ప్రతినిధి(ఆగస్టు 26):



రామచంద్రపురం మండలం తెల్లాపూర్ డివిజన్ కేసీఆర్ నగర్ ఫేస్-02లో మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. రక్తదాన శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.కార్యక్రమానికి కొల్లూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చి. సైదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ఎంతో మంచి కార్యక్రమమని, అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మిలాద్‌ఉన్‌నబీ ర్యాలీని శాంతియుతంగా నిర్వహించాలని, ఎలాంటి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ర్యాలీలో మైనారిటీ సోదరులు షేక్ అబ్దుల్ రషీద్, మొహద్ తాజ్, షేక్ ఖాజా హుస్సేన్, అబ్దుల్ రహీమ్, అథర్ అలీ, అబ్దుల్ సత్తార్, ఖుద్దూస్, అబ్దుల్, బి. కోటేష్ నాయక్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

# బైక్ దొంగతనం కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

- తీర్పు వెల్లడించిన ములుగు కోర్టు న్యాయమూర్తి సిరిగిరి మనివీర్


సిద్దిపేట, ఆగస్టు 26
(వుదయం బ్యూరో)

ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బైక్ దొంగతనం కేసులో ఇద్దరు నిందితులకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ గౌరవ కోర్టు న్యాయమూర్తి శ్రీ సిరిగిరి మనివీర్ బుధవారం సంచలన తీర్పు వెల్లడించారు. కేసు వివరాల్లోకి వెళితే... సిద్దిపేట జిల్లా ములుగు మండల గ్రామానికి చెందిన తైల బీరయ్య (47) తన ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం దొంగతనానికి గురైందని ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు 2025 నవంబర్ 03న కేసు నమోదు చేసిన నాటి ములుగు ఎస్ఐ రఘుపతి సమగ్ర దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలు సేకరించారు. దొంగతనానికి పాల్పడిన పర్వతం నరసింహులు (29), తూర్పాటి వంశీ (20)లను అరెస్ట్ చేసి, వారిపై పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. కోర్టు విచారణ సందర్భంగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) కె. మాధవి సమర్థవంతంగా వాదనలు వినిపించగా, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, కోర్టు సీడీఓ స్వామి సమన్వయంతో సాక్ష్యాధారాలను న్యాయమూర్తికి సమర్పించారు. పోలీసు అధికారులు సేకరించిన పక్కా సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి సిరిగిరి మనివీర్, నేరం రుజువు కావడంతో నిందితులు పర్వతం నరసింహులు, తూర్పాటి వంశీలను దోషులుగా నిర్ధారిస్తూ ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో సమర్థవంతంగా దర్యాప్తు జరిపి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి ఎస్ఐ రఘుపతి, ఏపీపీ కె. మాధవి, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓ స్వామి మరియు ములుగు పోలీస్ సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

# శ్రీ పట్టాభిరామచంద్ర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

...ముఖ్య అతిథిగా దిల్‌రాజు





వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండల కేంద్రంలోని J.S.R. నగర్‌లో నిర్మించిన శ్రీ పట్టాభిరామచంద్ర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆగస్టు 26, 27, 28 తేదీల్లో మూడు రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ఈ మహోత్సవానికి ప్రముఖ తెలుగు సినీ నిర్మాత దిల్‌రాజు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.పోరుమామిళ్లకు చెందిన యువ కథానాయకుడు వంశీ కృష్ణ చౌరవతో, గ్రామ ప్రజలు, దాతలు, బంధువులు, శ్రేయోభిలాషుల సహకారంతో ఈ ఆలయం రూపుదిద్దుకుంది. తన సొంత ఊరికి శాశ్వతంగా నిలిచిపోయే ఒక మంచి కార్యక్రమం చేయాలనే సంకల్పంతో వంశీకృష్ణ ఈ పవిత్ర కార్యానికి ముందుకొచ్చారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందించడంతో పాటు ఆర్థిక సహకారం అందించి, కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ నిర్మాణంలో భాగస్వాములయ్యారు.వంశీకృష్ణ చౌరవతో ప్రారంభమైన ఈ కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజలందరి కార్యక్రమంగా మారింది. గ్రామంలోని దాతలు, బంధువులు, శ్రేయోభిలాషులు తమ వంతు సహాయాన్ని అందించగా, ఆలయ కమిటీ సభ్యులు అందరినీ సమన్వయం చేస్తూ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లారు. అందరి సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తయింది.ఆగస్టు 26, 27, 28 తేదీల్లో జరిగే ప్రతిష్ఠా మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులందరికీ ఉచిత అన్నదాన సేవ కూడా ఏర్పాటు చేస్తున్నారు.ఈ మహోత్సవానికి ప్రముఖ నిర్మాత దిల్‌రాజుతో పాటు స్థానిక ఎమ్మెల్యే డా. దాసరి సుధా, ఎమ్మెల్సీ గోవింద రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ సూర్యనారాయణ రెడ్డి, వైసీపీ అదనపు ఇన్‌చార్జ్ విశ్వనాథ రెడ్డి, నిర్మాతలు శ్రీరాములు జడపోలు, హైమావతి జడపోలు, ఇతర ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు, గ్రామ పెద్దలు, దాతలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొననున్నారు.ఆగస్టు 26, 27, 28 తేదీల్లో జరిగే శ్రీ పట్టాభిరామచంద్ర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవానికి భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ ఆహ్వానిస్తోంది.
జై శ్రీరామ్!



# విద్యా సదస్సుకు హైదరాబాద్ తరలివెళ్లిన ఉపాధ్యాయులు

నాగర్ కర్నూల్, ఆగస్టు 26
(వుదయం ప్రతినిధి):

ధర్మ టీచర్స్ యూనిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జరుగుతున్న రాష్ట్ర విద్యా సదస్సుకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 20 మంది ఉపాధ్యాయులు తరలివెళ్లారు.ధర్మ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గుడిపల్లి నిరంజన్, ప్రధాన కార్యదర్శి కూరాకుల ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులు కొంగరి జానయ్యల నేతృత్వంలో వారు బయలుదేరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షులు చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ, విద్యారంగ నిపుణులు ప్రొఫెసర్ నాగేశ్వర్, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగం కుమారస్వామి, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ హాజరవుతున్నారు.

# వ్యక్తి ఆత్మహత్య వీరారెడ్డి

వుదయం మనూరు తేదీ:26/8/2026



మనూరు,గ్రామం, బోరంచ గ్రామానికి చెందిన,కాపులాపురం వీరారెడ్డి తండ్రి:నర్సారెడ్డి,వయసు: 54 సంవత్సరాలు,వృత్తి:వ్యవసాయం.పుట్టుకతో పోలియో ఉండడం,వలన కుడికాలు పనిచేయడం,లేదు, ఐన కూడా వ్యవసాయం.చేస్తుండేవాడు. ఐతే ఏడాది క్రితం.ఆక్సిడెంట్ అవ్వగా మంచిగా ఉన్న ఎడమకాలు విరగడంతో.సర్జరీ. అయ్యి ఇంటి దగ్గరే ఉంటున్నాడు. అయితే ఆ కాలు నొప్పి.భరించలేక అనారోగ్యంతో మనస్థాపం.చెంది నిన్న 25.08.2026 రోజున.ఉదయం 5 గంటల సమయంలో.ఆసిడ్ తాగి ఆత్మహత్య ప్రయత్నం. చేసుకోగా. ఉస్మానియా హాస్పిటల్ "కి తీసుకెళ్తున్న సమయంలో,చనిపోయాడు. ఇట్టి విషయం, మీద అతని భార్య స్వరూప, పిర్యాదు, ఇవ్వగా దర్యాప్తు ప్రారంభించడం, జరిగింది.

# ఇంటి నిర్మాణానికి రూ.10 వేల ఆర్థిక సహాయం



- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

వెల్దండ ఆగస్ట్ 26 (వు దయం)

మండల పరిధిలోనిరాచూర్ గ్రామానికి చెందిన నిరుపేద మాడుగుల జయరామ్ ఇంటి నిర్మాణం కోసం ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ఇబ్బంది పడుతున్న జయరామ్‌కు తన వంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందించారు.ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అవసరమైన వారికి తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ నాగులు నాయక్,మాజీ సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు సూరమల్ల సుభాష్,రవి తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ మండలంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పర్యటన



కొండాపూర్ వుదయం :

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.గొల్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు బల్జగూడెం నాగేష్ కుమార్తె వివాహం సందర్భంగా వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మల్లేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన రామప్ప తండ్రి కుటుంబాన్ని పరామర్శించి, మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే తోగార్‌పల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు రవి తండ్రి మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమాల్లో TNGOs రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ప్రేమానందం, ప్రభాకర్ రెడ్డి, బాల గౌడ్, రామప్ప, మానేయ్య, సతీష్, రవి, బుచ్చయ్య యాదవ్ పాల్గొన్నారు.

# వచ్చే 15 రోజులు బీఎల్ఏలు అప్రమత్తంగా పనిచేయాలి

- జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై శిక్షణ

సంగారెడ్డి వుదయం



ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వచ్చే 15 రోజులు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అప్రమత్తంగా పనిచేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. వారి ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సాంస్కృతిక కార్పొరేషన్ చైర్మన్, ఎస్ఐఆర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ వెన్నెల గద్దర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, అసెంబ్లీ కోఆర్డినేటర్ దయాకర్, మాస్టర్ ట్రైనర్ చైతన్య ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఏలకు అవగాహన కల్పించారు. రెండో దశ ఎస్ఐఆర్‌లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ సభలకు బీఎల్ఏలు తప్పనిసరిగా హాజరై ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు.ఓటర్ల జాబితాలోని ఆబ్సెంట్, షిఫ్టింగ్, డెత్, డూప్లికేట్ (ASDD) ఓట్లను పునఃపరిశీలించడంతో పాటు అనామలిస్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గంలో సుమారు 64 వేల ఓట్లపై స్పష్టత వచ్చే వరకు క్షేత్రస్థాయిలో శ్రమించాలని సూచించారు.ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందని అర్హులైన ఓటర్లకు ఫారం6 అందజేసి వారి ఓటు హక్కును పరిరక్షించాలని తెలిపారు. డెత్, ఆబ్సెంట్‌గా నమోదైన ఓటర్ల ఇళ్లకు బీఎల్ఏలు స్వయంగా వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు.ఓటర్ల జాబితా సవరణలో ఇదే కీలకమైన అవకాశమని, ప్రతి ఓటు వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. బీఎల్ఏలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

# ఆంజనేయస్వామి ఆలయానికి భూమి పూజ చేపట్టిన ఎమ్మెల్యే

మెదక్ జిల్లా వుదయం



నిజాంపేట మండల పరిధిలోని చౌకత్ పల్లి గ్రామంలో గ్రామస్థుల భాగస్వామ్యంతో నిర్మించతలపెట్టిన శ్రీ హనుమాన్ దేవాలయ నిర్మాణ పనులకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత బాబు నాయక్, ఉప సర్పంచ్ సూరా రాములు, మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు,రామాయంపేట చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు,సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు భాను ప్రకాశ్ రెడ్డి, మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ అమర సేనా రెడ్డి ,నసీరుద్దీన్, మాజీ ఎంపిటిసి చింతల స్వామి,కొమ్మట బాబు,వైవెంకటేశం, లింగంగౌడ్, సర్పంచులు రామచంద్ర నాయక్, బాబు నాయక్,నాయకులు రవీందర్ రెడ్డి,ముత్యాల మధుసూదన్ రెడ్డి,రమేష్, దేమేయాదగిరి,సురేష్, సూర్య నాయక్, నరేష్ నాయక్,రాజు నాయక్, నాయక్, రాజేష్,శ్రీనివాస్, సులేమాన్,గరుగుల శ్రీనివాస్,సుధాకర్, పాల్గొన్నారు.



# ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- చిన్నంబావి మండల అధ్యక్షుడిగా
- కే. గోపాల్ మాదిగ

చిన్నంబావి మండలం 26
(వుదయం రిపోర్టర్ )

చిన్నంబావి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చిన్నంబావి మండల ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఇన్చార్జి దేవని రమేష్ మాదిగ, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ వనపర్తి జిల్లా ఇన్చార్జి కొమ్మువారి మస్తాన్ మాదిగ, జిల్లా మాజీ అధ్యక్షులు కొమ్ము కేశవులు మాదిగ, గంధం గట్టయ్య మాదిగ, మీసాల నాగరాజు మాదిగ, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ఇన్చార్జి కొమ్మువారి మస్తాన్ మాదిగ, మాట్లాడుతూ మత దురహంకారం, కుల వివక్ష, సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తగరం కురుమయ్య మాదిగ, వడ్డేమాన్ రామకృష్ణ మాదిగ, ఎస్ శ్రీనివాసులు మాదిగ, సంపంగి మద్దిలేటి మాదిగ, కాన్షిరం మాదిగ, వెంకటేష్ మాదిగ, కత్తి కురుమూర్తి మాదిగ, చిన్నమారు సర్పంచ్ మద్దూరి శంకర్ మాదిగ, కల్లు శ్రీనివాసులు మాదిగ, సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న మాదిగ, డి ఎన్ కృష్ణ వివిధ గ్రామాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్ధినిని పరామర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

వుదయం, మిరుదొడ్డి



మిరుదొడ్డి మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాల పైనుండి ప్రమాదవశాత్తు పడి తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని కుర్ర వర్ధినిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బుధవారం పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న చైర్మన్ వర్ధిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో, ఆసుపత్రి ఆర్ఎంఓ ఆనంద్ తో మాట్లాడుతూ, బాలికకు మెరుగైన వైద్యం అందించాలని, ఎటువంటి లోటు రాకుండా చూడాలని ఆదేశించారు. బాలిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా అల్వాల గ్రామ మాజీ సర్పంచ్ కిష్టయ్య అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ లో చికిత్స పొందుతుండగా, ఆయనను కూడా చైర్మన్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ పరామర్శలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్





## రూ.40.50 లక్షలతో స్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**దుండిగల్, ఆగష్టు 26 ,(వుదయం ప్రతినిధి ),**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ డివిజన్ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్ (214)లో రూ.40.50 లక్షల నిధులతో చేపట్టనున్న స్మశాన వాటిక అభివృద్ధి పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. రూ.40.50 లక్షలతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనుల ద్వారా స్మశాన వాటికలో అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడనున్నాయని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కల మల్లేష్ యాదవ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొట్ల విజయ్ కుమార్, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చెవిటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, కావలి శశి కుమార్, ఆకుల ప్రేమ్, శ్రీకర్ రెడ్డి, మైనార్టీ నాయకులు నయీమ్, మహేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యారంగాన్ని సంక్షోభం నుంచి కాపాడాలి

- **విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలి.. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి**
- **ధర్మ టీచర్స్ యూనిటీ రాష్ట్ర విద్యా సదస్సులో వక్తల డిమాండ్**

**ముషీరాబాద్,ఆగస్టు26 (వుదయం)**



తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు మరింత చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని ధర్మ టీచర్స్ యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర విద్యా సదస్సులో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విద్యకు కనీసం 20 శాతం బడ్జెట్ నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు.

ధర్మ టీచర్స్ యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర విద్యా సదస్సుకు శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, దామెర ఉపేందర్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యారంగ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

రాష్ట్ర ఆవిర్భావం సమయంలో సుమారు 48 శాతంగా ఉన్న విద్యార్థుల ఎన్రోల్మెంట్ ప్రస్తుతం 31 శాతానికి పడిపోయిందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సూచీలో తెలంగాణ 37వ స్థానంలో ఉండటం రాష్ట్ర విద్యారంగ పరిస్థితికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ.. ఆ ప్రకటనలు గ్రామీణ స్థాయిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆచరణలో కనిపించడం లేదని విమర్శించారు.

ఇప్పటికీ రాష్ట్రంలోని సుమారు 3,500 పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా విద్యారంగ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

విద్యకు బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలనే డిమాండ్ ఉన్నప్పటికీ, అందుకు అనుగుణంగా నిధులు కేటాయించడం లేదని వక్తలు విమర్శించారు. విద్యారంగానికి తగిన నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందించాలని కోరారు.

ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పాలకులకు విద్యా రంగంపై చిత్తశుద్ధి కొరవడిందని విమర్శించారు. మనసుపెట్టి పరిపాలన చేస్తే తెలంగాణలో విద్య, వైద్య రంగాలను దేశంలోనే ఆదర్శంగా అభివృద్ధి చేయవచ్చని అన్నారు.

ధర్మ టీచర్స్ యూనిటీ మహాత్మా జ్యోతిరావు పూలే, సాహూ మహారాజ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, వారసత్వాన్ని కొనసాగించే సంఘమని వక్తలు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉపాధ్యాయుల హక్కుల కోసం ముందుండి పోరాడుతూనే.. సంక్షోభంలో ఉన్న తెలంగాణ విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సదస్సులో నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల ఎన్రోల్మెంట్, ఉపాధ్యాయుల సమస్యలు, విద్యకు బడ్జెట్ కేటాయింపులు వంటి అంశాలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ధర్మ టీచర్స్ యూనిటీ నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లింబాద్రి, మాజీ ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కూరపాటి వెంకట్ నారాయణ, ఎం.వి.కె. ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్ రెడ్డి, అధికారి డాక్టర్ టి. చిరంజీవి, ఆలమూరు యూనివర్సిటీ ఆచార్యులు నాగం కుమార్ స్వామి, ఎకనామిక్స్ ఫైనల్ గ్రూప్ మరియు సివిల్ సర్వీసెస్ అధినేత చౌటి ప్రభాకర్, ధర్మ టీచర్స్ యూనిటీ రాష్ట్ర బాధ్యులు నాదరి రమేష్, కొత్తూరు రాజు, ప్రతీ అశోక్, జంగం అంజన్న, బాబు, పరిగి జనార్ధన్, భూపతి, గల్లా సుధాకర్, ముద్దమల్ల వేణు, కేసుగాని దేవయ్య, మాచర్ల పారిజాత, రామగిరి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో అక్టోబర్ 30 నుంచి బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు

- **గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలి**
- **ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల విజ్ఞప్తి**

**మేడిపల్లి వుదయం ప్రతినిధి ఆగస్టు 26.**




బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ గ్రామంలో బొడ్రాయి (గ్రామ దేవత) ప్రతిష్ఠాపన మరియు పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలను అక్టోబర్ 30, 31 నవంబర్ 1 వ తేదీలలో మూడు రోజులపాటు ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత వైభవంగా జరుపుకోవాలని బుధవారం ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ఒక సమావేశం నిర్వహించి ప్రజలకు విజ్ఞప్తి చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... గ్రామ సుభిక్షం, ఆయురారోగ్యాలు, పాడిపంటలు, సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షిస్తూ...... ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారని, ఈ మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, హోమాలు ,యజ్ఞాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారని ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి భక్తులు ,గ్రామస్తులు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మదర్ తెరిసా 116 జయంతి వేడుకలు

**నిజాంపేట్, ఆగష్టు 26, (వుదయం ప్రతినిధి ),**



మదర్ తెరిసా 116వ జయంతి వేడుకలు రాజీవ్ గృహకల్పలో మదర్ తెరిసా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, 276 డివిజన్ ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి), బండారి లేఅవుట్ 275 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు, మాజీ కార్పొరేటర్ చిట్లి దివాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి నివాళులు అర్పించారు.అనంతరం కల్వరి టెంపుల్ వారి ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా కె ఎస్ ఆర్ మాట్లాడుతూ మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయం అని వారు నిరుపేదలకు చేసిన సేవలను కొనియాడారు. పేదలందరికీ ఉపయోగపడే ఉచిత మెడికల్ క్యాంప్ ను అందరూ వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మదర్ థెరిసా అసోసియేషన్ వారిని అభినందించారు.

ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు, అధ్యక్షులు పోచారం ప్రభాకర్ రెడ్డి, నర్సింగ్ రావు, నాయుడు, నాగభూషణ్, శ్రీను, పి శ్రీను, పాల శ్రీను, శివ, మూర్తి, బుజ్జి, బాలకృష్ణ, సరళ లక్ష్మణ్, సురేష్, నాయబ్, గూడూరు మురళీకృష్ణ, దాసరి మహేష్ కుమార్, ప్రశాంత్ రెడ్డి, మేడ వెంకట్, రాయల దీపక్,భిక్షపతి, మొరంపూడి శ్రీనివాస్, శ్రీరామ్ రెడ్డి, సుధాకర్, రామకృష్ణ, రాము, ఎన్ సత్యవతి, సరిత రెడ్డి, ఎం సత్యవతి, ఉషారాణి, రాణి, నవ్య, సుమతి, ఉష, కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సేవా కార్యక్రమం

- **మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సేవా కార్యక్రమం**
- **మహమ్మద్ ప్రవక్త ప్రేమ, కరుణ, మానవతా మార్గంలో పండ్ల పంపిణీ**
- **రోగులు,విద్యార్థినిలకు పండ్లు పంపిణీ చేసిన మైనారిటీ నాయకులు**

**చేవెళ్ల,ఆగస్టు26(వుదయం)**

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే “మిలాద్ ఉన్ నబీ” సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మైనారిటీ నాయకులు సేవా భావాన్ని చాటుకున్నారు.మహమ్మద్ ప్రవక్త చూపిన ప్రేమ, కరుణ,మానవతా మార్గంలో పయనిస్తూ బుధవారం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, అలాగే కస్తూరిబా మహిళా వసతి గృహ విద్యార్థినిలకు పండ్లను పంపిణీ చేశారు.మత భేదాలకు అతీతంగా మానవ సేవే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా మిలాద్ ఉన్ నబీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం ద్వారా ప్రవక్త చూపిన మానవతా విలువలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఫరీన్ ఖదీర్ పాషా, ఉర్దూ రిపోర్టర్ సిరాజుద్దీన్, హాజీ, నజీమ్, చోటు, అక్బర్, రఫీ, నవీద్, ఖలేద్, జమ్మూ, సలీం, నాహేద్, ఖాజా పాషా, రెహమాన్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ ఘని, కోఆప్షన్ మెంబర్ చాంద్ పాషా, NSUI చేవెళ్ల మండల అధ్యక్షుడు ఎండీ. సమీరుద్దీన్, ఫయాజ్ అలాగే BRS నాయకులు జాహేద్, మసరత్, ఇస్మాయిల్, రియాజ్, రఫీఖ్, ఫైమీద్, హామీద్ షరీఫ్, ఖాజా, లఈఖ్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.





### ఎన్నికల హామీని నిలబెట్టుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్
## దేవర సమత వెంకట్ రెడ్డి

**చేవెళ్ల,ఆగస్టు26 (వుదయం)**

చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి ముందుకు సాగుతున్నారు.చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని బుధవారం 16వ వార్డుకు చెందిన చాకలి అనంతయ్య కుమార్తె వివాహానికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే మా బాధ్యత అని చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని, పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు.అవసరమైన సమయంలో ఆపన్నహస్తం అందిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోలిపురం బల్వంత్ రెడ్డి, మాజీ ఉప సర్పంచులు టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, గంగి యాదయ్య, నాయకులు అత్తిలి రవీందర్ రెడ్డి, కవాడి రాజా వర్ధన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, అత్తెల్లి రమణారెడ్డి, గ్రామ పెద్ద గొల్లగడ్డం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట రోడ్డు ప్రమాదానికి రవాణా శాఖ మంత్రి బాధ్యత వహించాలి

- **మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలి..**
- **రహదారుల దుస్థితిపై R&B మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమాధానం చెప్పాలి**
- **ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు**

**ముషీరాబాద్,ఆగస్టు26 (వుదయం)**

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం పరిధిలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు మృతి చెందడం, పలువురు గాయపడటం తీవ్ర విషాదకరమని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆమె విమర్శించారు.

ఒకే ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ప్రభుత్వం కేవలం సానుభూతి ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే ప్రమాదాలను గుర్తించి నివారించడమే ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.రవాణా శాఖ వైఫల్యానికి మంత్రి బాధ్యత వహించాలిప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, భారీ వాహనాల అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, వాహనాల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలపై రవాణా శాఖ పర్యవేక్షణ ఎంతవరకు ఉందో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని హేమా సుదర్శన్ డిమాండ్ చేశారు.అనుభవం లేని, సరైన శిక్షణ లేని డ్రైవర్ల నియామకం, అతివేగం, డ్రైవర్ల పని గంటల నియంత్రణ లేకపోవడం వంటి అంశాలపై కఠినమైన తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో రవాణా శాఖ విఫలమైందని భావిస్తున్నందున ఆ శాఖకు బాధ్యత వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ నైతిక బాధ్యత తీసుకుని రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

రోడ్ల దుస్థితిపై కోమటిరెడ్డి సమాధానం చెప్పాలి



ఉమ్మడి నల్గొండ జిల్లా, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో రహదారుల పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని హేమా సుదర్శన్ అన్నారు. దెబ్బతిన్న రహదారులకు తక్షణ మరమ్మతులు చేపట్టకుండా, అవసరమైన ప్రాంతాల్లో కొత్త రహదారులు నిర్మించకుండా R&B మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

ప్రజలు ప్రతిరోజూ ప్రమాదకరమైన రహదారులపై ప్రయాణిస్తున్నారని, కేవలం కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం సరిపోదని అన్నారు. ప్రజలు ప్రస్తుతం ఉపయోగిస్తున్న రహదారుల నాణ్యత, నిర్వహణ, భద్రతపై మంత్రి ప్రత్యక్ష బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన డిమాండ్లు

సూర్యాపేట రోడ్డు ప్రమాదంపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలి.

ప్రమాదానికి కారణమైన డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం, వాహనం ఫిట్‌నెస్ తదితర అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలి.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి.

అనుభవం, సరైన శిక్షణ కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలి.

డ్రైవర్లకు క్రమం తప్పకుండా ఆరోగ్య, డ్రైవింగ్ సామర్థ్య పరీక్షలు నిర్వహించాలి.

అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రమాదంలో మృతి చెందిన ప్రతి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలి.

గాయపడిన వారందరికీ ప్రభుత్వ ఖర్చుతో మెరుగైన ఉచిత వైద్యం అందించాలి.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

అత్యవసర ప్రాంతాల్లో కొత్త రహదారులు నిర్మించి రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలి.

రోడ్ల నాణ్యత, నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

ప్రజల ప్రాణాలకు విలువ లేని పాలన అవసరం లేదు

ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే దానికి బాధ్యత వహించాల్సిందేనని హేమా సుదర్శన్ అన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత పరిహారం ప్రకటించడం కంటే ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే ప్రభుత్వానికి అసలైన బాధ్యత అని పేర్కొన్నారు.

సూర్యాపేట ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలని, రహదారుల నిర్వహణ, మరమ్మతులు, భద్రతపై R&B మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

ఈ ప్రెస్‌మీట్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ కిసాన్ వింగ్ అధ్యక్షుడు నీరేటి ఆంజనేయులు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి ఏకపక్ష వైఖరిపై
## స్థానికుల తీవ్ర నిరసన

**హైదరాబాద్ :**

కమిటీ సభ్యులను ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆరోపణ బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితిలో కేవలం అగ్రవర్ణాల వారికే ప్రాధాన్యం ఇస్తూ, బడుగు బలహీన వర్గాల ప్రజలను దూరంగా పెడుతున్నారంటూ బుధవారం బాలాపూర్ గణేశ్ మండపం వద్ద కొందరు స్థానికులు నిరసన ధర్నా చేపట్టారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ఉత్సవ సమితిపై ఉందని ఈ సందర్భంగా బొర్ర రవి పేర్కొన్నారు.గణనాథుడికి సేవ చేసుకునే భాగ్యాన్ని తమకు కూడా కల్పించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. బాలాపూర్ లడ్డూ కేవలం ఒకే వర్గానికి (రెడ్డి వర్గానికి) మాత్రమే వరంగా మారుతోందని, ఈ విషయమై కమిటీ సభ్యులను ప్రశ్నిస్తే తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, స్వామి వారి హుండీ ఆదాయం, దానికి సంబంధించిన లెక్కలను కూడా బయటకు బహిర్గతం చేయడం లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్సవ సమితి ఇదే రకమైన మొండి వైఖరిని కొనసాగిస్తే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించి, తమ ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఇక ఈ నిరసన ధర్నాకు స్థానికుడైన పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

**IN THE COURT OF THE HON'BLE IV ADDL.JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DIST AT : L.B.NAGAR**
**O.S.No. 656 of 2026**
**Between :**
Smt.Vimala Ramakrishna and Others ..Plaintiffs
**AND**
1. The Tahasildar, Saroornagar Mandal
2. All Concerned ..Defendants

To D-2 ALL CONCERNED

Take notice that the Plaintiffs filed the above Suit for Declaration declaring the Plaintiffs are the Legal Heirs and Successors of Late Valaja Ramakrihna @ Ramakrishna Venugopal, S/o. Late V.Venu Gopal was died on 09-10-2018 and the suit is stands posted to **21/09/2026**. If any person or persons having any Objections or Claims they may appear before the above Court on **21/09/2026** at 10.30 a.m. either in person or through an Advocate, failing which the matter will be decided basing on the documents available on record.

(BY ORDER OF COURT)

**Sd/-**
**M/s.K.Raja Reddy, A.V.Sujith Kumar, Advocates, Hyd.**
**Counsel for the Plaintiffs**

## మోడల్ కాలనీలో వనమహోత్సవం

- **మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**చేవెళ్ల,ఆగస్టు26(వుదయం)**



చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి,వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.భావితరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతోనే వనమహోత్సవ కార్యక్రమాలను చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు.మొక్కలు నాటడంతో పాటు వాటిని బాధ్యతగా సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పచ్చదనం పెంపొందించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు,మండల పార్టీ అధ్యక్షులు,PACS చైర్మన్లు,సర్పంచుల సంఘం అధ్యక్షులు,

సర్పంచులు,మాజీ సర్పంచులు,ఉప సర్పంచులు,సీనియర్ నాయకులు,మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ అభయ హస్తం అమలు చేయకపోతే కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో తిరగనివ్వం

**చేవెళ్లలో దళిత, గిరిజన, ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో 'చాయ్ పే చర్చ'.. బొంకూరి సురేందర్ సన్నీ, కండెల వెంకటేశ్వర్లు**

**చేవెళ్ల, ఆగస్టు 26 (వుదయం):**



అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని తక్షణమే అమలు చేయాలి.. లేకపోతే కాంగ్రెస్ పార్టీ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వబోమని దళిత, గిరిజన,ఆదివాసీ జేఏసీ నాయకులు బొంకూరి సురేందర్ సన్నీ, కండెల వెంకటేశ్వర్లు హెచ్చరించారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ అభయ హస్తం పేరుతో దళిత, గిరిజన,ఆదివాసీ ప్రజలకు పలు హామీలు ప్రకటించిందని వారు గుర్తుచేశారు. ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షలు అందించడం, ఎస్సీలకు మూడు కార్పొరేషన్లు,ఎస్టీలకు మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు 12 అంశాలతో కూడిన హామీలను ప్రకటించారని తెలిపారు.ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలి మంత్రివర్గ సమావేశంలోనే హామీలను అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటికీ మూడేళ్లు కావస్తున్నా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వారు ఆరోపించారు.దీనికి నిరసనగా అదే కేవీఆర్ గ్రౌండ్‌లో దళిత,గిరిజన, ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో 'చాయ్ పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా చేవెళ్ల చౌరస్తాలోని మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.అలాగే ఎరుకల నాంచారమ్మను కలిసి సోది అడిగారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్థాయిలో కాంగ్రెస్ నాయకులను నిలదీస్తామని, ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో బొంకూరి సురేందర్ సన్నీ, కండెల వెంకటేశ్వర్లు, బొంగు వెంకటేష్ గౌడ్, కండెల పెద్ద వెంకటేష్, మద్దెల భవాని, కళ్లేపల్లి రవి, వనం గంగయ్య, మిట్టపెల్లి రాధిక, వనం పుల్లయ్య, మిక్కిలి సుంకయ్య, జగన్నాథం మహేష్, జగన్నాథం శేఖర్, మ్యారడి అంజయ్య, వనం కావేరి, వనం లలిత, వనం పద్మ, మద్దెల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




వందల కులాలు పుట్టుకొస్తాయి

"కేంద్ర ప్రభుత్వం కులం వివరాలను వెల్లడించడానికి ఓపెన్ ఎండెడ్ ప్రశ్నల విధానాన్ని ఎంచుకుంది. ఇందులో జనాభా లెక్కల సేకరణ సమయంలో ప్రజలు ఏం కులం పేరు చెబితే అదే నమోదు చేస్తారు. భారత్‌లో ఒకే కులాన్ని విభిన్న ప్రాంతాల్లో విభిన్న పేర్లు, ఉప కులాలు, భాషల ద్వారా గుర్తిస్తారు. ఒకే కులానికి చెందిన వ్యక్తులు జన గణనలో వేర్వేరు పేర్లతో నమోదైతే ఒకే కులం వందల పేర్లతో విడిపోతుంది. దానివల్ల దేశవ్యాప్తంగా లక్షల కులాలు పుట్టుకొస్తాయి..."

-మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు

## వేమన' పద్యం



కులము గలుగువాడు గోత్రంబు గలవాడు
విద్యచేత విఱ్ఱవీగువాడు
పసిడి గలుగువాని బానిస కొడుకులు
విశ్వదాభిరామ! వినుర వేమ!

# సంపాదకీయం

## ప్రశ్నించే హక్కు శాశ్వతం

కుక్కను చంపాలనుకున్నప్పుడు దానిపై మోపే నెపం పిచ్చి. ఢిల్లీ ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ నోట దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో హఠాత్తుగా 'దిమాగీ నక్సల్స్' కూడా సదరు 'పిచ్చి' సాకు కిందికే వస్తుంది. తమను ప్రశ్నించే వారి గొంతులను నొక్కేసేందుకు ఎంచుకున్న ఎత్తుగా కనిపిస్తుంది. ఈ అంచనా గత పన్నెండేళ్ల బీజేపీ పాలనలో దేశం చవి చూసిన అనుభవాల నుంచి వస్తుంది. అడవుల్లోని సాయుధ నక్సలైట్లను నిర్మూలించడంలో విజయం సాధించిన వ్యక్తికీ, మావోయిస్టు భావజాలం కలిగిన వారు సమాజంలో పాతుకుపోయి ఉన్నారని, వారే దేశానికి కొత్త శత్రువులని, అటువంటి వారితోనే ముప్పు పొంచి ఉందని ప్రధాని పేర్కొనడం వెనుక అణిచివేత ప్రణాళికకు రూపకల్పన జరుగుతోందన్న అనుమానాలు బయలు దేరాయి. అక్కడితో ఆగకుండా దిమాగీలను గుర్తించి ఏకాకులను చేయాలనీ ప్రధాని అన్నారు. ఇప్పటివరకు మోదీ, ఆయన పార్టీ బీజేపీ పలు సందర్భాల్లో ప్రతిపక్షాలను, ప్రజా ఉద్యమకారులను, పౌర హక్కుల కార్యకర్తలను, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించే వారిని, నిరసన తెలిపే వారిపై అనేకానేక అభియోగాలు మోపుతున్నారు. దేశద్రోహులు, జాతి వ్యతిరేకులు, ఆటంక వాదులు, ఉగ్ర వాదులు, తీవ్రవాదులు, మావోయిస్టులు అనే ముద్ర వేసి కేసులతో వేధించి నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఇంకో అడుగు ముందుకేసి ప్రభుత్వాన్ని పార్లమెంట్‌లో, వెలుపల నిరసన తెలిపిన ప్రతిపక్ష నేతలను అర్బన్ నక్సల్స్ అని సంబోధించారు. ఈ పూర్వరంగంలో ఏకంగా దిమాగీ నక్సల్స్ అనే వరకు వెళ్లారంటే కచ్చితంగా నిరంకుశ ఎజెండా దాగి ఉంటుందన్నది స్పష్టం.

ప్రధాని 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం వెల్లువెత్తడంతో నష్ట నివారణకు ప్రభుత్వం తరఫున న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇచ్చిన వివరణ మరిన్ని సందేహాలను రేపింది. మావోయిస్టులకు మద్దతిచ్చేవారు, వేర్పాటు వాదులు, భారత రాజ్యాంగాన్ని తిరస్కరించే వారు, ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించే వారే దిమాగీ నక్సల్స్‌గా చెప్పుకొచ్చారు. అయితే ఈ ఆర్టికల్‌ను వ్యతిరేకించే వారందరూ మేధో నక్సలైట్లు అయితే ప్రతి పక్షాలు దిమాగీ నక్సల్స్ అవుతారా? వాస్తవానికి అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తిరస్కరించింది బీజేపీ మాతృక ఆరెస్సెస్, పరివారం. చెప్పాల్సి వస్తే ఆ సంస్థలే జాతి విద్రోహాలవుతాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక, ఆ పార్టీ పాలిత రాష్ట్రాలలో రాజ్యాంగ అసహనం అనేక మార్లు బయట పడింది. ఉపా, రాజద్రోహం, వంటి విశాలమైన తీవ్రమైన కేసులను, నిర్బంధాలను హక్కుల కార్యకర్తలు, ప్రజా ఉద్యమ కారులు, ప్రొఫెసర్లు, మేధావులు, కవులు, కళాకారులు ఎదుర్కొన్నారు. కోరేగావ్ కేసు అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. హిందూ ఉన్మాదుల చేతుల్లో పన్సారే, దబోల్కర్, కల్బుర్గి, గౌరీ లంకేశ్ వంటి వారు హత్యకు గురయ్యారు. మరెందరో దాడులను చవిచూశారు. జేఎన్‌యూ ఆందోళనలతో దిమ్మ తిరిగిన మోదీ ప్రభుత్వం, భవిష్యత్తులో ఇటువంటి పోరాటాలపై ఉక్కుపాదం మోపేందుకు సౌకర్యవంతమైన 'దిమాగీ నక్సల్స్' అనే పదాన్ని కనిపెట్టినట్లు విదితమవుతుంది. పౌర స్వేచ్ఛకు సంకెళ్లుగా చూడాలి. ప్రభుత్వ నిరంకుశ చర్యలను రాజ్యాంగ ప్రేమికులు, ప్రజాస్వామిక వాదులు, పార్టీలు, ప్రతి ఒక్కరూ ఖండించాలి.

'దిమాగీ నక్సల్స్' అంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ పరిహాసానికి కూడా దారితీశాయి. ఇప్పటికే యువతలో వ్యంగ్యంగా 'కాక్రోచ్ జనతా పార్టీ' వంటి పేర్లు వినిపిస్తుండగా, తాజాగా 'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో కొత్త రాజకీయ వ్యంగ్య వేదిక తెరపైకి వచ్చింది. అంటే, పాలకులు విమర్శకులకు పెట్టిన ముద్రలే తిరిగి పాలకులపై వ్యంగ్యాస్త్రాలుగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వాన్ని విమర్శించిన వారిని 'దిమాగీ నక్సల్స్'గా ముద్రించే ధోరణి కొనసాగితే రేపటి ప్రజాస్వామిక అసమ్మతికి ఎలాంటి పేరు పెడతారన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలక వ్యవస్థ, ప్రశ్నించే ప్రజలకే కొత్త కొత్త ముద్రలు వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. పాలకులు ప్రజల అసమ్మతిని అణచడం కంటే వారి ప్రశ్నలకు సమాధానం చెప్పడం ముఖ్యం. వారు జవాబు చెప్పనంత కాలం 'కాక్రోచ్' అయినా, 'దిమాగీ' అయినా పేర్లు మారుతాయి కానీ, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు మాత్రం శాశ్వతం.

### రచనలు పంపండి

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# అధ్వాన్న పారిశుధ్యం ప్రజారోగ్యానికి ముప్పు





నగరం అంటే ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, మెట్రో రైళ్లు, మెరిసే వాణిజ్య సముదాయాలు మాత్రమే కాదు. శుభ్రమైన వీధి, పొంగని కాలువ, సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన మార్కెట్, అందుబాటులో ఉండే ప్రాథమిక వైద్యం——ఇవే ఆరోగ్యకరమైన నగరానికి అసలు కొలమానాలు. కానీ దేశంలో పట్టణీకరణ వేగం పెరుగుతున్న కొద్దీ మౌలిక పారిశుధ్య వ్యవస్థలు అంతే వేగంగా బలపడుతున్నాయా? ఈ ప్రశ్నకు సమాధానం ఇంకా పూర్తిగా సంతృప్తికరంగా లేదు.

దేశ రాజధానిలో సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా, హెచ్1ఎన్1పై అప్రమత్తత పెరిగిన నేపథ్యంలో ఈ చర్చకు ప్రాధాన్యం వచ్చింది. కేంద్ర ఆరోగ్యశాఖ తాజా సమాచారం ప్రకారం ప్రస్తుతం దేశంలో వ్యాప్తిలో ఉన్న హెచ్1ఎన్1 వైరస్ సాధారణ కాలానుగుణ మార్పుల పరిధిలోనే ఉంది; కొత్తగా ప్రమాదకరమైన వైరస్ ఉద్భవించినట్లు ఆధారాలు లేవు. దేశవ్యాప్తంగా 73 వైరస్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీల ద్వారా నిఘా కొనసాగుతోంది. అంటే భయపడాల్సిన పరిస్థితి లేదన్న భరోసా ఉన్నా.. అప్రమత్తతకు మాత్రం మినహాయింపు లేదు.మాస్కులు ధరించండి, చేతులు శుభ్రంగా కడుక్కోండి, అనారోగ్యంగా ఉంటే ఇంట్లో ఉండండి.. ఇవన్నీ అవసరమైన సూచనలే. కానీ నగరంలో లక్షలాది మంది బస్సులు, రైళ్లు, మార్కెట్లు, పాఠశాలలు, కార్యాలయాలు, ఆసుపత్రుల్లో కలిసిమెలిసి జీవిస్తున్నప్పుడు ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటించడం సాధ్యమా? జనసాంద్రతను ఆపలేం.. కానీ జనసాంద్రతకు తగిన ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించవచ్చు.భారత్ పట్టణీకరణ వేగం దీనికి అద్దం పడుతోంది. 2025లో దేశ జనాభాలో సుమారు 35.7 శాతం పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నట్లు ప్రపంచ బ్యాంకు డేటా ఆధారిత గణాంకాలు సూచిస్తున్నాయి. 2050 నాటికి భారత్ పట్టణ జనాభా 95.1 కోట్లకు చేరవచ్చని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ఈ పెరుగుదలకు అనుగుణంగా డ్రైనేజీ, చెత్త నిర్వహణ, నీటి సరఫరా, ప్రజా మరుగుదొడ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు విస్తరించకపోతే నగరాలు అభివృద్ధి కేంద్రాలుగా కాకుండా వ్యాధుల వ్యాప్తికి అనుకూల వాతావరణాలుగా మారే ప్రమాదం ఉంది. వర్షం పడితే రహదారులపై నీరు నిలవడం.. కాలువలు పొంగడం.. చెత్త పేరుకుపోవడం.. ఆ నీటిలో దోమలు వృద్ధి చెందడం.. ఆ తర్వాత డెంగీ, మలేరియా వంటి వ్యాధులపై అప్రమత్తత ప్రకటనలు చేయడం—— ఇది పరిష్కారం కాదు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే, వ్యాధి పుట్టే పరిస్థితులను ముందే తొలగించడం సమర్థ పాలన. ఇక్కడ ఒక సానుకూల మార్పును కూడా గుర్తించాలి. స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ కింద పట్టణ ప్రాంతాల్లో 97 శాతం వార్డులకు ఇంటింటికీ చెత్త సేకరణ చేరింది. వ్యర్థాల ప్రాసెసింగ్ 2014లో 16 శాతం ఉండగా 2026లో 81 శాతానికి పెరిగింది. దేశవ్యాప్తంగా 2,482 డంప్‌సైట్లలో పేరుకుపోయిన సుమారు 26 కోట్ల మెట్రిక్ టన్నుల పాత వ్యర్థాల్లో 65 శాతం ఇప్పటికే శుద్ధి చేయబడినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇవి గణనీయమైన పురోగతి. కానీ గణాంకాల్లో విజయం కనిపించడం మాత్రమే కాదు.. ప్రతి వీధిలో దాని ఫలితం కనిపించాలి.2026 ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు తడి, పొడి, పారిశుధ్య, గృహ ప్రమాదకర వ్యర్థాలుగా నాలుగు రకాలుగా చెత్తను వేరు చేయడంపై దృష్టి పెట్టాయి. భారీగా వ్యర్థాలు సృష్టించే సంస్థల బాధ్యత, 'పాల్యూటర్ పేస్' సూత్రం, డిజిటల్ పర్యవేక్షణకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. ఇక అసలు పరీక్ష అమలు.మున్సిపాలిటీలకు తగిన సిబ్బంది, ఆధునిక పరికరాలు, శాస్త్రీయ వ్యర్థ నిర్వహణ, పనిచేసే డ్రైనేజీ వ్యవస్థ, వార్డు స్థాయి ఆరోగ్య నిఘా తప్పనిసరి. పారిశుధ్య కార్మికుల భద్రత, గౌరవం కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే మహమ్మారి సమయంలో ముందువరుసలో నిలబడి నగరాలను నడిపించింది వారే.అయితే నగర పారిశుద్ధ్యాన్ని ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే చూడటం ఎంత తప్పో.. పౌర బాధ్యతను విస్మరించడం కూడా అంతే ప్రమాదకరం. రోడ్డుపై చెత్త విసరడం, కాలువల్లో ప్లాస్టిక్ పడేయడం, ఇంటివద్దే తడి-పొడి చెత్తను వేరు చేయకపోవడం వంటి నిర్లక్ష్యాలు చివరకు ప్రజారోగ్యానికే ముప్పుగా మారుతున్నాయి. మున్సిపల్ సిబ్బంది ఎంత శ్రమించినా పౌరుల అలవాట్లు మారకపోతే పరిశుభ్రమైన నగరం సాధ్యం కాదు. స్వచ్ఛ భారత్‌లో 20 కోట్లకు పైగా పట్టణ పౌరులు భాగస్వాములయ్యారన్నది ఆశాజనక పరిణామమే. కానీ ఈ భాగస్వామ్యం ఒక ప్రచార కార్యక్రమంగా ముగియకూడదు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకపోవడం నుంచి వ్యర్థాలను వేరు చేసి అప్పగించడం వరకు.. ప్రతి పౌరుడి రోజువారీ ప్రవర్తనే స్వచ్ఛతకు అసలైన ప్రమాణం కావాలి.ప్రజలకు జాగ్రత్తలు చెప్పడం ప్రజారోగ్య పరిరక్షణలో ఆరంభం మాత్రమే.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించడం ప్రభుత్వ అసలు బాధ్యత. దాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి కర్తవ్యం. జనాభా పెరుగుతున్న వేగానికి తగినట్టుగా మున్సిపల్ వ్యవస్థలు కూడా సిబ్బంది, సాంకేతికత, నిధులు, పర్యవేక్షణలో బలోపేతం కావాలి. మురుగు కాలువలు పొంగిన తర్వాత చర్యలు చేపట్టడం కాదు.. అవి పొంగకుండా ముందస్తు నిర్వహణ ఉండాలి. వ్యాధి వ్యాపించిన తర్వాత వైద్య శిబిరాలు పెట్టడం కాదు.. వ్యాధికి దారితీసే పరిస్థితులను ముందే తొలగించాలి. సంక్షోభం వచ్చినప్పుడు స్పందించే నగరాల నుంచి.. సంక్షోభం పుట్టకముందే నివారించే నగరాల దిశగా భారత్ మారాలి. అదే నిజమైన స్వచ్ఛత.. అదే ప్రజారోగ్య భద్రత.. అదే సుస్థిర పట్టణాభివృద్ధి.

ప్రధాని 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం వెల్లువెత్తడంతో నష్ట నివారణకు ప్రభుత్వం తరఫున న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇచ్చిన వివరణ మరిన్ని సందేహాలను రేపింది. మావోయిస్టులకు మద్దతిచ్చేవారు, వేర్పాటు వాదులు, భారత రాజ్యాంగాన్ని తిరస్కరించే వారు, ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించే వారే దిమాగీ నక్సల్స్‌గా చెప్పుకొచ్చారు.



సి. హెచ్.ప్రతాప్
77938 00743



# సమస్యలను పట్టించుకోరా?

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా దాదాపు రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ, అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యవహారశైలి చూస్తే ఎన్నికలు ముందే వచ్చేసినట్లుగా కనిపిస్తోంది. రెండు పార్టీల సభల్లోనూ "వచ్చేది మేమే.. ప్రభుత్వం ఏర్పాటు చేసేది మేమే" అనే రాజకీయ నినాదాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వేదికలు క్రమంగా ముందస్తు ఎన్నికల ప్రచార సభలుగా మారుతున్నాయన్న అభిప్రాయం బలపడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2034 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని, తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని పలుమార్లు ప్రకటించారు. ఇటీవల పరకాల సభలో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరడం కూడా రాజకీయ చర్చకు దారితీసింది. మరోవైపు బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, రాబోయే ఎన్నికల్లో తమకే అధికారం వస్తుందని ప్రచారం చేస్తోంది. అయితే ఎన్నికలకు ముందే ప్రజల రాజకీయ ఆలోచనలను ప్రభావితం చేయడంకంటే, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రెండు పార్టీలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అధికార పక్షం గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేరుకుపోయిన అప్పులు, ఆర్థిక భారాలు, పెండింగ్ బిల్లులు, అసంపూర్తి ప్రాజెక్టులే తమకు వారసత్వంగా వచ్చాయని చెబుతోంది. ప్రతిపక్షం మాత్రం తాము చేసిన అభివృద్ధిని ప్రభుత్వం తక్కువ చేసి చూపుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయలేకపోయిందని విమర్శిస్తోంది. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలు రాజకీయంగా సహజమే అయినప్పటికీ, వాటి మధ్య అసలు ప్రజా సమస్యలు మరుగున పడకూడదు. నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు వస్తాయి? జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాల హామీ ఎప్పుడు అమలవుతుంది? రైతులకు పంటలకు గిట్టుబాటు ధర, రుణభారం నుంచి ఉపశమనం ఎలా లభిస్తుంది? విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఎప్పుడు అందుతాయి? పేదలకు నాణ్యమైన వైద్యం ఎక్కడ లభిస్తుంది? ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు అవసరమైన నిధులు ఎప్పుడు అందుతాయి? ఇవే ఇప్పుడు చర్చకు రావాల్సిన ప్రశ్నలు. విద్యారంగం తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన అంశం. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయకుండా ప్రైవేటు విద్యావ్యవస్థ విస్తరణనే అభివృద్ధిగా చూడటం సరైంది కాదు. ప్రభుత్వ పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకాలు, పరిశోధనకు నిధులు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టళ్ల వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ అవసరం. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1,000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆ హామీ అమలుపైనా స్పష్టత రావాలి. ఉద్యోగాల విషయంలో కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆచరణలోకి తీసుకురావాలి. గ్రూప్3 నియామకాల్లో 1,370 మందికి నియామక పత్రాలు అందించడం స్వాగతించదగినదే అయినా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీకి స్పష్టమైన కాలపట్టిక అవసరం. నిరుద్యోగులు ఇక హామీలను కాకుండా నియామక ప్రక్రియను చూడాలనుకుంటున్నారు.వైద్య రంగానికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కొరతను నివారించడం, మందుల లభ్యత, పేదలకు ఉచిత వైద్యం, జిల్లా ఆసుపత్రుల సామర్థ్యాన్ని పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడం వంటి అంశాలపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరగాలి.

# అంధులకు మందులు...?

కడలి అన్నాక "అలలు" తప్పవు
కనులున్నాక "కలలు" తప్పవు
కాపురమన్నాక "కలహాలు" తప్పవు
కానీ ముఖాముఖి చర్చలు
మనస్పర్థలకు మానసిక క్షోభలకు మందులన్న
పరమ సత్యమెరుగని
ఆలుమగలు అంధులే..!

తాసులో రెండు వైపులా
200 గ్రాముల్లా
ప్రేమానురాగాలు
ఆశలు ఆకాంక్షలు
అభిరుచులు అభిప్రాయాలు
సరిసమానమైనప్పుడు
ఎటువైపు మొగ్గు చూడనప్పుడు
ఇక సంసారంలో
ఎక్కువ తక్కువ తేడాలెక్కడ..?
విడాకులెందుకు..?విడిపోవడమెందుకు..?

అహంకారం
మొండితనం
పంతాలు పట్టింపులు
కడుపులో కనిపించని కక్ష
పగ ప్రతీకారాలు అసూయా ద్వేషాలు
తగ్గేదే లేదనే తత్వం
మూడో వ్యక్తితో ముచ్చట్లు
అసలు కారణాలైతే అది అజ్ఞానం కాదా..?
అది స్వయంకృతాపరాధం కాదా..?

మరి పరులను పరమాత్మను
నిందించడమెందుకు..?
మానసికక్షోభతో కృంగిపోవడమెందుకు..?

నిరాశ నిప్పుల్లో కాలిపోవడమెందుకు..?

ఎడారిలో ఒంటెలా
ఒంటరిగా జీవించడమెందుకు..?
బ్రతుకు భారమైందని అంధకారమైందని
అలమటించడమెందుకు..?
ఆవేదన చెందడమెందుకు..?


అవమానాలతో
నలుగురిలో నవ్వులపాలు
కావడమెందుకు.?
బంగారు భవిష్యత్తును
బలి చేసుకోవడమెందుకు..?
హోర్డులు బ్రద్దలు చేసుకుని
కోర్టులకెక్కడమెందుకు..? చెప్పండి..!

భార్య భర్తలంటే
భగవంతుడు ప్రసాదించిన
బంగారు బహుమతులని
దాంపత్య జీవితమంటే
అది ఒక దైవ కార్యమని
మూడు ముళ్ళంటే
అది ముత్తైదువుల
ముక్తికి ముహూర్తమని...!

కసితో కత్తులు నూరుకోక
బంగారు బంధాలను నరుక్కోక
చెట్టుకు లతలవోలే
ప్రేమలతో పెనవేసుకుని

చిరకాలం చిలకా గోరింకల్లా
కలిసిమెలిసి కలకాలం బ్రతకాలని..!

ఏటేటా
పట్టు వస్త్రాలతో
పసుపు కుంకుమలతో
మెళ్ళో పెళ్లిదండలతో
పూజారుల మంత్రాలతో
మంగళ వాయిద్యాల మధ్య
మంగళసూత్రాలు మార్చుకునే
ఆ సీతా రాముల్లా...!
ఆదిదంపతులు
అర్ధనారీశ్వరులైన
పార్వతీ పరమేశ్వరుల్లా
మీరు సైతం ఆదర్శ దంపతులు కావాలని
ఈ పోలయ్య కవి కూకట్లపల్లి ఆశ ఆకాంక్ష.



సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్
చరవాణి...9110784502

# భోటేకోశీలో భారతీయులు గల్లంతు

హిమవన్నగాల ప్రాకృతిక వైభవం ఎంతటి ముగ్ధమనోహరమో, ప్రకృతి సమతుల్యత దెబ్బతిన్న వేళ విరుచుకుపడే విలయతాండవం మానవ సమాజాన్ని అంతే నిస్సహాయ స్థితిలోకి నెట్టివేస్తుందన్న చేదు నిజాన్ని ఉత్తర నేపాల్‌లోని రాసువా జిల్లాలో సంభవించిన భోటేకోశీ నదీ ప్రళయం కళ్లకు కట్టింది. "అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయో నామ నగాధిరాజః" అంటూ ప్రాచీన సంస్కృత వాఙ్మయం దేవతా స్వరూపంగా, సమస్త జీవకోటికి ప్రాణాధారంగా కీర్తించిన పర్వతరాజం, ఆధునిక వాతావరణ సంక్షోభం మరియు మానవ తప్పిదాల నడుమ భీకర ఉత్పాతాలకు కేంద్రబిందువుగా మారుతోంది. ఆగస్టు 26, 2026 బుధవారం నాడు టిబెట్ ఉన్నత పీఠభూమి వైపు నుంచి అకస్మాత్తుగా ఉవ్వెత్తున విరుచుకుపడిన అసాధారణ జలప్రవాహం భోటేకోశీ నదిని ఉగ్రరూపిణిగా మార్చడంతో రాసువా జిల్లాలోని కీలక సరిహద్దు ప్రాంతాలైన తిమురే, స్యాఫ్రుబేసీ, రసువాగఢి పరిసరాలు క్షణాల వ్యవధిలోనే జలమయమై శిథిలాల దిబ్బలుగా మారాయి. తాజా సమాచారం ప్రకారం ఈ జలప్రళయంలో సుమారు 384 మంది పర్యాటకులు దుర్మరణం పాలవ్వడం అంతర్జాతీయ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సహాయక చర్యల్లో నిమగ్నమైన 26 మంది నేపాల్ భద్రతా సిబ్బంది గల్లంతు కాగా, విహారయాత్రలు, సరిహద్దు వాణిజ్యం కోసం వచ్చిన 105 మంది భారతీయ పౌరులు, మరో 95 మంది స్థానిక నేపాలీలు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయి ఆచూకీ లేకుండా పోయారు. వ ర ద లలో ఎందరో విదేశీయులు చిక్కుకు పోయారు. విపత్తు తీవ్రత, నదీ తీర విధ్వంసాన్ని గమనిస్తే సహాయక చర్యలు ముగిసేసరికి ఈ ప్రాణ నష్టం మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.ఈ జలప్రళయం యొక్క మూల కారణాలను లోతుగా విశ్లేషిస్తే, వాతావరణ మార్పుల పెను ప్రభావం స్పష్టంగా గోచరిస్తోంది. సాధారణ రుతుపవన వర్షపాతంతో పాటు టిబెట్ సరిహద్దు ప్రాంతంలో భారీ హిమస్ఖలనం సంభవించడం లేదా ప్రమాదకర రీతిలో విస్తరిస్తున్న హిమనద సరస్సు ఒక్కసారిగా కట్టలు తెంచుకోవడం ) వల్లనే ఈ ఉత్పాతం జరిగి ఉండవచ్చని ఉపగ్రహ ఛాయాచిత్రాలు, భౌగోళిక శాస్త్రవేత్తల ప్రాథమిక విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి. హిందూకుష్‌హిమాలయ పర్వత శ్రేణులలో భూతాపం కారణంగా గ్లేసియర్లు వేగంగా కరిగి కృత్రిమ సరస్సులుగా ఏర్పడటం తీవ్ర ముప్పుగా మారుతోంది. నేపాల్ పర్వత శ్రేణులకు జూన్ నుండి సెప్టెంబరు వరకు కొనసాగే నైరుతి రుతుపవన కాలం ఎల్లప్పుడూ సవాలే అయినప్పటికీ, ఇటీవలి కాలంలో విపత్తుల తీవ్రత సర్వనాశనాన్ని మిగులుస్తోంది. 2026 ఏప్రిల్ 14 నుంచి ఆగస్టు 14 వరకు నమోదైన నేపాల్ పోలీసు అధికారిక గణాంకాల ప్రకారం కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే 85 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో కొండచరియలు విరిగిపడి 35 మంది, పిడుగుపాటుకు 26 మంది, ఆకస్మిక వరదల్లో 19 మంది, కుంభవృష్టి వర్షాలకు నలుగురు, అకాల హిమపాతానికి ఒకరు బలయ్యారు. తాజా భోటేకోశీ ఉత్పాతం ఈ ప్రాణ, ఆస్తి నష్టాల గణాంకాలను మునుపెన్నడూ చూడని అత్యంత విషాదకర స్థాయికి చేర్చింది.మానవ ప్రాణ నష్టంతో పాటు నేపాల్ జాతీయ ఆర్థిక రంగానికి, విద్యుత్ మౌలిక వసతులకు ఈ వరద తీరని విఘాతం కలిగించింది. నేపాల్ దేశీయ స్థూల ఉత్పత్తిలో, ఇంధన స్వయంసమృద్ధిలో అత్యంత కీలకమైన భోటేకోశీ, త్రిశూలీ నదీ లోయల్లో విస్తరించి ఉన్న జలవిద్యుత్తు వ్యవస్థలు కుప్పకూలాయి. రాసువా, నువాకోట్ జిల్లాల పరిధిలోని దాదాపు 16 జలవిద్యుత్ కేంద్రాలు ఈ ప్రళయ దాటికి పూర్తిగా ధ్వంసమయ్యాయి. నదీ ప్రవాహం దిగువకు చేరే కొద్దీ త్రిశూలీ నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో రాసువాతో పాటు నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా జిల్లాల అధికార యంత్రాంగాలు రెడ్ అలర్ట్ ప్రకటించి లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎత్తైన సురక్షిత శిబిరాలకు తరలిస్తున్నాయి. నేపాల్ సైన్యం, సాయుధ పోలీసు దళం (APF), స్థానిక రక్షణ విభాగాలు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగినప్పటికీ, కష్టతరమైన కొండ ప్రాంతాలు, తీవ్ర వర్షం, మంచు దుప్పటి కమ్మేసిన వాతావరణం కారణంగా హెలికాప్టర్ రక్షణ చర్యలు కూడా తీవ్ర అడ్డంకులను ఎదుర్కొంటున్నాయి. భోటేకోశీ నది త్రిశూలీలో కలిసి, అనంతరం గండక్ (నారాయణి) నదీ వ్యవస్థగా రూపాంతరం చెంది భారత భూభాగంలోకి ప్రవేశిస్తుంది. అందువల్ల హిమాలయాల ఎగువన సంభవించే భౌగోళిక మార్పులు కేవలం ఒక దేశానికే పరిమితం కాకుండా యావత్ భారత ఉపఖండ నదీ పరివాహక ప్రాంతాలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. ఈ పెను విపత్తు నేపథ్యంలో నేపాల్, భారత్, చైనా దేశాల నడుమ ముందస్తు సమాచార మార్పిడి పర్యావరణ ఉపగ్రహాల ద్వారా హిమనద సరస్సుల నిరంతర పర్యవేక్షణ, ఆధునిక ముందస్తు హెచ్చరిక వ్యవస్థ రూపకల్పన అత్యంత అనివార్యమైన అంశాలుగా మారాయి.పర్వతాల సున్నితత్వాన్ని విస్మరించి చేసే అడ్డగోలు తవ్వకాలు, రివర్ బెడ్లను ఆక్రమించి నిర్మించే అశాస్త్రీయ కాంక్రీట్ నిర్మాణాలు ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను స్వయంకృతాపరాధంగా పెంచుతున్నాయి. నదుల సహజ ప్రవాహాలకు కృత్రిమ ఆనకట్టలు వేయడం కన్నా వాటి భౌగోళిక జీవన మార్గాన్ని గౌరవించడం, ప్రకృతితో మమేకమై జీవించే సుస్థిర అభివృద్ధి విధానాలను అవలంబించడమే నేటి ప్రధాన అవసరం. "జలమే జీవం, జలమే జాగ్రత్త" అన్న సత్యం ప్రకృతి ఒడిలో బతికే ప్రతీ ఒక్కరికీ హెచ్చరిక. ప్రాణాలు కోల్పోయిన తర్వాత ఆర్థిక పరిహారాలు ప్రకటించడం కంటే, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ఒక్క ప్రాణాన్నైనా ముందస్తుగా రక్షించగల సంసిద్ధతను సాధించడమే నిజమైన విపత్తు నిర్వహణకు గీటురాయి. ఈ జలప్రళయం నేపాల్ లోయల్లో మిగిల్చిన శోకతప్త గాయాలు త్వరితగతిన మానాలని, గల్లంతైన భారత, నేపాలీ పౌరులు మరియు భద్రతా సిబ్బంది సురక్షితంగా బయటపడాలని, బాధిత కుటుంబాలకు అంతర్జాతీయ సమాజం మానవతా దృక్పథంతో అండగా నిలవాలని ఆశిద్దాం.





రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్


# జాతీయం - అంతర్జాతీయం

## బీజేపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

- బడా వ్యాపారవేత్తలకే అచ్ఛేదిన్
- ఒకవైపు కోట్లాది కుటుంబాల జీవన పోరాటం
- మరోవైపు కార్పొరేట్ కుటుంబాల సంపదకు రెక్కలు

సంపద కొద్దిమంది గుప్పెట్లోనే
300 కుటుంబాల చేతిలో
రూ.138 లక్షల కోట్లు

- నెదర్లాండ్స్, సౌదీ, స్విట్జర్లాండ్, పోలాండ్ ఆర్థిక వ్యవస్థల కంటే అధికం



**న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఎ.ఎం.ఎస్) :** 'వికసిత్ భారత్' అంటూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేస్తున్న వేళ.. దేశంలో సంపద పంపిణీపై మరోసారి తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హురున్ 2026 జాబితా ప్రకారం దేశంలోని 300 అత్యంత విలువైన కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ ఏకంగా రూ.138 లక్షల కోట్లకు చేరింది. ఈ మొత్తం కూడా నెదర్లాండ్స్, సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, పోలాండ్ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థల కంటే ఎక్కువ. మరి ఈ అపారమైన సంపద పెరుగుదల ఫలాలు సామాన్యుడి జీవితంలో ఎంత మేరకు కనిపిస్తున్నాయన్నదే అసలు ప్రశ్న.

దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతోందని, భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పదేపదే చెప్తోంది. కానీ అదే సమయంలో సంపద కొద్దిమంది చేతుల్లోనే మరింత కేంద్రీకృతమవుతున్న దృశ్యం కనిపిస్తోం ది. 2026 'బార్క్లేస్ ప్రయివేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూయబుల్ ఫ్యామిలీ బిజినెస్' జాబితా ప్రకారం.. దేశంలోని 300 కుటుంబ వ్యాపారాల సంయుక్త విలువ రూ.138 లక్షల కోట్లకు చేరింది. గత రెండేండ్లలోనే వీటి విలువ సుమారు రూ.30 లక్షల కోట్లు పెరిగింది. సంపన్న కుటుంబాల ఆస్తులు, కంపెనీల విలువలు, షేర్ల విలువలు పెరగడం ద్వారా వారి మొత్తం సంపదలో రోజుకు సగటున రూ.4,076 కోట్ల మేర పెరుగుదల నమోదైంది.

హురున్ లెక్కల ప్రకారం... ఈ 300 కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ 1.46 ట్రిలియన్ డాలర్లకు సమానం. వీటన్నింటినీ ఒక దేశంగా పరిగణిస్తే ప్రపంచంలో 18వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని హురున్ ఇండియా వ్యవస్థాపకులు, ప్రధాన పరిశోధకులు అనస్ రెహ్మాన్ జునైద్ వివరించారు. ఇది భారత ఆర్థిక వ్యవ స్థలో సంపద సృష్టి ఎంత భారీ స్థాయిలో జరుగు తోందో చూపుతున్నప్పటికీ.. ఆ సంపద ఎవరి చేతుల్లో కేంద్రీకృతమవుతోందన్న ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. దేశంలో ఉద్యోగాలు, వేతనా లు, జీవన వ్యయం, చిన్న వ్యాపారాల పరిస్థితి వంటి అంశాలపై సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో కార్పొరేట్ కుటుం బాల ఆస్తుల విలువ మాత్రం కొత్త రికార్డులు నెలకొల్పుతుండటం గమనార్హం.

జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో అంబానీ కుటుంబం రూ.25.83 లక్షల కోట్ల విలువతో అగ్ర స్థానంలో ఉంది. బిర్లా కుటుంబం రూ.8.14 లక్షల కోట్లతో రెండో స్థానంలో ఉండగా, జిందాల్ కుటుం బం రూ.8.02 లక్షల కోట్లతో మూడో స్థానంలో ఉంది. బజాజ్ కుటుంబం రూ.7.70 లక్షల కోట్లు, మహీంద్రా కుటుంబం రూ.5.15 లక్షల కోట్ల విలు వతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక మొదటి తరం వ్యాపార కుటుంబాల్లో గౌతమ్ అదానీ కుటుంబం రూ.19.6 లక్షల కోట్ల విలువతో అగ్ర స్థానంలో ఉంది. సునీల్ భారతి మిట్టల్ కుటుంబం రూ.12.1 లక్షల కోట్లతో తర్వాతి స్థానంలో ఉంది. సంపదను అత్యధికంగా పెంచుకున్న కుటుంబంగా జిందాల్ కుటుంబం నిలిచింది. కుటుంబ వ్యాపార విలువ రూ.3.3 లక్షల కోట్లు పెరిగి రూ.8.02 లక్షల కోట్లకు చేరింది. అంటే 70 శాతం పెరుగుదల నమోదైంది. అనిల్ అగర్వాల్ కుటుంబం రూ.3.03 లక్షల కోట్ల విలువను అదనంగా సృష్టించగా, కుమార్ మంగళం బిర్లా కుటుంబం రూ.2.75 లక్షల కోట్లు జోడించింది.

మోడీ ప్రభుత్వం 'వికసిత్ భారత్'ను ప్రధాన లక్ష్యంగా ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దేశ ఆర్థిక వృద్ధిని కేవలం బిలియనీర్ల సంపదతోనే కొలవలేం. సాధారణ కుటుంబాల ఆదాయం ఎంత పెరిగింది? యువతకు స్థిరమైన ఉద్యోగాలు ఎన్ని వచ్చాయి? చిన్న, మధ్యతరహా వ్యాపారాలు ఎంత బల పడ్డాయి? ధరల పెరుగుదలతో ప్రజల కొనుగోలు శక్తి ఎంత దెబ్బతింది? గ్రామీణ కుటుంబాల ఆదాయ పరిస్థితి ఏమిటి? వంటి ప్రశ్నలకు కూడా సమాధానాలు అవసరమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

హురున్ జాబితాలోని టాప్ 10 కుటుంబాలే మొత్తం జాబితా విలువలో 51 శాతం వాటా కలిగి ఉన్నాయి. అదే సమయంలో కనీసం ఒక బిలియన్ డాలర్ల విలువ కలిగిన కుటుంబాల సంఖ్య 230కు చేరింది. అంటే భారత్‌లో పెద్ద వ్యాపారాల విలువ వేగంగా పెరుగుతున్నప్పటికీ.. సంపద కేంద్రీకరణ కూడా గమనించాల్సిన అంశంగా మారుతోంది. 'భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుంది' అనే మోడీ ప్రభుత్వ లక్ష్యాల మధ్య.. ఆ వృద్ధి ఫలాలు సామాన్యుడి జేబుకు, యువత ఉద్యోగాలకు, రైతు ఆదాయానికి, మధ్యతరగతి జీవన ప్రమాణాలకు ఎంతగా చేరుతున్నాయో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందని సామాజికవేత్తలు, మేధావులు ప్రశ్నిస్తున్నారు.

శాతాల పరంగా చూస్తే శాహీ ఎక్స్‌పోర్ట్స్‌కు చెందిన అహూజా కుటుంబం అత్యధిక వృద్ధిని నమోదు చేసింది. వారి వ్యాపార విలువ 352 శాతం పెరిగి రూ.37,500 కోట్లకు చేరింది. గార్వేర్ హైటెక్ ఫిల్మ్స్‌కు చెందిన శశికాంత్ భాలచంద్ర గార్వేర్ కుటుంబం సంపద 300 శాతం పెరిగి రూ.15,600 కోట్లకు చేరింది.

## అమెరికాలో పెరుగుతున్న నిరుద్యోగం

- ఉద్యోగాల కల్పనపై ట్రంప్ అసత్యాలు
- బైడెన్ పాలనతో పోలిస్తే తగ్గిన ఉద్యోగాల సృష్టి
- కొలువుల కల్పనలో తగ్గిన వేగం



**వాషింగ్టన్, ఆగస్టు 23 :** ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో తన పనితీరును మెజారిటీ అమెరికన్లు ఆమోదించడం లేదంటూ వచ్చిన సర్వేలను నమ్మవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రజలకు సూచించారు. వాస్తవానికి తనకు ప్రజాదరణ చాలా మెరుగ్గా ఉన్నదని ఆయన చెప్పుకొచ్చారు. అందుకు ఉదాహరణగా ఓ చిన్న విషయాన్ని గొప్ప విజయంగా చూపారు. 'నేను ఓ సర్వేలో చూశాను. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ట్రంప్‌కు 44 శాతం మంది మాత్రమే మద్దతు ఇచ్చారని అందులో ఉంది. అది నిజమెలా అవుతుంది? గతంలో ఎన్నడూ లేని విధంగా యువత ఇప్పుడు ఉద్యోగాలు చేస్తున్నారు కదా' అని కరోలినాలో జరిగిన ర్యాలీలో తెలిపారు. ఇదే విషయాన్ని ఆయన ఆ ర్యాలీలో మూడు సార్లు ప్రస్తావించారు. అయితే దీనికి పెద్దగా ప్రాముఖ్యత లేదని ట్రంప్‌కు తెలియదా లేక ఆయన తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశ పూర్వకంగానే అతిగా ప్రచారం చేస్తు న్నారా అన్నది స్పష్టం కావడం లేదు.

వాస్తవానికి అమెరికాలో ఉద్యోగుల సంఖ్య కాలక్రమేణా పెరుగుతూనే ఉంది. ఎందుకంటే జనాభా కూడా పెరుగుతోంది. 2008 ఆర్థిక సంక్షోభం, 2020 కోవిడ్19 సంక్షోభం వంటి ఆర్థిక మాంద్యాల సమయాలలో తప్ప సంవత్సరాలు గడిచే కొద్దీ ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ సంవత్సరం ట్రంప్ ఆర్థిక విధానాలపై ప్రజాభిప్రాయం అంతంతమాత్రంగా ఉండడానికి ప్రధాన కారణం కార్మిక మార్కెట్ పరిస్థితి కాదు. జీవనవ్యయం. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన 2025 జనవరిలో ఉపాధిజనాభా నిష్పత్తి (16 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న జనాభాలో ఎంత శాతం మంది ఉపాధి పొందుతున్నారో తెలియజేస్తుంది) 60.1 శాతం ఉండగా అది జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్న చివరి మూడు సంవత్సరాల కాలంలో నమోదైన స్థాయిల కంటే చాలా తక్కువ. బైడెన్ హయాంలో కంటే ట్రంప్ రెండో విడత పాలనలో ఉద్యోగాల కల్పనలో వేగం గణనీయంగా తగ్గిపోయింది. బైడెన్ పదవీకాలంలోని చివరి 18 నెలలలో అమెరికాలో 22 లక్షల ఉద్యోగాల కల్పన జరిగింది. ట్రంప్ హయాంలో 2025 ఫిబ్రవరి నుంచి ఈ సంవత్సరం జూలై వరకూ...అంటే 18 నెలల కాలంలో కేవలం 5,90,000 మందికి మాత్రమే ఉద్యోగాలు లభించాయి.

కార్మిక శక్తిలో నిరుద్యోగుల సంఖ్యను సూచించే 'నిరుద్యోగిత రేటు' విషయానికి వస్తే గత సంవత్సరం జనవరిలో నాలుగు శాతంగా ఉన్న ఈ రేటు గత నెల నాటికి స్వల్పంగా పెరిగి 4.1 శాతానికి చేరింది. బైడెన్ హయాంలో 2023 ఏప్రిల్‌లో 3.4 శాతం కనిష్ట స్థాయి, ట్రంప్ మొదటి విడత పాలనలో 2019 చివరలో 3.5 శాతం కనిష్ట స్థాయి నమోదయ్యాయి. ఇక 16 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసు ఉండి ఉద్యోగంలో ఉన్న లేదా పని కోసం వెతుకుతున్న జనాభా శాతాన్ని సూచించే శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్) గత సంవత్సరం జనవరిలో 62.6 శాతం ఉండగా గత నెలలో 61.4 శాతానికి తగ్గింది. ఈ తగ్గుదలలో కొంత భాగంలో గణాంక సంబంధమైన వ్యత్యాసం ఉండవచ్చు కానీ భారీ వృద్ధికి సంబంధించిన సంకేతాలేవీ లేవు. ట్రంప్ ప్రాధాన్యత ఇస్తున్న ఉద్యోగుల సంఖ్య విషయానికి వస్తే ఓ ఫెడరల్ సర్వే ప్రకారం ఉద్యోగాలలో ఉన్న అమెరికన్ల సంఖ్యలో ఈ ఏడాది స్వల్పంగా తగ్గుదల కన్పించడం గమనార్హం.

## డ్రాప్‌డౌన్ జాబితాను అందుబాటులోకి తేవాలి

- ప్రధాని మోడీకి రాహుల్, ఖర్గే సంయుక్త లేఖ
- ఓపెన్ ఎండెడ్ విధానాన్ని మార్చాలంటూ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఎ.ఎం.ఎస్):** కులగణనలో వివరాల సేకరణ విధానంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్య సభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం ప్రధాని మోడీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ రాశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానాన్ని మార్చి, కులాల పేర్లతో కూడిన డ్రాప్‌డౌన్ జాబితాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రస్తుత విధానంలో వ్యక్తులు తమ కులం పేరును ఎలా చెబితే అలా నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఒకే కులానికి ప్రాంతాలను బట్టి వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా రూపాలు ఉండే అవకాశం ఉందని వివరించారు. దీంతో ఒకే కులానికి చెందినవారి వివరాలు వేర్వేరు పేర్లతో నమోదైతే.. ఆ కులం వేలాది ఎంట్రీలుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలా జరిగితే కులాల జనాభాపై కచ్చితమైన సమాచారం లభించదని పేర్కొన్నారు. ఫలితంగా వెనుకబడిన, అత్యంత [illegible]కబడిన, ఇతర అణగారిన వర్గాల స్థితిగతులపై సరైన అంచనా సాధ్యం కాదని వివరించారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై దీని ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది కూడా తేలకపోవచ్చని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కులగణనలో 'బ్యాక్‌వర్డ్ క్లాస్' అనే పదం చేర్చలేదని లేఖలో ప్రస్తావించారు. కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని వారు సూచించారు. ఎస్సీ, ఎస్టీల గణనలో ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని గుర్తు చేశారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ జాబితాలు, ఆంథ్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించవచ్చని వివరించారు. తెలంగాణ, బీహార్ కుల సర్వే ల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్టు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దుచేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తరువాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని కోరారు.

## రోహింగ్యా శరణార్థులపై మానవ హక్కుల ఉల్లంఘన

- యూఎన్ కమిటీ తీవ్ర ఆందోళన
- నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి




**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఎ.ఎం.ఎస్) :** భారత్‌లోని ఎస్సీ, ఎస్టీ, రోహింగ్యా శరణార్థులు, తదితరులపై జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనపై ఐక్యరాజ్యసమితి(యూఎన్)కి చెందిన ఒక కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని నివారించడానికి, పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ ఉల్లంఘనలకు "జవాబుదారీతనం ఉండేలా చూడాలని" కూడా స్పష్టం చేసింది. జాతి వివక్ష నిర్మూలనపై ఐరాస కమిటీ (యూఎన్‌సీఈఆర్‌డీ) ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రోహింగ్యా సంక్షోభం తలెత్తి తొమ్మిదేండ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఈ ప్రకటన వచ్చింది. పైన తెలిపిన వీరంతా జాతి ప్రేరేపిత హింస, మితిమీరిన బలప్రయోగం, హత్యలు, సరైన విచారణ లేకుండా ఏకపక్షంగా, సుదీర్ఘకాలం నిర్బంధించడం, చిత్రహింసలు, లైంగిక హింసకు గురయ్యారని కమిటీ ఈ ప్రకటనలో పేర్కొంది. వీటిపై తక్షణ, సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు ఈ ప్రకటనలో తెలిపింది. ఎస్సీ, ఎస్టీలతో పాటు బెంగాలీ మాట్లాడే ముస్లింలను లక్ష్యంగా చేసుకుని దాడులు పెరిగాయనీ, వీరిపై జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనకు సంబంధించిన నివేదికలతో తాము తీవ్ర ఆందోళన చెందుతున్నట్టు ఈ ప్రకటనలో వివరించింది. ముఖ్యంగా 2017 హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు, కాశ్మీర్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తరువాత "రోహింగ్యాలు, బెంగాలీ మాట్లాడే ముస్లింలు, వలసదారులు, ఆశ్రయం కోరుకునేవారు, పౌరసత్వం లేనివారు"ను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ నేతృత్వంలోనే వేధింపులు పెరిగాయని విమర్శించింది. చెక్‌పోస్టుల వద్ద జాతి వివక్షాపూరిత పరిశీలన జరిపారనీ, ఇది "సరైన విచారణ లేకుండా ఏకపక్ష అరెస్టులు, నిర్బంధాలకు" దారితీసిందని ఆరోపించింది. వీటిని అదుపులోకి తీసుకొని రావాలని కోరింది. కాగా, ఈ నెల 11, 12 తేదీల్లో భారత్‌లోని ప్రస్తుత పరిస్థితిపై కమిటీ సమీక్షించింది. ఈ సమీక్షకు కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నేతృత్వంలోని బృందం హాజరైంది. ఈ సమీక్ష జరిగిన 15 రోజుల తరువాత కమిటీ ఈ ప్రకటన విడుదల చేయడం గమనార్హం. యూఎన్‌సీఈఆర్‌డీలో 18 మంది నిపుణులు ఉంటారు.

## చంటిబిడ్డపై వీధికుక్క అరాచకం



- మహారాష్ట్రలో ఘటన

**పుణె, ఆగస్టు 26 (ఎ.ఎం.ఎస్) :** మహారాష్ట్ర పుణెలో వీధి కుక్క అరాచకం చేసింది. చంటిబిడ్డతో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళపై వీధికుక్క అకస్మాత్తుగా దాడి చేసింది. వీడియో ప్రకారం.

.ఓ ఇంటి ముందు ఆపి ఉన్న కారు చాటునుంచి ఓ కుక్క సడెన్‌గా బయటకు వచ్చింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న మహిళ కాలును గట్టిగా కొరికింది. ఈ హఠాత్పరిణామంతో మహిళ భయపడిపోయింది. బిడ్డను కిందకు జారవిడిచింది. దీంతో చిన్నారి రోడ్డుపై పడిపోయింది. తలకు గాయమైంది. స్థానికులు అప్రమత్తమై బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు తెలంగాణ యువకులు దుర్మరణం

**ఫ్లోరిడా, ఆగస్టు 23 :** అమెరికాలోని ఫ్లోరిడాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో తెలంగాణకు చెందిన ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట మండలానికి చెందిన రాహుల్ అనే యువకుడు ఉన్నట్లు సమాచారం. రాహుల్ ఉన్నత చదువులు నిమిత్తం కేవలం 3 నెలల క్రితమే అమెరికాకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడంతో వారి స్వగ్రామాల్లో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

## దెబ్బకు దెబ్బ తీస్తాం

- అమెరికా ఆంక్షలపై ఇరాన్
- ట్రంప్ వీడియోపై మండిపాటు



**టెహ్రాన్, ఆగస్టు 23 :** తనను ఆర్థికంగా ఒంటరిని చేసేందుకు అమెరికా విధించిన తాజా ఆంక్షలపై ఇరాన్ మండిపడింది. ప్రతీకారం తీర్చుకుంటానని ప్రకటించింది. అమెరికా ఒత్తిడులకు తన వాణిజ్య భాగస్వాములు లంగబోరని, వాటిని ప్రతిఘటిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్ సోమవారం ఇరాన్‌పై తాజాగా మరిన్ని ఆర్థిక పరమైన ఆంక్షలను విధించారు. ఇరాన్‌తో వ్యాపారం చేస్తున్న దేశాలపై కూడా ఆంక్షలు తప్పవని బెదిరించారు. అయితే ఏయే దేశాలపై ఆంక్షలు విధించేదీ, అవి ఎప్పటి నుంచి అమలులోకి వచ్చేదీ ఆయన వెల్లడించలేదు. కాగా ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షలలో కొన్నింటిని ఆ తర్వాత నిలిపివేశారు.అంతకుముందు అమెరికా వాణిజ్య మంత్రిత్వ శాఖ మొత్తం 60 మంది వ్యక్తులు, సంస్థలు, నౌకలపై కొత్త ఆంక్షలను ప్రకటించింది. అయితే చైనా ఆర్థిక సంస్థలేవీ ఈ ఆంక్షల జాబితాలో లేవు. ఇరాన్‌తో అంతర్జాతీయ చట్టాల పరిధిలోనే సహకారాన్ని కొనసాగిస్తున్నామని, ఈ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోకూడదని, అలాగే దానికి ఆటంకం కలిగించకూడదని చైనా మంగళవారం స్పష్టం చేసింది. అమెరికా ఆర్థిక ఆంక్షలకు ప్రతీకారంగా సైనిక చర్యకు పాల్పడడం లేదా గల్ఫ్ నుంచి చమురు ఎగుమతులను మరింతగా అడ్డుకోవడం వంటి చర్యలకు దిగుతామని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా ఆంక్షలకు తాము సిద్ధంగానే ఉన్నామని ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీ జాదె తెలిపారు. 'మా రక్షణ విధానం కేవలం రక్షణాత్మకంగానే ఉండదు. మా దాడులను ఎదుర్కోవడానికి శత్రువులు సిద్ధంగా ఉండాలి' అని ఆయన ప్రభుత్వ టీవీతో అన్నారు. అమెరికా చర్యలను చైనా, రష్యా అంగీకరించడం లేదని చెప్పారు. ఇతర దేశాలు కూడా వాటిని వ్యతిరేకిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా ఇరాన్ మౌలిక సదుపాయాలకు ముప్పు వాటిల్లితే అమెరికా కీలక ప్రయోజనాలు, ఇంధన సరఫరా మార్గాలపై తీవ్రమైన దాడులు చేస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ హుస్సేన్ మొహబ్బీ హెచ్చరించారు. ఓటమిని, ఆకలిని టెహ్రాన్ అంగీకరించిందంటూ మార్ఫింగ్ చేసిన ఓ వీడియోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విడుదల చేసిన నేపథ్యంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఖర్ ఖలీబఫ్ ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ట్రంప్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అమెరికాలో ఆహార భద్రత కరువైందని ఎత్తిచూపారు. 'అమెరికాను మరోసారి ఆకలితో అలమటించేలా చేయండి' అంటూ వైరల్ అయిన నినాదాన్ని ప్రస్తావించారు. అమెరికాలో 47 మిలియన్ల మంది ఆకలితో అల్లాడిపోతున్నారని తెలిపారు. ఇతర దేశాలతో ఇరాన్‌కు ఉన్న ఆర్థిక సంబంధాలను అమెరికా దెబ్బతీయలేదని చెప్పారు. అమెరికా వాగాడంబరతను ఎవరూ పట్టించుకోరని ఎద్దేవా చేశారు.

## టీఎంసీ రెబల్ ఎంపీలకు నోటీసులు



- అందజేసిన లోక్‌సభ సెక్రటేరియట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఎ.ఎం.ఎస్) :** అనర్హత పిటిషన్‌లపై రెబల్ టీఎంసీ ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియట్ నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద 20మంది రెబల్ టిఎంసి ఎంపిలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ టిఎంసి నేత అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్లపై ఈ నోటీసులు జారీ అయ్యాయి. వారం రోజుల్లోగా ఆ నోటీసులపై సమాధానం ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నాయి.

ఆగస్టు 25 (మంగళవారం ) జారీ అయిన ఈ నోటీసులతో పాటు లోక్‌సభ సభ్యుల (ఫిరాయింపు కారణంగా అనర్హత) నిబంధనలు, 1985లోని రూల్ 6 కింద, త్రిపురకి చెందిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)లో చేరిన ఎంపిలకు వ్యతిరేకంగా మమతా బెనర్జీ జూన్ 18న దాఖలు చేసిన పిటిషన్ కాపీని కూడా జత చేసినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. అనర్హత పిటిషన్లపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం అంగీకరించిన ఒకరోజు తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది.

## కృతిసనన్ ప్రకటన తొలగింపు

- రక్షాబంధన్ వివాదంపై జివా సంస్థ నిర్ణయం



**ముంబయి, ఆగస్టు 23 (ఎ.ఎం.ఎస్) :** బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన రక్షాబంధన్ ప్రత్యేక ప్రకటనపై వివాదం రేకెత్తడంతో జివా సంస్థ వెనక్కి తగ్గింది. కృతి సనన్ నటించిన ఆ ప్రకటనను సంస్థ తాజాగా తొలగించింది. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగల పట్ల తమకు ఎంతో గౌరవం ఉందని బ్రాండ్ పేర్కొంది. ఆ గౌరవంతోనే ప్రకటనను ఉపసంహరించుకున్నట్లు తెలిపింది.ఈ ప్రకటనలో కృతి డ్రెస్సింగ్‌పై కొంతమంది సోషల్ మీడియా యూజర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు.

రక్షాబంధన్ వంటి సాంప్రదాయ పండుగకు ఈ తరహా దుస్తులు సరిపోతాయా అంటూ ప్రశ్నలు వచ్చాయి. ప్రకటనలో కుక్కకు రాఖీ కట్టే సన్నివేశం కూడా చర్చకు దారితీసింది. కంగనా వ్యాఖ్యలతో పాటు సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై కృతి సనన్ కూడా స్పందించింది. మహిళ ఏ దుస్తులు ధరించాలనే విషయంపై సమాజం ఎప్పటికీ తీర్పులు ఇస్తూనే ఉంటుందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. సంస్కృతి, సాంప్రదాయాలు ఒక మహిళ ధరించే దుస్తుల్లో కాకుండా ఆమె హృదయంలో ఉంటాయని కృతి పేర్కొంది. కేవలం దుస్తులను ఆధారంగా చేసుకుని ఒక మహిళకు తన సంస్కృతి పట్ల గౌరవం ఉందా లేదా అని నిర్ణయించడం సరికాదని ఆమె అభిప్రాయపడింది.

## మా నాన్న ప్రాణాలకే ప్రమాదం

- ఇమ్రాన్‌ఖాన్ కుమారుల ఆందోళన
- జైల్లో సరైన వైద్యం అందటం లేదంటూ ఆవేదన



**ఇస్లామాబాద్, ఆగస్టు 23 :** పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్‌ఏఇన్సాఫ్ (పీటీఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆయన కుమారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జైలులో ఏకాంత నిర్బంధంలో ఉన్న తమ తండ్రికి సరైన వైద్యం అందకపోతే ఆయన ప్రాణాలకే ప్రమాదం జరగవచ్చని మూడేళ్లుగా తన తండ్రి ఏకాంత నిర్బంధంలో ఉన్నారని, కిటికీలు లేని 6×8 అడుగుల గదిలో రోజుకు 23 గంటలకు పైగా బంధిస్తున్నారని కాసిం ఆరోపించారు. సరైన వైద్యం అందకపోవడం వల్లే ఆయన కుడి కంటి చూపును దాదాపుగా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశించినా ఇమ్రాన్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించకుండా, ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ఫిట్‌గా ఉన్నారని ప్రకటించడాన్ని వారు తప్పుబట్టారు. గత ఆరు నెలలుగా తమ తండ్రితో ఒక్కసారి కూడా మాట్లాడలేదని, ఇది స్పష్టంగా మానవ హక్కుల ఉల్లంఘనేనని మరో కుమారుడు సులేమాన్ అన్నారు. తన తండ్రి నిర్బంధం, చిత్రహింసల వెనుక పాకిస్థాన్ సైనిక యంత్రాంగం హస్తం ఉందని ఆయన ఆరోపించారు. ఇమ్రాన్‌కు వైద్యం అందించాలని కోరుతూ 21 మంది మాజీ అంతర్జాతీయ క్రికెట్ కెప్టెన్లు పాక్ ప్రధానికి లేఖ రాసిన విషయాన్ని సులేమాన్ గుర్తుచేశారు. మరోవైపు, ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై పాక్ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై సెప్టెంబర్ 16న విచారణ జరగనుంది.



## పోటెత్తిన వరద

- బీహార్ ప్రభుత్వం అలర్ట్

**పాట్నా, ఆగస్టు 23 (ఎ.ఎం.ఎస్) :** భారీ వర్షాలతో నేపాల్‌లోని గండక్ నది ఎగువ పరీవాహక ప్రాంతంలో ఆకస్మిక వరదలు పోటెత్తాయి. ఈ నేపథ్యంలో బీహార్‌లో ప్రభుత్వం అలర్ట్ అయింది. గండక్ నది తీరంలోని జిల్లాల్లో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం పొంచి ఉంది. ఈక్రమంలో తాజాగా ప్రధాన కార్యదర్శి ప్రత్యయ్ అమృత్ అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. అందుబాటులో ఉన్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని, గండక్ బ్యారేజీ దానికి అనుబంధంగా ఉన్న కాలువల గేట్లన్నింటి ద్వారా నీటిని విడుదల చేయాలని జల వనరుల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**పల్లె దవఖానపై కలెక్టర్ నజర్.. సేవలో నిర్లక్ష్యం వీడాలని హెచ్చరిక..**

**రాయపర్తి, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**

రాయపర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా పల్లె దవాఖానాలో చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. టీకాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ పై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని మందుల నిల్వ విభాగాన్ని తనిఖీ చేశారు.గడువు తీరిన మందులు లేకుండా చూడాలని, మందులను సురక్షిత ప్రదేశంలో భద్రపరచాలని సూచించారు. ల్యాబొరేటరీలో మందుల నిల్వ, వైద్య పరికరాల లభ్యత గురించి ల్యాబ్ ఇన్‌చార్జిని ఆరా తీశారు. ల్యాబ్ తో పాటు ఆసుపత్రి పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు పట్టీని, రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు, రోగులకు కల్పిస్తున్న వసతులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్, గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితేనే లక్ష్యం సాధించ వచ్చు




**– కళాశాల చైర్మన్ నవనీత రావు**

**హనుమకొండ, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి) :**

విద్యార్థి ని విద్యార్థు లు అహర్నిశలు కష్టపడి చదివితే లక్ష్యం సాదించ వచ్చని విజన్ 40 జూనియర్ కళాశాల చైర్మన్ లింగం పల్లి నవనీత రావు అన్నారు. స్థానిక రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో జరిగిన విజన్ 40 జూనియర్ కళాశాల Victory" Freshars Partyలో ముఖ్య అధితిగా హాజరై ప్రసంగిస్తూ కళాశాల స్థాపించిన నాటి నుండి నేటి వరకు IIT, NIT IIIT మరియు NEET ర్యాంకులు వస్తున్నాయి. దానికి కఠోర శ్రమ కారణం అని అన్నా రు. తరువాత ఇంటర్మిడియేట్ ర్యాంకర్ లను మేమెంటోలతో సత్కరించారు.

ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్ లు అనుమాండ్ల నారాయణ రెడ్డి, డాక్టర్ పోడేటి కోటేశ్వరరావు, సంకెపల్లి శ్రీనివాస రెడ్డి మరియు అధ్యాపకులు ఆసిస్, శక్తి, రాంకుమార్, రాజి రెడ్డి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థి ని విద్యా ర్థు ల సాంస్కృతిక కార్యక్రమములు అలరించినవి.

## స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో కార్మిక సమస్యలపై ఐఎన్‌టీయూసీ చర్చ



**కొత్తగూడెం ఏరియా సమస్యలను పరిష్కరించాలని జీఎంకు వినతి**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి)**

కొత్తగూడెం ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం శ్రీ సీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్‌తో పాటు స్ట్రక్చర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిటీ సభ్యులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు.

గతంలో స్ట్రక్చర్ కమిటీలో ప్రస్తావించిన కొన్ని సమస్యలు పరిష్కరించబడ్డాయని, మిగిలిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. జీఎం కార్యాలయంలో ఫీడర్ క్యాంటీన్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని, రామవరం సింగరేణి డిస్పెన్సరీ చుట్టూ కోతుల బెడద నివారణకు మెష్‌ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్సీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికులకు, అలాగే ఏరియాలోని ఉద్యోగులందరికీ ప్రమోషన్లు త్వరగా కల్పించాలని కోరారు. ఎస్అండ్‌పీసీ, సివిల్, ఏరియా వర్క్‌షాప్ విభాగాల ఉద్యోగులకు ఎన్ 1 తొలగించి అన్ని గ్రేడ్లు కల్పించాలని సూచించారు. రుద్రంపూర్ డిస్పెన్సరీలో రెండో షిఫ్ట్‌కు నర్సును, రెండో మరియు నైట్ షిఫ్టులకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని కోరారు. ఏరియా వర్క్‌షాప్‌లో ఏరియాకు సంబంధించిన అన్ని పనులతో పాటు ఉత్పత్తికి సంబంధించిన భారీ పనులు కూడా నిర్వహిస్తున్నందున, ప్రతి సంవత్సరం అందించే ఉత్తమ ఉద్యోగి అవార్డును వర్క్‌షాప్‌కు కూడా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పీవీకే5 షాఫ్ట్‌లో బ్యాక్ షిఫ్టుల్లో మెకానికల్ ఫోర్‌మెన్‌లు లేకపోవడంతో వారిని వెంటనే నియమించాలని విజ్ఞప్తి చేశారు.

రామవరం2 ఇంక్లైన్ ఫిల్టర్ బెడ్‌లో నాలుగో ఛాంబర్ దెబ్బతినడంతో నీటి లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రెస్క్యూ స్టేషన్‌లో రెస్క్యూ బ్రిగేడియర్లకు రెస్ట్‌రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు మహిళలు, పురుషులకు తగిన మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

రామవరం కమ్యూనిటీ హాల్‌కు మౌలిక సదుపాయాలు కల్పించాలని, సీఈఆర్ క్లబ్, రెస్క్యూ స్టేషన్‌లో జిమ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. గౌతమ్‌పూర్ కాలనీలోని జిమ్‌కు అవసరమైన పరికరాలు సమకూర్చడంతో పాటు రూఫ్ రిపేర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రుద్రంపూర్ జయశంకర్ గౌడ్ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు వజ్రాలగుట్టపైకి వెళ్లేందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు.

గౌతమ్‌పూర్, రామవరం గణేష్‌చమన్ సబ్‌స్టేషన్‌లలో నీటి సీపేజ్ కారణంగా రూఫ్ సీలింగ్ దెబ్బతిని ప్యాచులు ఊడిపోతున్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. wస్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఐఎన్‌టీయూసీ తరఫున ప్రస్తావించిన సమస్యలపై జీఎం సానుకూలంగా స్పందించారు. సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో అధికారులు, ఐఎన్‌టీయూసీ నాయకులు, స్ట్రక్చర్ కమిటీ సభ్యులు తదితరులు

## మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళలదే కీలక పాత్ర




**– పోలీస్ కమిషనర్ శ్వేత, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఘనంగా 'సంఘమిత్ర' సదస్సు**

**జనగామ, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి) :**

సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళా సంఘాలే నిజమైన 'సంఘమిత్రలు'గా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపునిచ్చారు. బుధవారం జనగామ సమీకృత కలెక్టరేట్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు "సంఘమిత్ర - మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌లతో కలిసి సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో 26 లక్షల జనాభాకు కేవలం 3వేల మంది పోలీసులే ఉన్నందున, 1.25 లక్షల మంది ఉన్న మహిళా సంఘాల సహకారం అత్యంత అవసరమని సీపీ తెలిపారు. పంజాబ్, హర్యానా తరహాలో డ్రగ్స్ సంస్కృతి పెరగకుండా ఇప్పుడే కట్టడి చేయాలన్నారు. గంజాయి వ్యాపారం, వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే 112 నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి బహుమతులు అందిస్తామని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జనగామను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని, మహిళా సంఘాలు ప్రతి ఇంటికీ ఈ సందేశాన్ని చేరవేయాలని సూచించారు.డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనలో మార్పులను తల్లిదండ్రులు గమనించాలని, NDPS చట్టం1985 ప్రకారం డ్రగ్స్ కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. సదస్సులో సైకాలజిస్ట్ డాక్టర్ విజయక్రాంతి పిపిటి ద్వారా అవగాహన కల్పించగా, విద్యార్థులు నాటికల ద్వారా మాదకద్రవ్యాల అనర్థాలను వివరించారు. సదస్సు ముగింపులో పాల్గొన్న వారంతా డ్రగ్స్ రహిత సమాజ ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏసీపీలు భీమ్ శర్మ, నర్సయ్య, ఏపీడీ నూరుద్దీన్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పచ్చని భద్రాచలమే లక్ష్యం



**మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణకూ ప్రాధాన్యం: డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్**

**భద్రాచలం, ఆగస్టు 26 వుదయం ప్రతినిధి**

భద్రాచలం పట్టణాన్ని పచ్చదనంతో నిండిన అందమైన పట్టణంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలనే లక్ష్యంతో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో బుధవారం భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పట్టణ సుందరీకరణ, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రీన్ భద్రాద్రి సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్, సీఐ ఎం. నాగరాజు హాజరై పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం మొక్కలకు నీరు పోసి వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు.

ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం ఒకరోజు కార్యక్రమంగా భావించకుండా, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు బాధ్యత తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు వంటి సమస్యలను ఎదుర్కోవడంలో చెట్లు, మొక్కలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని డీఎస్పీ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెరిగితే ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీడతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని అన్నారు. భద్రాచలం ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన పట్టణమని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ భక్తులు, పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారని డీఎస్పీ అన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉండటంతో పాటు పచ్చదనంతో కళకళలాడితే భద్రాచలం అందం మరింత పెరుగుతుందని తెలిపారు. ఈ దిశగా గ్రీన్ భద్రాద్రి చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, ప్రధాన రహదారుల పరిసరాలు, కాలనీలు, ఖాళీ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాల్లో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని కుటుంబ సభ్యుడిలా సంరక్షించాలని సభ్యులు కోరారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటే సంప్రదాయాన్ని పెంపొందించాలని సూచించారు. పట్టణంలో చెట్ల సంఖ్య పెరగడం వల్ల ఉష్ణోగ్రతలను కొంతవరకు నియంత్రించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. చెట్లు నీడను అందించడంతో పాటు నేలలో తేమను కాపాడటంలో, వర్షపాతానికి అనుకూల వాతావరణాన్ని ఏర్పరచడంలో, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడటం అంటే భవిష్యత్ తరాల జీవనాన్ని కాపాడటమేనని, అందువల్ల ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమాల్లోభాగస్వామ్యం చేయడం, పాఠశాలలు, కళాశాలల్లో హరిత కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు ఆర్. రామకృష్ణ రెడ్డి, కార్యదర్శి రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, పూర్వ అధ్యక్షుడు డా. గోళ్ల భూపతి రావు, న్యాయ సలహాదారు పామరాజు తిరుమల రావు, మహిళా కార్యదర్శి సావిత్రి, ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది, గ్రీన్ భద్రాద్రి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు



**తపస్ గురువందన కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి**

**నల్లగొండ జిల్లా వుదయం ప్రతినిధి. ఆగస్టు 26**

నల్గొండ పట్టణం కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించే గురువందన కార్యక్రమం జిల్లా అధ్యక్షులు బత్తిని భాస్కర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గారు మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వ ప్రభుత్వం ఉపాధ్యాయ గౌరవాన్ని పెంచేలా చూడాలని దరఖాస్తుల ద్వారా ఉపాధ్యాయుల సన్మానించే విధానానికి స్వస్తి పలకాలని కోరారు. నాణ్యమైన విద్య ద్వారానే వికసిద్భారత్ కు పునాది

అవుతుందని తరగతి గదిలలో జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుడు కీలక భూమిక పోషిస్తారని వారు అన్నారు.ప్రధాన వక్తగా విచ్చేసిన భాస్కర్ యోగి గారు మాట్లాడుతూ విలువలు బోధించాలి రామాయణ మహాభారతాలలో ఉన్నటువంటి అవునొచ్చని విద్యార్థులకు తెలియజేశారు చిన్నచిన్న కథల రూపంలో అవగాహన కల్పించాలని కోరారు.సమాజంలో నైతిక విలువల పతనం అయితే సమాజం విలువ తగ్గుతుంది.పాఠశాలలోనే సంస్కారాల నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు.సమాజంలో ఉన్నత స్థాయి ఉద్యోగ పరీక్షలకు పోటీపడే పేద విద్యార్థులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉచిత కోచింగ్ మరియు మెటీరియల్ అందజేయడం జరుగుతుందని,సమాజంలో అణగారిన వర్గాల పిల్లల చదువు కోసం ఇతోదిక సాయం చేయటానికి సిద్ధంగా ఉన్నానని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి హామీ ఇచ్చారు...తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిబద్దతతో పనిచేస్తూ గురువు ఔనత్యాన్ని పెంచాలి. జిల్లా స్థాయి ఉపాధ్యాయులుగా ఎన్నికైనటువంటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేణికుంట్ల రాజశేఖర్,రాష్ట్ర బాధ్యులు పర్వతం సంధ్యారాణి, శ్రీరాములు, కట్టె బోయిన శ్రీనివాస్, కొమిరెల్లి భాస్కర్ రెడ్డి, కంచనపల్లి విజయ్ కుమార్, వివిధ మండలాల మండల విద్యాధికారులు,గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వివిధ మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 1997 98 సూరారం పాఠశాల పూర్వ విద్యార్థులు కట్కం అశోక్ కు సన్మానం



**భూపాలపల్లి: ఆగస్టు 26 (వుదయం విలేకరి)**

మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కట్కం అశోక్ ను బుధవారం 1997 98 సూరారం పాఠశాల పూర్వ విద్యార్థులు పుష్పగుచం ఇచ్చి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, భారత రత్న, మానవత్వానికి నిలువెత్తు స్వరూపం మదర్ థెరిసా 116 వ. జయంతి ని పురస్కరించుకొని మహాదేవపూర్ మండల కేంద్రంలో స్నేహితులతో కలిసి కేక్ కట్ చేశారు. అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ కుష్టి వ్యాధులు సోకిన వారిని ఆమె దగ్గర తీసి ఎలాలేని సేవలు చేశారు అని,ఈ మానవాళికి చేసిన సేవలను కొనియాడారు. 199798 బ్యాచ్ అశోక్ స్నేహితులు మాట్లాడుతూ మా స్నేహితునికి జాతీయ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అవకాశం కలిపించినందుకు రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు టి పి సి సి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దోమల రవికుమార్ బాల్నే ప్రకాష్ కొయ్యల సత్యం కారు శ్రీనివాస్ ఆంధ్రయ ఆకుల శ్రీనివాస్ చల్ల రమేష్ పోగు సుధాకర్ లెక్చరర్, మహేష్ నందకిషోర్ సత్యనారాయణ రాజబాబు లక్ష్మామూర్తి బంధం శ్రీను నీళ్ల సాంబయ్య సూరం మహేష్ నీలాల శ్రావణ్ తోపాటు బేగ్లూర్ సర్పంచ్ ఆకుల రాజయ్య,కాంగ్రెస్ నాయకులు బుర్రి శివరాజ్, సాంబయ్య పాల్గొన్నారు.

## దోరకుంట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



**మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం**

**కోదాడ ఆగస్టు 26(వుదయం)**

కోదాడ మండల పరిధిలోని దోరకుంట సమీపంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ప్రాణనష్టం సంభవించడం అత్యంత విషాదకరమని వారు పేర్కొన్నారు. గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికుల జీవితాలు మార్గమధ్యంలోనే విషాదాంతం కావడం హృదయవిదారకమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఈ అపార విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని బాధిత కుటుంబాలకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.క్షతగాత్రులకు సకాలంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చికిత్సలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆకాంక్షించారు.

## నేడు గ్రామ, వార్డు సభలలో ఓటర్ల జాబితా పరిశీలించుకోవాలి



**– ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి) :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఈ సభల్లో పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు ఓటరు జాబితాలను చదివి వినిపిస్తారని, ప్రజలు తమ పేర్లు, వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.

ముఖ్యమైన విషయాలు:

దరఖాస్తు ఫారాలు:

కొత్త ఓటరు నమోదుకు: ఫారం-6

పేర్ల తొలగింపు / అభ్యంతరాలకు: ఫారం-7

వివరాల సవరణకు: ఫారం-8 విచారణలు: అసంగత వివరాలున్న ఓటర్లకు ఇప్పటికే నోటీసుల జారీ ప్రారంభమైంది. నోటీసులు పొందినవారు ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 20 వరకు సమీప గ్రామ పంచాయతీ లేదా వార్డు కార్యాలయంలో విచారణకు హాజరై అసలు ధ్రువపత్రాలు చూపించాలి. (2002 సవరణ జాబితాతో వివరాలు అనుసంధానమైన వారు ఎలాంటి అదనపు పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదు).

వయస్సు ప్రాతిపదికన సమర్పించాల్సిన ధ్రువపత్రాలు: (అర్హత తేదీ: 01 అక్టోబర్ 2026) 01 జులై 1987 కంటే ముందు జన్మించిన వారు: సొంత గుర్తింపు పత్రం సమర్పించాలి. 01 జులై 1987 - 02 డిసెంబర్ 2004 మధ్య జన్మించిన వారు: సొంత పత్రంతో పాటు తల్లి లేదా తండ్రి పత్రం ఇవ్వాలి. 02 డిసెంబర్ 2004 తర్వాత జన్మించిన వారు: సొంత పత్రంతో పాటు తల్లిదండ్రులిద్దరి పత్రాలు సమర్పించాలి. ఆమోదయోగ్యమైన పత్రాలు: ఆధార్, పాస్‌పోర్ట్, 10వ తరగతి సర్టిఫికేట్,

కుల/జనన/నివాస ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగ ID, బ్యాంక్/పోస్టల్ పత్రాలు మొదలైనవి. సందేహాలు లేదా ఫిర్యాదుల కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

## ఘోర బస్సు ప్రమాదం - 6 మంది మృతి, 15 మందికి గాయాలు




**ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ**

**సూర్యాపేట, ఆగస్టు 26:**

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ఫ్రెష్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఐరన్ లోడ్ తో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాద వివరాలను స్థానికులు, అధికారుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తామని, గాయపడిన వారిని కోదాడ ఆసుపత్రికి, తీవ్రంగా గాయపడిన వారిని హైదరాబాద్ కు తరలిస్తున్నామని తెలిపారు. ప్రయాణికుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, జిల్లా యంత్రాంగం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు, రెవెన్యూ, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి



**సెప్టెంబర్ 2 నుంచి వర్ధన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలు. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ.. వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్.**

**వర్ధన్నపేట , ఆగష్టు 26 ( వుదయం ప్రతినిధి )**

వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ బుధవారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో వారం రోజుల పాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు వర్ధన్నపేట మున్సిపాలిటీ, మండల ముఖ్య నాయకులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించినారు.ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ మాట్లాడుతూ అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి.... వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి...తర్వాత అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైందని ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు సమాజంలోని అన్ని రంగాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆరూరి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు .ఈ సమావేశంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ, మండల ముఖ్య నాయకులు మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి , మండల పార్టీ అధ్యక్షులు తుళ్ళ కుమారస్వామి , మున్సిపల్ కౌన్సిలర్లు గుజ్జ వీర రాఘవ రావు , సిలివేరు కుమారస్వామి , తమ్మల అరుణ శ్రీధర్ , జ్యోతి నవీన్ , తిరుపతి , సురేష్ , సర్పంచ్ లు, బేతి సాంబయ్య , సినపెల్లి రాజు , మున్నూరు శారదా సోము , రామారం చిలుముల రామ అశోక్, సర్పంచ్ , దివిటిపెల్లి సర్పంచ్ హల్య బుచ్చి రెడ్డి , తుమ్మల యాకయ్య , అంగోతు బిక్షపతి , లునవత్ వసంత్ నాయక్ భూక్యా రామన్న పాల్గొన్నారు.

## మానవసేవే మహమ్మద్ ప్రవక్త బోధన



**మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పాల్వంచలో మహా అన్నదానం**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 27 (వుదయం ప్రతినిధి)**

ప్రేమ, శాంతి, సోదరభావం, మానవసేవే మహమ్మద్ ప్రవక్త బోధించిన గొప్ప సందేశమని చాటుతూ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పాల్వంచలో మైనారిటీ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

మైనారిటీ యూత్ అధ్యక్షుడు మాజిద్ ఖురేషీ అధ్యక్షతన పాల్వంచ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పాల్వంచ ఎస్సై తోట నాగరాజు ప్రారంభించారు. అనంతరం ప్రజలకు భోజనం వడ్డించారు.

ఈ సందర్భంగా మాజిద్ ఖురేషీ మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా మహమ్మద్ ప్రవక్త బోధించిన సందేశాలను

సమాజానికి మరింత చేరువ చేయవచ్చన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పరస్పర ప్రేమ, సోదరభావంతో జీవించాలనే సందేశాన్ని చాటేందుకే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ యూత్ సభ్యులు కలీం, ఖాసిం బాబా, మజహర్, ఉస్మాన్ ఖాన్, హలీల్ ఖురేషీ, ఆరిఫ్ హలీల్, మౌలానా, జూపల్లి దుర్గాప్రసాద్, సన్లోత్ రంజిత్, అమీర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 31: కలెక్టర్

**అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి**

**పెద్దపల్లి, ఆగస్టు 26(వుదయం ప్రతినిధి)**



జిల్లాలో చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సమస్త మున్సిపల్ కమిషనర్లు, వార్డు ఆఫీసర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సమైక్య సంఘం అధ్యక్షులు, వివోఏలకు ఈ విషయమై స్పష్టత నిచ్చారు. చేయూత పెన్షన్ నమోదుకు చివరి తేదీ ఆగస్టు 31తో ముగుస్తుందని, అర్హులైన నితంతులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ వ్యాధిగ్రస్తులు ఎవరైనా ఉంటే వెంటనే గుర్తించాలని పేర్కొన్నారు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించి, చేయనియెడల వారి దరఖాస్తును స్వీకరించి ఆన్ లైన్ సైట్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియకు సంబంధించి మున్సిపాలిటీలలో వార్డు ఆఫీసర్లు, గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. గడువు ముగిసిన తర్వా త జిల్లా కార్యాలయానికి సంబంధిత వార్డు, గ్రామం నుండి పెన్షన్ దరఖాస్తులు వస్తే, ఆయా అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరైనా మీకు పెన్షన్ ఇప్పిస్తామని నమ్మబలికి మధ్యవర్తులు సంప్రదిస్తే, వారి ప్రలోభాలకు లోను కావద్దని, మీ దరఖాస్తుకు కావలసిన ధ్రువపత్రాలను జతపరిచి, నేరుగా మున్సిపాలిటీలో, వార్డు ఆఫీసర్‌కు, గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని, జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఈ నెల 27న పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు/వార్డుసభలు...

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి...**

**జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్**

**జగిత్యాల ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి)**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1 10 2026ను అర్హత తేదీగా పరిగణిస్తూ చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ –సర్) 2026లో భాగంగా ఈ నెల 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు/వార్డు సభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ తెలిపారు గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనాల్లో గ్రామసభలు పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో వార్డుసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు ఈ సభల్లో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) ఎన్నికల పాఠశాల (చునావ్ పాఠశాల) సభ్యులు పాల్గొంటారని తెలిపారు. గ్రామసభలు/వార్డుసభల్లో ముసాయిదా ఓటరు జాబితాలో నమోదైన ఓటర్ల పేర్లను బీఎల్ఓలు అందరికీ వినిపించే విధంగా చదివి వినిపిస్తారని తెలిపారు జాబితాలో పేరు నమోదు కాకుండా మిగిలిపోయిన అర్హులైన భారతీయ పౌరులను గుర్తిస్తారని పేర్కొన్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకునే యువత తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు నిర్ణీత డిక్లరేషన్ అవసరమైన ధ్రువపత్రాలతో ఫారం–6 సమర్పించాలని సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు వయస్సు చిరునామా ఫొటో లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే వాటి సవరణ కోసం డిక్లరేషన్ తగిన ఆధార పత్రాలతో ఫారం–8 సమర్పించాలని తెలిపారు. అర్హత లేకపోయినప్పటికీ ఓటరు జాబితాలో నమోదైన వ్యక్తుల వివరాలను కూడా సభలో గుర్తిస్తారని పేర్కొన్నారు. అలాంటి నమోదుపై అభ్యంతరం తెలిపే వ్యక్తి అదే శాసనసభ నియోజకవర్గానికి చెందిన ఓటరై ఉండాలని నిర్ణీత డిక్లరేషన్‌తో ఫారం–7 సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. క్లెయిమ్‌లు అభ్యంతరాలు ధ్రువీకరణకు సంబంధించిన గడువు భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన అవసరమైన పత్రాలు ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన ఇతర అంశాలపై సభల్లో అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లాలోని అర్హులైన పౌరులు ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండనున్న యువత ఈ గ్రామ సభలు/వార్డు సభలకు హాజరై తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ కోరారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు సవరణ లేదా అభ్యంతరాలకు సంబంధించిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామసభలు/వార్డుసభలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు) సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓలు) బీఎల్ఓలు గ్రామ పంచాయతీ మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సభల నిర్వహణకు సంబంధించిన కార్యవివరణను నమోదు చేయడంతో పాటు ఫొటోలను తీసి బీఎల్ఓ రిజిస్టర్‌లో భద్రపరచాలని సూచించారు.

# ఎస్ఐఆర్‌పై నిర్వహించే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రతి ఓటరు ఓటరు జాబితాను పరిశీలించి అభ్యంతరాలు,**

**సూచనలు తెలియజేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్**

**కామారెడ్డి, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కామారెడ్డి నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని గ్రామాల్లో గురువారం, 27.08.2026న గ్రామ సభలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయడమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ సభల్లో ముసాయిదా ఓటరు జాబితాను బహిరంగంగా చదివి వినిపించడంతో పాటు, జాబితాలోని వివరాలను ప్రజలకు తెలియజేస్తారని తెలిపారు. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, నివాసం మారిన ఓటర్ల వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓటర్ల వివరాలు, గైర్హాజరైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ సభల్లో చదివి వినిపిస్తారని తెలిపారు.ప్రతి ఓటరు, గ్రామ ప్రజలు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరై ఓటరు జాబితాను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. తమ పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నా, పేరు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నా వెంటనే సంబంధిత .అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.గ్రామ సభల్లో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితర అధికారులు పాల్గొని నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ, అభ్యంతరాల నమోదు, పరిష్కార విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు.జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించే గ్రామ సభలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితా సక్రమంగా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులు మరియు పునరావృత నమోదులను గుర్తించేలా ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కీలకమని, అందువల్ల 27.08.2026న నిర్వహించే గ్రామ సభలకు ప్రజలు తప్పనిసరిగా హాజరై ఓటరు జాబితాను పరిశీలించి తమ అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ విజ్ఞప్తి చేశారు.

# మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న జిల్లా అధికారులు

**కరీంనగర్ ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**



ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే పవిత్రమైన మిలాద్–ఉన్–నబీ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లో నిర్వహించిన మిలాద్–ఉన్–నబీ ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ ప్రపంచానికి ప్రేమ, దయ, కరుణ, సహనం, సోదరభావం వంటి గొప్ప విలువలను బోధించారని తెలిపారు. ఆయన అందించిన సందేశం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. హజ్రత్ మహమ్మద్ ప్రవక్త జీవితం, బోధనల నుంచి స్ఫూర్తి పొందుతూ పరస్పర సామరస్యంతో జీవించాలని పిలుపునిచ్చారు.మతాలు, వర్గాలకు అతీతంగా ప్రజలంతా సోదరభావంతో మెలగాలని, శాంతి, ఐక్యతను కాపాడుతూ దేశ అభివృద్ధి, పురోగతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. సమాజంలో ప్రేమ, కరుణ, సహనం, మానవతా విలువలను మరింతగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మిలాద్–ఉన్–నబీ పర్వదినం ప్రతిఒక్కరి జీవితాల్లోశాంతి, సంతోషం, సౌభాగ్యాన్ని నింపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగను ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

# రేణుకా సిమెంట్‌కు కేంద్రం పర్యావరణ అనుమతులు

**- రామాయిలో రూ.వేల కోట్ల పరిశ్రమకు మార్గం సుగమం..**

**- ఉపాధి, పారిశ్రామిక రంగానికి ఊతం**

**ఆదిలాబాద్, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**



ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక రంగంలో కీలక ముందడుగు పడింది. సాత్నాల మండలం రామాయి గ్రామం కేంద్రంగా ఏర్పాటు కానున్న ఎంఎస్ రేణుకా సిమెంట్ లిమిటెడ్ ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (MoEF&CC) నుంచి కీలక పర్యావరణ అనుమతులు లభించాయి. సిమెంట్ తయారీ ప్లాంట్‌తో పాటు దానికి అవసరమైనసున్నపురాయి మైనింగ్ ప్రాజెక్టుకు కూడా అనుమతుల ప్రక్రియ ముందుకు సాగడంతో జిల్లాలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

**రెండు కీలక అనుమతులు**

రామాయి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ సిమెంట్ ప్లాంట్‌లో ఏడాదికి 1.20 మిలియన్ టన్నుల క్లింకర్, 2.0 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేయనున్నట్లు ప్రాజెక్టు ప్రతిపాదనలో పేర్కొన్నారు. ప్లాంట్‌కు అనుబంధంగా 36 మెగావాట్ల క్యాప్టివ్ విద్యుత్ ప్లాంట్, 5.5 మెగావాట్ల వేస్ట్ హీట్ రికవరీ బాయిలర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతి ఆగస్టు 20, 2026న మంజూరైనట్లు వివరాలు వెల్లడయ్యాయి.ఇక సిమెంట్ ప్లాంట్‌కు అవసరమైన ప్రధాన ముడిసరుకు సున్నపురాయి కోసం రామాయి గ్రామ పరిధిలో 334.21 హెక్టార్ల విస్తీర్ణంలో మైనింగ్ ప్రాజెక్టు ప్రతిపాదించారు. ఇందులో ఏడాదికి 1.80 మిలియన్ టన్నుల సున్నపురాయి ఉత్పత్తి, 850 టీపీహెచ్ సామర్థ్యంతో క్రషర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మైనింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన ఫైల్ నంబర్ J-11015/62/2024-IA-II(NCM) గా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ రికార్డుల్లో నమోదైంది.

**పరిశ్రమకు ముడిసరుకు అక్కడే**

రేణుకా సిమెంట్ ప్రతిపాదిత ప్రాజెక్టులో సిమెంట్ తయారీకి అవసరమైన సున్నపురాయి కోసం ప్రత్యేక మైనింగ్ ప్రాజెక్టును అనుసంధానించడం ప్రధాన అంశంగా ఉంది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు సమర్పించిన పత్రాల్లో రామాయి లైమ్‌స్టోన్ మైన్, రేణుకా సిమెంట్ ప్రాజెక్టుకు సంబంధించినదిగా స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో ముడిసరుకు సరఫరా, సిమెంట్ ఉత్పత్తి ప్రక్రియను ఒకే ప్రాజెక్టు పరిధిలో సమన్వయం చేసే అవకాశం ఉంటుంది.

**స్థానికంగా ఉపాధి అవకాశాలు**

ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉంది. సిమెంట్ ప్లాంట్ ప్రత్యక్షంగా కల్పించే ఉద్యోగాలతో పాటు మైనింగ్, రవాణా, యంత్రాల నిర్వహణ, నిర్మాణం, భద్రత, నిర్వహణ, ఇతర అనుబంధ సేవల రంగాల్లో కూడా ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా స్థానిక యువతకు సాంకేతిక, నైపుణ్య ఆధారిత ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**అనుబంధ రంగాలకూ ఊతం**

భారీ పరిశ్రమ ఏర్పాటుతో రవాణా, లాజిస్టిక్స్, చిన్న కాంట్రాక్టు సంస్థలు, వర్క్‌షాప్‌లు, హోటళ్లు, ఇతర సేవా రంగాలకు కూడా డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. పరిశ్రమ చుట్టూ ఏర్పడే ఆర్థిక కార్యకలాపాలు స్థానిక మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అదే సమయంలో పర్యావరణ అనుమతుల్లో విధించిన నిబంధనలు, కాలుష్య నియంత్రణ, గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి, నీటి వినియోగం, మైనింగ్ నిర్వహణ వంటి అంశాలను కంపెనీ కచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుంది.

**అధికారిక ప్రక్రియలో కీలక మలుపు**

రామాయి లైమ్‌స్టోన్ మైన్ ప్రతిపాదన గతంలోనే కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలో పరిశీలనకు వచ్చింది. అధికారిక EAC రికార్డుల్లో 334.21 హెక్టార్ల విస్తీర్ణంలో 1.80 MTPA సున్నపురాయి ఉత్పత్తి సామర్థ్యంతో రేణుకా సిమెంట్ లిమిటెడ్ ప్రతిపాదనగా నమోదైంది.తాజాగా పర్యావరణ అనుమతులు లభించడంతో ప్రాజెక్టు అమలుకు సంబంధించిన తదుపరి దశలపై దృష్టి సారించే అవకాశం ఏర్పడింది. మొత్తం మీద రామాయి ప్రాంతంలో ప్రతిపాదిత రేణుకా సిమెంట్ ప్రాజెక్టు ఆదిలాబాద్ జిల్లాలో కొత్త పారిశ్రామిక అధ్యాయానికి నాంది పలికే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# భూముల సర్వే పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

**నిర్మల్ జిల్లా 26 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**




భూముల సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రికలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా లో జరుగుతున్న భూముల సర్వేపై జిల్లా కలెక్టర్ సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు పూర్తి చేసిన భూముల సర్వే,చేయాల్సిన సర్వే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రెవెన్యూ మ్యాపులు లేని గ్రామాల ఇబ్బందులు తొలగించేందుకు చేపట్టిన సర్వేను గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులంతా క్షేత్ర స్థాయిలో సర్వేలో పాల్గొనడంతో పాటు, ఉన్నతాధికారులు సర్వే తీరును పర్యవేక్షించాలన్నారు. అధునాతన పరికరాల ద్వారా సర్వే నిర్వహణ సులభంగా, ఖచ్చితత్వంతో ఉంటుందని అన్నారు. ప్రణాళిక ప్రకారం సర్వేప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. సర్వే నిర్వహణకు సంబంధించి నూతన ల్యాప్ టాప్లను అధికారులకు కలెక్టర్ అందజేశారు.అంతకముందు కలెక్టర్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్ తో కలిసి ఆర్థిక అక్షరాస్యత అవగాహన, సహాయం, ఆర్థిక అక్షరాస్యత కేంద్రానికి సంబంధించిన గోడ ప్రతులను డీఈవో భోజన్న, డిపిఆర్వో విష్ణువర్ధన్, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ దేవీదాస్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ నరసింహమూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

**కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలి గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలి**

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**నిజామాబాద్, ఆగస్ట్ 26:**



నిజామాబాద్ పట్టణంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగగా, అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గార్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌లు మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.మతాల మధ్య ఐక్యతే తెలంగాణ బలం:షబ్బీర్ అలీగారు..సభలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు మాట్లాడుతూ. మనిషిని మనిషిగా గౌరవించడం, ప్రేమించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని అన్నారు.కులం, మతం, ప్రాంతం పేరుతో మనుషుల మధ్య విభేదాలు సృష్టించుకోవద్దని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసిజీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ చూపిన శాంతి, కరుణ, సహనం, సోదరభావం మార్గంలో సమాజం ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సెక్యులర్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే పార్టీ అని షబ్బీర్ అలీ అన్నారు. కులం, మతం, భాష, ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించడం కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు.తెలంగాణలో ప్రతి పౌరుడు ప్రశాంతంగా, గౌరవంగా జీవించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో పెద్ద సంఖ్యలో వేలాది గా, ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్. నుడచైర్మన్ కేశవేను, శేఖర్ గౌడ్, నరాల రత్నాకర్ , జావిద్ అక్రమ్, కుద్దూస్, హారున్, కార్పొరేటర్లు సజ్జాద్ రహీల్, నయీమ్ షారాన్, అబ్దుల్ కరీం, అబుద్ బిన్ హందన్, అన్వార్, మొహమ్మద్ అహ్మద్, కో ఆప్షన్ మెంబెర్ మహేందర్ సింగ్, ఆసిఫ్, వహీద్ మరియు మీలాద్ కమిటీ అధ్యక్షులు షోయైబ్ రజా, మహమ్మద్ అబ్బు రజా, రషీద్ రాజా, ముజాహిద్ ఖాన్, పాప ఖాన్, జావీద్ ఖాన్, కయ్యుమ్, షబ్బీర్ రజ్జాక్, జఫర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మొయిన్, సమీ, రియాజుదిన్, సఫ్దర్, అఫ్రోజ్ ఖాన్, సాదిక్ సోహైల్, షైక్ మహబూబ్, పర్వేజ్, ఈసా,మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# గల్ఫ్ మృతుడి కుటుంబానికి సేవా సమితి ఆసరా

## రూ. 1.30 లక్షల ఆర్థిక సాయం అందజేత



**ధర్మపురి,ఆగస్ట్26 (వుదయం ప్రతినిధి):**

ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి దుబా య్‌లో ఈ నెల 15న మృతి చెందిన ధర్మపురి పట్టణానికి చెందిన తొట్ల రవి కుటుంబానికి ధర్మపురి గల్ఫ్ సేవా సమితి అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి సమితి సభ్యులు బుధవారం రూ. 1.30 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ కాలనీలో ఉంటున్న రవి కుటుంబ సభ్యులను సేవా సమితి ప్రతినిధులు పరామర్శించి ఓదార్చారు.మృతుడి భార్య ఐలమ్మకు ధైర్యం చెబుతూ పిల్లల చదువులు, భవిష్యత్ వివాహ ఖర్చులకు తాము అండగా ఉంటామని భరోసా నిచ్చారు. సేవా సమితి తరఫున రవి కుమార్తె పేరిట రూ. 1 లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన బ్యాంకు ధ్రువీకరణ పత్రంతో పాటు, దశ దిన కర్మ ఖర్చుల నిమిత్తం మరో రూ. 30 వేల నగదును స్థానిక వార్డు కౌన్సిలర్ ముదుసుల ప్రశాంత్ చేతుల మీదుగా అంద జేశారు.ఈ కార్యక్రమంలో గల్ఫ్ సేవా సమితి ప్రతినిధులు ఆకుల రాయనర్సు, గట్లశ్రీనివాస్, రాపర్తి గణేష్, తోట సత్యం, గడ్డం వెంకటేష్ గౌడ్, కాశెట్టి సురేష్, మామిడి రాజన్న, మామిడి వెంకటేష్, కొడిమెల నరసయ్య, కోరుట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 27న చలో కలెక్టరేట్

**జన్నారం,ఆగస్ట్ 25 (వుదయం విలేఖరి)**

టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు చేపట్టబోయే మహా ధర్నాను ఉద్యోగ, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని జేఏసీ రాష్ట్ర నాయకులు, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జాడి రాజన్న పిలుపునిచ్చారు. జన్నారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.2వ పీఆర్సీ వెంటనే ప్రకటించి,పెండింగ్ లో ఉన్న 6 డీఏ లు విడుదల చేయాలని,సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులు,రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని,వర్క్ అడ్జస్ట్ మెంట్ జీవో 25 రద్దు,హెల్త్ కార్డులు,కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయాలనీ డిమాండ్ చేశారు.64 సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ ధర్నాకు జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీగా హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బాదావత్ ప్రకాష్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రామటేంకి శ్రీనివాస్, తుంగూరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకలు...

**ఇందిరమ్మ ఇండ్ల గృహ నిర్మాణ యజమానులకు నూతన వస్త్రాల అందజేత...ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

**జగిత్యాల ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలని లో బాసోజు రవి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ జగిత్యాల పట్టణ 34వ వార్డు కి చెందిన నూతిపెల్లి కవిత సురేష్ ల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కమిషనర్ సత్య ప్రణవ్ నాయకులు కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్ మాజీ చైర్మెన్ గోలి శ్రీనివాస్ ఎన్ ఆర్ ఐ సెల్ చాంద్ పాషా కౌన్సిలర్ లు దుమాల రాజ్ కుమార్ కమాల్ ఆయుబ్ ఖాన్ నాయకులు ఖయ్యుమ్ జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సాయి ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు చెట్టే భార్గవ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో ఘనంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు - ఊరేగింపులో మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), ఆగస్టు 26:**



పవిత్ర మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలో ముస్లిం సోదరులు నిర్వహించిన వేడుకలు, ఊరేగింపులు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు ముస్లిం సోదరులతో కలిసి ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.మిలాద్–ఉన్–నబీ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఊరేగింపులో పాల్గొన్న కోనేరు కృష్ణారావు, ముస్లిం సోదరులతో కలిసి శుభాకాంక్షలు పంచుకున్నారు. అనంతరం ఊరేగింపులో పాల్గొన్న వారికి లస్సీ ఏర్పాటు చేసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలాద్–ఉన్–నబీ పర్వదినం సోదరభావం, శాంతి, ప్రేమ, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర సోదరభావంతో, సామరస్యంతో కలిసి మెలగాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులందరికీ మిలాద్–ఉన్–నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. అదే సమయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహమ్మద్ మిన్హాజ్ ఆధ్వర్యంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు, ప్రజలకు మిఠాయిలు, శీతల పానీయాలు పంపిణీ చేశారు.మహమ్మద్ మిన్హాజ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో పార్టీ అత్యవసర కార్యక్రమాల కారణంగా డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ నేరుగా హాజరు కాలేకపోయినప్పటికీ, సిర్పూర్ నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ హృదయపూర్వక మిలాద్–ఉన్–నబీ శుభాకాంక్షలు తెలియజేశారని పేర్కొన్నారు.సిర్పూర్–కాగజ్‌నగర్ ప్రాంతం గంగా–జమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసి మెలగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో సిర్పూర్–కాగజ్‌నగర్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరస్పరం మిలాద్–ఉన్–నబీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## గుడిసెల జాబితాపై అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం

**మహబూబ్ నగర్ ఆగస్టు26 (వుదయం ప్రతినిధి)**



ఇందిరమ్మ ఇండ్ల మంజూరికి గుడిసెల జాబితా నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేసి వెంటనే సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కార్యాలయం నుండి వెబెక్స్ ద్వారా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ , డివిజనల్ ఇంజనీర్లు , అసిస్టెంట్ ఇంజనీర్లతో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, గుడిసెల జాబితా సమర్పణపై మహబూబ్ నగర్ జిల్లా ప్రాతిపదికన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల నుండి అందిన స్థితిగతుల నివేదికలను వివరంగా పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటివరకు నివేదికలు గుడిసెల జాబితాను సమర్పించని మండలాల అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమాచారాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా, తక్షణమే జిల్లా కార్యాలయానికి నివేదించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం పట్ల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరమైన తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహబూబ్ నగర్ జిల్లా గృహ నిర్మాణ శాఖ పి.డి.,ఉపేందర్ రెడ్డి, డి.ఈ.లు, ఏ.ఈ.లు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై ఎంపీ రఘునందన్ రావుతో భేటీ

**సంగారెడ్డి, ఆగస్టు 26వుదయం:**



భారతీయ పోస్టల్ ఎంప్లాయాస్ యూనియన్ (PIII), BGDKS యూనియన్ నాయకులు బుధవారం ఎంపీ ఎం. రఘునందన్ రావును ఆయన నివాసంలో కలిసి పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సంగారెడ్డిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటుకు కృషి చేసినందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామీణ్ డాక్ సేవకులను (GDS) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, ముత్తంగి, పాశమైలారం, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అధిక HRA మంజూరు చేయాలని కోరారు. అలాగే పోస్టల్ ఉద్యోగుల కోసం స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. GDS సమస్యను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. సంగారెడ్డి హెడ్ పోస్టాఫీసును మోడల్ పోస్టాఫీసుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ త్వరలో సంగారెడ్డి పోస్టాఫీసును సందర్శించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో PIII, BGDKS యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబి మతసామరస్యానికి ప్రతీక



**నారాయణపేట ఆగస్టు26 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో బుధవారం మిలాద్‌ఉన్‌నబి పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులు నిర్వ హించిన ర్యాలీ ఘనంగా, శాంతియుత వాతావరణంలో జరిగింది. ర్యాలీ సంద ర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్ మెయిన్ చౌక్ వద్ద పాల్గొని ముస్లింలకు మిలాద్‌ఉన్‌నబి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూమిలాద్‌ఉన్‌నబి పండుగ శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకుంటూ, ఐక్యత, స్నేహభావం తో జీవించాలని సూచించా రు.నారాయణపేట జిల్లా మతసామరస్యానికి ప్రతీక గా నిలుస్తోందని, హిందూ, ముస్లిం సోదరులు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటు తూ అన్ని పండుగలను పరస్పర సహకారంతో, సోదరభావంతో నిర్వహిం చుకోవడం అభినందనీ యమని ఎస్పీ పేర్కొన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.మిలాద్‌ఉన్‌నబి ర్యాలీ సందర్భంగా జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ మార్గమంతా కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ర్యాలీ సజావుగా జరిగేలా పోలీసులు నిరంత రం పర్యవేక్షణ చేపట్టారు. ముఖ్య కూడళ్లు, ర్యాలీ మార్గాల్లో ప్రత్యేక బందో బస్తు ఏర్పాటు చేసి ఎలాం టి అవాంఛనీయ సంఘట నలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టా రు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్, సీఐలు శివశంకర్, రవిబాబు, ఎస్సైలు వెంకటేశ్వర్లు, నరేష్, శిరీష, కృష్ణ చైతన్య, పోలీసు సిబ్బంది, హిందూ, ముస్లిం మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## మానవత్వం పరిమళించే... మనిషి ప్రాణం నిలబడే

- అర్ధరాత్రి చెంచు బాలుడి ప్రాణం నిలిపిన దాతలు

**నాగర్ కర్నూల్ రూరల్, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**



మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించిన ఘటన నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 16 ఏళ్ల చెంచు బాలుడు గణేష్‌కు అత్యవసరంగా ప్లేట్‌లెట్లు అవసరం కావడంతో పరిస్థితి విషమించింది. విషయం తెలుసుకున్న యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ దామగట్ల కుమార్ రాత్రి 11 గంటల సమయంలో రక్తదాతల కోసం అత్యవసర పిలుపునిచ్చారు.ఆ పిలుపుకు వెంటనే స్పందించిన గట్టు నెల్లికుదురు ఉప సర్పంచ్ బాలస్వామి, వైద్య ఆరోగ్య శాఖలో లెప్రసీ అధికారిగా పనిచేస్తున్న సుకుమార్ అర్ధరాత్రి వేళలోనే ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు. వారి సమయస్ఫూర్తితో బాలుడి ప్రాణాలకు ముప్పు తప్పింది.అత్యవసర సమయంలో మానవత్వంతో స్పందించి రక్తదానం చేసిన బాలస్వామి, సుకుమార్‌లను యూత్ రెడ్‌క్రాస్ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు సి. రమేష్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వారికి యూత్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగర్‌కర్నూల్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## జర్నలిస్టుల ఆపద్బాంధవుడు మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి ఆగస్టు 26:-వుదయం**



అందోల్ నియోజకవర్గ సీనియర్ పాత్రికేయులు అల్లాదుర్గం భూమయ్య ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ తో అనారోగ్యానికి గురయ్యారు.ఈ విషయం సీనియర్ జర్నలిస్ట్ మునిపల్లి యాదగిరి మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో అప్పటికప్పుడే స్పందించి హాస్పిటల్ కు చేరుకొని మెరుగైన వైద్య చికిత్స కోసం ఆస్పత్రి డాక్టర్ తో మాట్లాడారు. నాకు అత్యంత సన్నిహితుడు మెరుగైన వైద్యం చేయాలని సూచించారు. ఆస్పత్రిలో సీనియర్ పాతికేయలు భూమయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ, నేనున్నానని మంత్రి దామోదర్ రాజనర్సింహ భరోసానిచ్చారు. మెరుగైన వైద్యం చేయించిన మంత్రి దామోదర్ కు ఆందోల్ ప్రెస్ క్లబ్ జర్నలిస్ట్ లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మంత్రి అల్లాదుర్గం భూమయ్య మెరుగైన వైద్య సేవలు అందడంతో ప్రస్తుతం కోలుకొంటున్నా విషయం మంత్రి కి తెలియజేయడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ యధావిధి స్థానానికి రావాలని అన్నారు. మంత్రి చేసిన సహాయ సహకారాలువెలకట్టలేనివని యాదగిరి అన్నారు. మంత్రి సేవలు ఆందోల్ జర్నలిస్టు అందిస్తున్న సేవలను ఎల్లవేళలా గుర్తుంచుకుంటారని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర సోషల్ మీడియా ప్రచార కమిటీ సభ్యులు మునిపల్లి యాదగిరి అన్నారు.

## ఎరువు దొరకదు.. దొరికితే ధర మంట!

- ఎంఆర్పీకి మించి ఎరువులు, మందులు అమ్ముతున్నారన్న ఆరోపణలు
- బ్లాక్ దందాపై రైతుల ఆందోళన.. విత్తనాల అక్రమాల తర్వాతా అధికారుల నిఘా ఎక్కడ?

**వికారాబాద్ ఆగస్టు 25 (వుదయం బ్యూరో)**



పంట చేతికి రావాలంటే ముందుగా ఎరువు చేతికి రావాలి. కానీ వికారాబాద్ జిల్లాలో ప్రస్తుతం రైతుకు ఇదే పెద్ద సమస్యగా మారిందన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. కోడంగల్, పరిగి, తాండూర్, వికారాబాద్ పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో ఎరువుల లభ్యతపై రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దొరికిన చోట కూడా ఎంఆర్పీ కంటే అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కొన్నిచోట్ల కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై మండలాల వారీగా అధికారిక తనిఖీ వివరాలు, స్వాధీనం చేసుకున్న స్టాక్, అధిక ధరలపై నమోదైన కేసుల పూర్తి వివరాలు బహిరంగం కావాల్సి ఉంది.

**దొరకని ఎరువు.. రైతుకు తప్పని తిప్పలు**

వానాకాలం సాగు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా, డీఏపీ తదితర ఎరువుల కోసం రైతులు దుకాణాలు, సహకార సంఘాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఒకవైపు సరఫరా ఉందని అధికారులు చెబుతున్నా.. మరోవైపు తమకు అవసరమైన సమయంలో ఎరువు దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో అసలు సమస్య స్టాక్ కొరతలోనా? పంపిణీ వ్యవస్థలోనా? లేక మధ్యలో ఎక్కడైనా నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు మళ్లిస్తున్నారా? అన్నది తేలాల్సి ఉంది.

**'స్టాక్ లేదు'.. మరుసటి రోజు ఎలా వస్తోంది?**

రైతుకు అవసరమైన సమయంలో దుకాణంలో స్టాక్ లేదని చెప్పడం.. కొద్దిసేపటికి లేదా మరుసటి రోజు అదే ఎరువు అధిక ధరకు లభిస్తోందన్న ఆరోపణలు నిజమైతే అది సాధారణ విక్రయం కాదు. సరఫరా గొలుసులో ఎక్కడో ఒకచోట కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నం జరుగుతున్నట్లే. అందుకే జిల్లాలోని ప్రతి ఎరువుల డీలర్ వద్ద కంపెనీ నుంచి వచ్చిన స్టాక్, విక్రయించిన పరిమాణం, ప్రస్తుత నిల్వ, రైతుల పేర్లపై జరిగిన విక్రయాలు, పీఓఎస్ రికార్డులు, బిల్లులు ఒకేసారి పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ఎరువుల తర్వాత విత్తనాల దందా గుర్తుందా?**

ఇదే జిల్లాలో కొద్ది నెలల క్రితం సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీలో అక్రమాలు వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపింది. కొడంగల్ డివిజన్‌లో రైతులకు విత్తనాలు ఇవ్వకుండానే పంపిణీ చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన ఇద్దరు ఏఈవోలను సర్వీసు నుంచి తొలగించారు. దుద్యాల ఏవోను సస్పెండ్ చేయడంతో పాటు కొడంగల్ ఏడీఏను కమిషనరేట్‌కు అటాచ్ చేశారు.

**విత్తనాల అక్రమం.. ఇప్పుడు ఎరువులపై ఆరోపణలు**

విత్తనాల వ్యవహారం తర్వాత జిల్లాలో నకిలీ డీఏపీ వ్యవహారం కూడా వెలుగులోకి వచ్చింది. పూదూరు, పరిగి, బంట్వారం, యాలాల తదితర ప్రాంతాల్లో నకిలీ డీఏపీ బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. ల్యాబ్ పరీక్షల్లో ఒక నకిలీ డీఏపీ నమూనాలో ఉండాల్సిన నైట్రోజన్, ఫాస్ఫరస్ పరిమాణాలు అత్యల్పంగా ఉన్నట్లు తేలింది. ఇంకా తీవ్రంగా చెప్పాలంటే.. జిల్లాలోని పూదూరులో 176, పరిగి మండలంలో 24, బంట్వారంలో 49, యాలాలలో 30 నకిలీ డీఏపీ బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు తాజా వార్తా కథనం పేర్కొంది. గ్రామాల్లోకి వెళ్లి బస్తాకు రూ.1,700కు ఇంటివద్దకే తెచ్చి ఇస్తామని నమ్మించి నకిలీ డీఏపీ విక్రయించినట్లు కూడా నివేదిక పేర్కొంది.

**అధికారులపై చర్యలు జరిగాయి.. వ్యవస్థపై చర్య ఎప్పుడు?**

అక్రమాలు బయటపడిన తర్వాత కొందరు అధికారులపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ చర్యల్లో భాగమే. కానీ అసలు ప్రశ్న అక్కడితో ముగియదు. అక్రమాలు జరిగేంత వరకు పర్యవేక్షణ వ్యవస్థ ఏం చేసింది? స్టాక్ తనిఖీలు క్రమం తప్పకుండా జరిగాయా? డీలర్ల రికార్డులు పరిశీలించారా? సబ్సిడీ విత్తనాలు రైతులకు చేరాయా లేదా అన్నది ముందుగానే ఎందుకు గుర్తించలేకపోయారు? ఇప్పుడు ఎరువులపై రైతుల నుంచి ఆరోపణలు వస్తున్నప్పుడు కూడా ఇదే ప్రశ్న మళ్లీ ముందుకొస్తోంది.

**బిల్లులు బయటపెడితే అసలు దందా బయటపడుతుంది**

ప్రతి డీలర్ గత నెల రోజుల కొనుగోలు, విక్రయ బిల్లులను పరిశీలిస్తే చాలా విషయాలు బయటపడే అవకాశం ఉంది. కంపెనీ నుంచి ఎంత సరుకు వచ్చింది? ఎంత విక్రయించారు? రైతులకు ఎంత ధరకు ఇచ్చారు? ఎంత స్టాక్ మిగిలింది? రికార్డుల్లో ఉన్నదానికి, గోదాంలో ఉన్నదానికి తేడా ఉందా? రైతుల పేర్లతో నమోదు చేసిన విక్రయాలు నిజమేనా? అన్నది పరిశీలించాలి.

**రైతును దోచుకుంటే ఊరుకోరన్న ప్రభుత్వ ఆదేశాలు అమలవుతున్నాయా?**

నకిలీ విత్తనాలు, అధిక ధరల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు జూన్‌లో వార్తలు వెలువడ్డాయి. ఇప్పుడు ఆ ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయన్నదే ప్రశ్న. రైతు ఫిర్యాదు చేసిన తర్వాత స్పందించడం కాదు.. ముందుగానే దందాను అడ్డుకునేలా నిఘా వ్యవస్థ పనిచేయాల్సిన అవసరం ఉంది.

**'కొరత' పేరుతో దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు?**

ఎరువు దొరకక రైతు పొలంలో పంటకు నష్టం వస్తే బాధ్యత ఎవరిది? ఎంఆర్పీ కంటే ఎక్కువ చెల్లించి ఎరువు కొనాల్సి వస్తే రైతుకు న్యాయం ఎవరు చేస్తారు? నకిలీ ఎరువు లేదా నకిలీ విత్తనం వల్ల పంట దెబ్బతింటే పరిహారం ఎవరు చెల్లిస్తారు? ఇవి రైతు అడుగుతున్న ప్రశ్నలు మాత్రమే కాదు.. వ్యవసాయశాఖ పర్యవేక్షణకు ఎదురవుతున్న ప్రశ్నలు.

ఎం రవీందర్ సీనియర్ జర్నలిస్ట్

## అభాగ్యుల అమ్మ'కు జోహార్లు!



- ఆపన్నుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మదర్ థెరిస్సా
- గద్వాలలో ఉప్పొంగిన నివాళుల వెల్లువ.. సేవలకు ఘన నీరాజనం
- వేదవ్యాస సంస్థ డివిజన్ బాధ్యతల్లో నడిపి బచ్చన్న

**గద్వాల ఆగస్టు 26 (వుదయం బ్యూరో)**

ఆర్తుల కన్నీ తుడిచిన క్షణమే అసలైన మానవత్వమని, నిరాశ్రయుల పాలిట 'ప్రేమమూర్తి'గా నిలిచిన మదర్ థెరిస్సా త్యాగ నిరతి నేటి సమాజానికి దిశానిర్దేశమని పలువురు వక్తలు చాటిచెప్పారు. సేవను ఒక బాధ్యతగా కాక స్వీయ ధర్మంగా మలుచుకున్న ఆమె సేవలు కలకాలం చిరస్మరణీయమని స్పష్టం చేశారు. వేదవ్యాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వేదవ్యాస సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పీసీ అశోక్‌కుమార్‌కు పాఠశాల కరస్పాండెంట్ రంగన్న శాలువాతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి వినమ్ర పూర్వక నివాళులర్పించారు. సేవా పథంలో పయనిద్దాం: ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రంగన్న మాట్లాడుతూ.. సమాజం విసిరేసిన దిక్కులేని ప్రాణులను గుండెలకు హత్తు కున్న మహోన్నత శక్తి మదర్ థెరిస్సా అని కొనియాడారు. కష్టాల్లో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించడమే ఆమెకు అర్పించే నిజమైన నివాళి అని, ప్రతీ ఒక్కరూ ఆమె సేవా మార్గాన్ని ఆచరించా లని పిలుపునిచ్చారు. బాధ్యతల శిఖరాన నడిపి బచ్చన్న ఇదే వేదికపై సంస్థ గద్వాల తాలూకా కోఆర్డినేటర్ రాములు వేదవ్యాస స్వచ్ఛంద సంస్థ గద్వాల్ డివిజన్ కోఆర్డినే టర్‌గా నడిపి బచ్చన్న (జాన్)ను నియమి స్తున్నట్లు ప్రకటించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన బచ్చన్న మాట్లాడుతూ, డివిజన్ వ్యాప్తంగా సేవా సైన్యాన్ని సమాయత్తం చేసి, అణగారిన వర్గాల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి చక్రి నరసింహులు, వెంకటేష్, టీజీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి



- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు

**అచ్చంపేటఆగస్టు 26:(వుదయంప్రతినిధి )**

పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి నరసింహ హాజరై మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ఉపాధి కూలీలకు 12 వేల రూపాయలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు రెండో విడత మంజూరు చేయాలని, వృద్ధులందరికీ పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ జిల్లా కమిటీ సమావేశంలో శ్రీ ఉమామహేశ్వర ప్రాజెక్టు డిజైన్ మార్చాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు చింతల నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి నందిపేట భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు రాములు, రాధాకృష్ణ, కలమండల సాయిలు, చిన్నరవి, చిక్కుడు సాయిలు పాల్గొన్నారు.

## సిద్ధిపేటలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- శాంతి, సోదరభావం, మానవత్వమే మహమ్మద్ ప్రవక్త సందేశం
- ముస్లిం సోదరులకు పండ్ల రసం పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట, ఆగస్టు 26 (వుదయం బ్యూరో)**



మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవాళి అంతటికీ నిత్య మార్గదర్శకమని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేట పట్టణంలో మహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో, అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ పవిత్ర సందర్భంగా పట్టణంలోని మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనం పూర్తి చేసుకున్న అనంతరం, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారికి పండ్ల రసాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పూజల హరికృష్ణ, అత్తు ఇమామ్ మాట్లాడుతూ... ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, కరుణ, సోదరభావం, పేదల పట్ల దయ మరియు సమాజంలో ఐక్యత వంటి దివ్య విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుకున్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా పరస్పరం గౌరవించుకుంటూ, ఐకమత్యంతో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు .ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు రైసుద్దీన్, ఖయాజుద్దీన్, వహాబ్, అజ్మత్, విజయ్, డానియల్ పాల్గొన్నారు.

## పి.ఆర్.ఏ స్క్వేర్ ఇంటీరియర్స్ ప్రారంభం



**వుదయం , సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలో పి.ఆర్.ఏ స్క్వేర్ ఇంటీరియర్స్ నూతన సంస్థను బుధవారం వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు కొలుపుల ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటలో నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పి.ఆర్.ఏ స్క్వేర్ ఇంటీరియర్స్ మంచి పేరు సంపాదించి విజయవంతంగా ముందుకు సాగాలని కోరారు.

## మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు గౌరవ డాక్టరేట్



**వుదయం, సిద్దిపేట/హైదరాబాద్**

సమాజంలోని నిరుపేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆమె సామాజిక సేవలను గుర్తించిన న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ' గౌరవ డాక్టరేట్, మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డు'తో పాటు బంగారు పతకం అందజేశారు. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ చైర్మన్ బిషప్ డాక్టర్ జోసెఫ్ పలంగి మాట్లాడుతూ.. సామాజిక సేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్న మహమ్మద్ సుల్తాన ఉమర్ పేదలు, నిరుపేద కుటుంబాలు, అణగారిన వర్గాలకు తనవంతు సహాయాన్ని అందిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా మహమ్మద్ సుల్తాన ఉమర్ మాట్లాడుతూ గౌరవాలు, అవార్డులను వ్యక్తిగతంగా తనకు దక్కినవిగా భావించడం లేదని, సమాజం కోసం సేవ చేస్తున్న ప్రతి ఒక్కరికీ దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని తెలిపారు.డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ గౌరవ డాక్టరేట్‌తో పాటు మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డు, బంగారు పతకం లభించడం తన సామాజిక సేవా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచిందన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా సమాజం కోసం పనిచేస్తున్న మహమ్మద్ సుల్తాన ఉమర్ సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కమ్యూనిటీ సభ్యులు డాక్టర్ రోనాల్డ్ జాన్, కన్సల్టెంట్ అండ్ కౌన్సిలర్ (ఎడ్యుకేషన్), హైదరాబాద్ రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## మహాపాదయాత్రకు ఆహ్వానించిన కమిటీ ప్రతినిధులు

**పటాన్చెరువు (వుదయం):**



వీరశైవ లింగాయత్ సేవా సమితి మరియు వీరశైవ లింగాయత్ మహాపాదయాత్ర కమిటీ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థమై నిర్వహించనున్న 19వ మహాపాదయాత్ర కార్యక్రమానికి అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ నూతన జాతీయ అధ్యక్షులు, కర్ణాటక రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ ఈశ్వర భీమన్న ఖండ్రే గారిని కమిటీ ప్రతినిధులు సగౌరవంగా కలిసి ఆహ్వానించారు.వీరశైవ లింగాయత్ సమాజ అభ్యున్నతికి దేశవ్యాప్తంగా విశేష కృషి చేస్తున్న ఈశ్వర ఖండ్రే గారికి మహాపాదయాత్ర కరపత్రాలను అందజేసి, పటాన్చెరు నుండి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం, బొంతపల్లి వరకు నిర్వహించబడనున్న 19వ మహాపాదయాత్ర యొక్క ఆధ్యాత్మిక, సాంస్కృతిక మరియు సామాజిక విశిష్టతను కమిటీ సభ్యులు వివరించారు. 19వ మహాపాదయాత్ర ఘనవిజయం సాధించాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు తన శుభాకాంక్షలు తెలియజేశారు.కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గత పద్దెనిమిది సంవత్సరాలుగా నిరంతరాయంగా నిర్వహిస్తున్న మహాపాదయాత్రకు భక్తుల నుండి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు పాల్గొంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని, ఈ ఏడాది నిర్వహించనున్న 19వ మహాపాదయాత్రను మరింత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుండి వీరశైవ లింగాయత్ సమాజ ప్రముఖులు, మఠాధిపతులు, ప్రజాప్రతినిధులు మరియు భక్తులు పాల్గొనే అవకాశముందని పేర్కొన్నారు.అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈశ్వర ఖండ్రే గారికి అందించిన ఈ ఆహ్వానం వీరశైవ లింగాయత్ సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశం ద్వారా తెలంగాణ మరియు కర్ణాటక రాష్ట్రాల వీరశైవ లింగాయత్ సమాజాల మధ్య మరింత సత్సంబంధాలు, సాంస్కృతిక అనుబంధం మరియు సమన్వయం బలోపేతం అవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ (రాజు), జగప్ప, అభినయ్ కుమార్, మఠం ప్రశాంత్ కుమార్, యువరాజ్ నివర్తి రాజ్ మోరే తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న G, M, Rటీమ్

**వుదయం సిర్గాపూర్ తేదీ:**

సిర్గాపూర్,మండలం: చిమల్‌పాడ్, గ్రామానికి చెందిన, ప్యాట్,మల్లప్ప గారి కుమార్తె, వివాహ,వేడుకలో GMR ఫౌండేషన్ చైర్మన్ BRS పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ ఆదేశాల మేరకు GMR టీమ్, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా,నూతన వధూవరులను,ఆశీర్వదించి, వారికి,హృదయపూర్వక శుభాకాంక్షలు,తెలిపారు. నూతన,దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో చిమల్‌పాడ్, గ్రామ బీఆర్ఎస్, పార్టీ సీనియర్ నాయకులు, బావుగే బస్వరాజ్, పాటిల్ గారు, గ్రామ, యువ,నాయకులు రమేష్ బస్వరాజు పాటిల్ గారు, GMR టీమ్ సభ్యులు తుకారాం, నాయకులు సందీప్,G.M. Rఫౌండేషన్ ప్రతినిధులు అభి,పవర్, కుటుంబ, సభ్యులు, బంధుమిత్రులు,పలువురు నాయకులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శి రవిపై దాడి చేసిన సర్పంచ్ భానుప్రసాద్ ను పదవి నుంచి తొలగించాలి

**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనరసయ్య.**

**ఖానాపురం, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**

గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆవుల రవిపై దాడి చేసిన గ్రామ సర్పంచ్ భూక్య భానుప్రసాద్ ను వెంటనే సర్పంచ్ పదవి నుంచి తొలగించాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకట నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలోని బోటిమీదితండా గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఆవుల రవిపై గ్రామ సర్పంచ్ భూక్య భానుప్రసాద్ ఒక్కసారిగా దాడి చేయడంతో కార్యదర్శి అయోమయానికి గురి అయినట్లు తెలుపుతూ, ప్రభుత్వ అధికారిపై దాడి చేసిన సర్పంచ్ ని వెంటనే విధుల నుంచి తొలగించాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన అధికారులకు తెలుపుతూ, గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏ ఒక్క పంచాయతీ కార్యదర్శిని ఏ ఒక్క గ్రామ పంచాయతీ సర్పంచ్ కూడా కనీసం తిట్టిన దాఖలు లేవని తెలుపుతూ, ప్రజా ప్రతినిధులు అధికారులతో పనులు చేయించుకోవలే తప్ప అధికారులను కొట్టే అర్హత ప్రజాప్రతినిధికి లేదని ఆయన గుర్తు చేస్తూ, తక్షణమే ఈవిషయమే జిల్లా కలెక్టర్ కలుగజేసుకొని జిల్లావ్యాప్తంగా ఏ ఒక్క సర్పంచ్ ఇలాంటి తప్పు చేయకుండా వెంటనే కార్యదర్శిపై చేయి చేసుకున్న సర్పంచ్ ని పదవి నుంచి తొలగించాలని బిఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలుపుతూ, కార్యదర్శిపై చెయ్యి చేసుకున్న సర్పంచ్ బహిరంగంగా కార్యదర్శికి క్షమాపణ చెప్పాలని తెలిపారు. గ్రామంలో జరుగుతున్న అవినీతిని కార్యదర్శి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సర్పంచ్ ఆగ్రహించి కార్యదర్శిని కొట్టినట్లు సమాచారం ఉందని తెలిపారు. అధికార పార్టీ సర్పంచ్ కార్యదర్శిపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా బీఎల్ఏలు బాధ్యతగా పనిచేయాలి

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కం అశోక్**

**గ్రామాల్లో పర్యటించిన అశోక్ కు ఘన సన్మానం**

**మహాదేవపూర్: ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**



అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా బీఎల్ఏలు బాధ్యతగా పనిచేయాలని ఎస్ఐఆర్ రెండో దశ సవరణను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం అశోక్ అన్నారు.బుధవారం మహాదేవపూర్ మండలం మద్దులపల్లి, పలుగుల, గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ మహాదేవపూర్ మండల అధ్యక్షుడు అశోక్ పర్యటించగా, గ్రామాలలోని సర్పంచులు,నాయకులు ఘనంగా శాలువలతో సన్మానించి నూతనంగా పార్టీ అధ్యక్ష పదవికి నియామకమైనందుకు శుభాకాంక్షలు తెలిపారు.గ్రామాలలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ ప్రక్రియపై సమావేశంలో ఆయన పాల్గొని, మొదటి దశ పూర్తయిన సందర్భంగా రెండో దశ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బీఎల్ఏలకు సూచనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బీఎల్ఏలు పాల్గొని ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ఆదేశాల మేరకు మద్దులపల్లి, పలుగుల గ్రామాలలో ఎస్ఐఆర్ రెండో దశపై బీఎల్ఏలకు సూచనలు చేయడం జరిగిందని అన్నారు.రెండో దశ సవరణను కూడా విజయవంతంగా పూర్తి చేయాలని, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణల కోసం ఫారం 8 ను, కొత్త ఓటర్ల నమోదుకు ఫారం 6 ను సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా బీఎల్ఏలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సరిత, గారే విజయలక్ష్మి శంకర్, నాయకులు మానెం మహేష్, మెంగాని అశోక్, సురేందర్, సమ్మయ్య, దుర్గయ్య, గట్టయ్య, మోతే సాంబయ్య, బుర్రి శివరాజు, లచ్చిరెడ్డి, ఒడ్డి చంద్రయ్య తో పాటు నాయకులు, పాల్గొన్నారు.

# మూలనపడ్డ చెత్త వాహనాలు.. మురికికూపంగా జమ్మల్‌పురం

**పారిశుద్ధ్యం గాలికి.. అధికారుల పర్యవేక్షణ కరువు.**

**నిరుపయోగంగా ప్రభుత్వ వాహనాలు..**

**రోడ్లపై పేరుకుపోతున్న చెత్త**

**చిన్న వర్షా నికే జలమయం.. సైడ్ డ్రైనేజీ లేక ప్రజలకు అవస్థలు**

**పర్వతగిరి, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**

"పారిశుద్ధ్యమే ఆరోగ్యానికి భద్రత" అనే నినాదం కాగితాలలో మాత్రం కనిపించి దం లేదని జమ్మల్‌పురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, వ్యర్థాల నిర్వహణ ద్వారా గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం అందించిన చెత్త సేకరణ వాహనాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని జమ్మల్‌పురం గ్రామపంచాయతీకి చెందిన చెత్త సేకరణ ఆటో, రిక్షాలు మూలనపడి శిథిలావస్థకు చేరుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందని మండిపడుతున్నారు.



ఎక్కడ చూసినా చెత్త కుప్పలే..



చెత్త సేకరణ వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వాన్నంగా మారాయని స్థానికులు చెబుతున్నారు.

రోడ్ల వెంట, నివాస ప్రాంతాల సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చిన్న వర్షా నికే జలమయం..**

గ్రామంలో సరైన సైడ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచిపోతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు కాలువలు సైతం పూడుకుపోయి వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని చెబుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

గ్రామపంచాయతీకి చెందిన ప్రభుత్వ వాహనాలు వినియోగంలోకి పనికిరాకుండా మూలనపడినా సంబంధిత అధికారులు, పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ కార్యదర్శి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి వాహనాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.ప్రజాధనంతో సమకూర్చిన వాహనాలను నిరుపయోగంగా వదిలేయకుండా వెంటనే మరమ్మతులు చేయించి చెత్త సేకరణకు వినియోగించాలని, గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయాలని, సైడ్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజలు చిరకాలం గుర్తుంచుకునే కలను సహకారం చేసింది దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది

**ఘనంగా పెద్ది సంతాప సభ, మహా అన్నదానం**

**ఖానాపురం, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**

నర్సంపేట నియోజకవర్గ ప్రజలు రైతులు యువకులు చిన్నలు పెద్దలు చిరకాలం గుర్తుంచుకునే విధంగా గోదావర్యు తల్లిని పాకాల సరస్సులోకి తేవడం, జిల్లా స్థాయిలో ఉండే కార్పొరేటర్ స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నియోజకవర్గంలో మెడికల్ కాలేజీని నిర్మాణం చేయడంతో దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నియోజకవర్గ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని బిఆర్ఎస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ బజ్జిరి శ్రీనివాస్ గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మాదాసు వెంకన్న,మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోరే సుధాకర్ నియోజకవర్గ ప్రజలకు తెలిపారు. మండలంలోని ధర్మారావుపేట గ్రామంలోని దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది చిత్రపటానికి నాయకులు గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులర్పించి ఘనంగా సంతాప సభను ఏర్పాటు చేసి మహా అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు భూస అశోక్‌యాదవ్,మండల యూత్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కోరే రాము,గ్రామపార్టీ ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల సత్యం,సీనియర్ నాయకులు కత్తుల వెంకటేశ్వర్ రావు, పోతరాజు కర్ణాకర్, సోషల్ మీడియా ఇన్చార్జ్ తోట రవి, నాయకులు చెంచల కృష్ణ, కోడిమాల సురేష్, తక్కలపల్లి కర్ణాకర్ రావు, తాళ్ల సంతోష్, జలకల అశోక్, కర్ర రమేష్, నాగెల్లి వెంకన్న,కొలుగూరి దేవేందర్ రావు, కూస కుమార్, పొన్నాల ఎల్లయ్య, నాగెల్లి తిరుమలి, ఇంతల యాదయ్య, అడ్డూరి మోహన్ రావు, తొర్రూరు సంజీవ, పెండ్లి జన్నయ్య తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# గృహప్రవేశ వేడుకకు హాజరై ఆఫీసుద్దీన్ షబాన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**పర్వతగిరి ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి ):**

పర్వతగిరి గ్రామానికి చెందిన ఆఫీసుద్దీన్-షబాన దంపతులు మంచిర్యాల పట్టణంలోని రామకృష్ణాపూర్‌లో నూతనంగా నిర్మించుకున్న గృహంలో బుధవారం గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్వతగిరి సొసైటీ వైస్ చైర్మన్ సందెల నవీన్, పర్వతగిరి మాజీ సర్పంచ్ గోనె సంపత్,



బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు శంషుద్దీన్, ధారం రాంచందర్ గుప్తా, కానిస్టేబుల్ ఇస్లావత్ రాజేందర్ తదితరులు హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో వారు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# అశోక్ కు లభించిన పదవితో పద్మశాలి సమాజానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాం

**జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు క్యాతం సతీష్‌కుమార్**

**జయశంకర్ భూపాలపల్లి , ఆగస్టు 26(వుదయం జిల్లా ప్రతినిధి):**

కాంగ్రెస్ పార్టీ మహాదేవపూర్ మండల అధ్యక్షుడిగా అశోక్ కు లభించిన పదవితో పద్మశాలి సమాజానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాం అని భూపాలపల్లి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు క్యాతం సతీష్‌కుమార్ అన్నారు మహాదేవ్‌పూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన పద్మశాలి ముద్దుబిడ్డ కట్కం అశోక్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించడంపై పద్మశాలి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అశోక్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు కాంగ్రెస్ పార్టీ కోసం అశోక్ చేసిన సేవలను గుర్తించి ఆయనకు మండల పార్టీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పద్మశాలి సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నూతన బాధ్యతల్లో అశోక్ విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు క్యాతం సతీష్‌కుమార్ మాట్లాడుతూ పద్మశాలి కులబాంధవుడైన అశోక్



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులు కావడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అశోక్‌కు అప్పగించిన బాధ్యత కీలకమైనదని, ఆయన రాజకీయ ప్రస్థానంలో పద్మశాలి సమాజం అండగా నిలిచి పూర్తి సహకారం అందించాలని కోరారు. కాటారం సబ్‌డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పద్మశాలి సమాజ అభివృద్ధికి కూడా అశోక్ కొంత సమయాన్ని కేటాయించాలని సతీష్‌కుమార్ సూచించారు.

పద్మశాలి కులబాంధవుల చిరకాల ఆకాంక్ష అయిన కమ్యూనిటీ హాల్, మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణం కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో మాట్లాడి అవసరమైన సహకారం అందేలా కృషి చేయాలని కోరారు.పద్మశాలి సమాజం కేవలం వ్యాపార రంగానికే పరిమితం కాకుండా సామాజిక సేవ, ప్రజాసేవతో పాటు రాజకీయ రంగంలోనూ ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేయడంతో పాటు సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు కట్కం అశోక్‌కు లభించిన ఈ పదవి వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, మొత్తం పద్మశాలి సమాజానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు పద్మశాలి సమాజ అభివృద్ధికి కూడా కృషి జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అలుబాక సుజాత,జిల్లా కోశాధికారి వీరస్వామి, సంఘం నాయకులు పెనుమల్ల రమేష్, గాదె రమేష్, పంతగాని సమ్మయ్య, పేరిణి గట్టు స్వామి, మాచర్ల అశోక్, మాచర్ల కుమార్, సత్తయ్య బాలిన ప్రకాష్, దోమల రవి, పోగు సుధాకర్ లతో పాటు, కులబాంధవులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉద్యోగుల హక్కుల సాధనకు మహాధర్నా

**జిల్లా కేంద్ర మహాధర్నాకు వేలాదిగా తరలిరావాలి.**

**టి ఎస్ యు టి ఎఫ్ జిల్లా కార్యదర్శి మేరుగు ప్రసన్న.**

**జిల్లా కేంద్రం, ఆగస్టు 26 (వు దయం ప్రతినిధి):**

ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు వేలాదిగా తరలిరావాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మేరుగు ప్రసన్న పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కాకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. పలుమార్లు ప్రభుత్వానికి వినతులు సమర్పించి, చర్చలు జరిపి సమస్యలను దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు.

ప్రధాన డిమాండ్లు...

పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని వెంటనే అమలు చేయడం, ఆరు డీఏలను విడుదల చేయడం, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించడం, పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడం, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయడం, జీఓ 317తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడం, ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. డిమాండ్ల సాధనలో భాగంగా ఇప్పటికే పాఠశాల స్థాయిలో నల్ల రిబ్బన్లతో నిరసన, తహసీల్దార్లకు మెమోరాండం సమర్పణ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మూడో దశలో భాగంగా



టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో రేపు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. మహాధర్నాను విజయవంతం చేయాలని టి ఎస్ యు టి ఎఫ్ నాయకులు అజ్మీరా రాజారాం, బిక్షపతి, రజియా సుల్తానా తదితరులు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

# వివాహ వేడుకకు పాల్గొన్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

**హసన్ పర్తి ఆగస్టు26 (వుదయం ప్రతినిధి):**



హసన్ పర్తి మండల కేంద్రంలోనీ ఎల్లాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దేవన బోయిన నిర్మల కుమారస్వామి పెద్ద కుమారుడు గౌతమ్ యాదవ్ వివాహ శుభ కార్యానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. బుధవారం కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఎల్లాపూర్ గ్రామంలో పలు శుభ కార్యాలయాలకు హాజరైనారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సహాయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భాష బోయిన రవీందర్ యాదవ్, మాజీ సర్పంచ్ దేవన బోయిన నిర్మల కుమారస్వామి ఆయనను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ ఎంపీ వినోద్ కుమార్ గౌతమ్ యాదవ్ కు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రవీందర్ యాదవ్ ఉద్యమకారుల సమస్యలను ప్రస్తుత ప్రభుత్వానికి తెలియజేయాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్ర సురేందర్, ఏల్తూరి సురేష్, ఎల్లాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పాడి రామకృష్ణారెడ్డి (పెద్దిరెడ్డి) మాజీ ఎంపిటిసి కల్వచర్ల సుదర్శన్, ప్రవీణ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

# రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర అన్యాయం



**–మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య**

**తొర్రూరు ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**

రోస్టర్ విధానంలో మాలలకు తీరని అన్యాయం జరుగుతుం దని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య పేర్కొన్నారు.బుధవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతిభవనంలో మాల మహానాడు జిల్లా ఇన్చార్జి యం ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన మాల మహానాడు జిల్లా ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన చెన్నయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకణ రోస్టర్ జీవో 99 వల్ల మాల సామాజిక వర్గం నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రూప్ 3 లోని మాల, అనుబంధ కులాలకు కొన్ని నోటిఫికేషన్లలో సున్నా పోస్టులు, మరికొన్ని నోటిఫికేషన్ల లో 2 శాతం లోపు ఉద్యోగాలను కేటాయించడం అన్యాయమన్నారు. రోస్టర్ విధానంలో ఉన్న లోపాల గురించి రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి మాత్రమే మాట్లాడుతున్నారని, మిగతా ఎమ్మెల్యేలు, ఎం ఎల్ సి లు,ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. సబ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం రోస్టర్ ను తక్షణం సవరించాలని డిమాండ్ చేశారు.

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి చెమట చిందించిన మాలలకు న్యాయం జరగడం లేదన్నారు. రోస్టర్ పాయింట్ల సవరణ కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు జిల్లాల వారీగా సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థి యువకులను చైతన్య పరుస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామని స్పష్టం చేశారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక....

అధ్యక్షులుగా ఎనమాల రాకేష్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా గుండాల బిక్షం, డోర్నకల్ నియోజకవర్గ అధ్యక్షులు గా కొప్పుల శ్రీనివాస్ గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా చెన్నయ్య నియామక పత్రాలు అందజేశారు.ఈ సమావేశం లో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దాసరి ప్రకాష్ , గుర్రాల లింగన్న , ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పంజా కల్పన, సీనియర్ నాయకులు పప్పుల వెంకన్న, ప్రేమ్, గుండాల బిక్షం, కొప్పుల శ్రీనివాస్, గౌడిశాల సంజీవ రావు, సోషల్ మీడియా కన్వీనర్ జి రమేష్,ఉద్యోగ సంఘాల నాయకులు సుధాకర్ రవి పాల్గొన్నారు

## ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ సినపెల్లి రాజు

# తండ్రి కీ. శే ఓదెలు చిత్రపటానికి నివాళులు

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్**

**వర్ధన్నపేట , ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి ):**



వర్ధన్నపేట మండలం లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ సినపెల్లి రాజు తండ్రి గారైన కీ. శే ఓదెలు ఇటీవల మరణించగా బుధవారం వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించినారు. వారితోపాటుమాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి వర్ధన్నపేట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుళ్ళ కుమారస్వామి , పర్వతగిరి పిఏసీఎస్ చైర్మన్ మనోజ్ కుమార్ , ఊకంటి వనం రెడ్డి ,వర్ధన్నపేట మండల అధ్యక్షులు గోధుమల మధుసూదన్ , మున్సిపల్ కౌన్సిలర్ గుజ్జ వీర రాఘవరావు , మాజీ సర్పంచ్ స్రవంతి అంజన్ రావు , ఉప సర్పంచ్ ఆగపాటి రాజు , గోక రాజు , గోక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్‌అధికారులు,సిబ్బందిని అభినందించిన సీపీ



**హనుమకొండ క్రైం, ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి) :**

హన్మకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో క్యాటరింగ్ కాంట్రాక్ట్ పేరు హాస్టల్ యజమానులను మోసం చేస్తూ లక్షల్లో సొమ్మును కాజేసిన నిందితుడుని పట్టు కోవడంలో ప్రతిభ కనబరిచిన హన్మకొండ ఇన్స్ స్పెక్టర్ శివ కుమార్, ఏఏఓ సల్మాన్ పాషాతో పాటు కానిస్టేబుళ్ళు కిరణ్ కుమార్,రమణకుమార్, రవి, మహిళా కానిస్టేబుల్ కారుణ్య, హోం గార్డ్ రవిని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ సీపీ కార్యాలయంలో అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత,హన్మకొండ కొండ ఏసీపీ నర్సింహారావు పాల్గొన్నారు.

# పలుగుల గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మహాదేవపూర్: ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**

మహాదేవపూర్ మండలంలోని పలుగుల గ్రామంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ గారే విజయలక్ష్మి శంకర్, ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆదేశాల మేరకు పలుగుల గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం అన్నారు స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే రేషన్ సౌకర్యాలను మరింత సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు

.స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమలలో ఉపసర్పంచ్ ఓడ్డి చెంద్రయ్య,వార్డ్ మెంబర్ రమేష్ రేషన్ డీలర్ బీరం బాబు రెడ్డి లబ్ధిదారులు,గ్రామపంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి భూముల రీసర్వే పై అవగాహన సదస్సులు

**మహాదేవపూర్: ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**

నేటి నుండి మహాదేవపూర్ మండలంలో భూ భారతి భూముల రీసర్వే పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ సత్యనారాయణ స్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి భూముల రీసర్వే పై అవగాహన సదస్సులు మహాదేవ్‌పూర్ లో 27వతేదిన ఉదయం 10:30, బ్రాహ్మణపల్లి గ్రామంలో మధ్యాహ్నం 12:30 గం.లకు సూరారం గ్రామంలో 29వతేదిన ఉదయం 10:30 గం.లకు పెద్దంపేట గ్రామంలో మధ్యాహ్నం 12:30 గం.లకు గ్రామాలలోని గ్రామ పంచాయతీ ఆవరణ అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

గ్రామాల రైతులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు,అందరూ ఈ అవగాహన సదస్సులకు తప్పక హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

**భూపాలపల్లి,ఆగస్టు 26 (వుదయం విలేకరి):**

భూపాలపల్లి కలెక్టరేట్ సమీపంలోని జాతీయ రహదారిపై పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం భూపాలపల్లి సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు.వారి నుంచి సుమారు 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు TS 02 UC 2103 నంబర్ గల టాటా ఏసి పికప్ ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు భూపాలపల్లి సి ఆర్ నగర్ కు చెందిన పావనపు రాజు, భూపాలపల్లి సి ఆర్ నగర్ కు చెందిన నీలుగొండ రమేష్,అనే నిందితులను అదుపులోకి తీసుకొని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ కు అప్పగించారు.పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం,



నిల్వ చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిసిఎస్ పోలీసులు హెచ్చరించారు.

# వడ్డీ వ్యాపారుల ఆగడాలను వెంటనే అరికట్టాలి



**తొర్రూరు ఆగస్టు 26 (వుదయం ప్రతినిధి):**

పేద ప్రజలను పీడిస్తున్న వడ్డీ వ్యాపారులు,వడ్డీలకు చక్రవడ్డి,బారువడ్డీ అంటూ సొమ్ము చేసుకుంటున్నా దళారులు, వడ్డీ వ్యాపారుల ఆగడాలను వెంటనే అరికట్టాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతియ అధ్యక్షులు డాక్టర్ మంగళంపల్లి హుస్సేన్ అన్నారు. బుధవారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని గెస్ట్ హౌస్ లో జరిగిన ప్రెస్ మీట్ లో వారు మాట్లాడుతూ తొర్రూర్ డివిజన్ కేంద్రంలో వడ్డీ వ్యాపారం మితిమీరి కొందరి ప్రాణాల మీదికి వచ్చిందని అలాంటివారిని వెంటనే కేసు నమోదు చేయాలని అన్నారు. డివిజన్ కేంద్రానికి చెందిన ఏ టు జెడ్ మెడికల్ షాపు పల్లెర్ల రమేష్ (నేషనల్ హ్యూమన్ రైట్స్ డివిజన్ అధ్యక్షులు)వడ్డీ వ్యాపారుల ఆకృత్యాలకు బలై వారి యొక్క ఒత్తిడులను తట్టుకోలేక మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా అతన్ని వెంటనే వరంగల్ లోనే ఒక ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకెళ్లడం జరిగిందని,, ఇప్పుడు అతని పరిస్థితి విషమంగా ఉందని, చేసుకోవడానికి కారణమైన వ్యక్తులపై వెంటనే సుమోటోగా కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, వడ్డీ వ్యాపారుల అఘాయిత్యాలను అరికట్టాలని సూచించారు . ఇలాంటి చర్యలను హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కమిటీ మెంబర్ దేశగాని అశోక్ గౌడ్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంధం లాలయ్య, జిల్లా కమిటీ సభ్యులు కుంభం మహేష్, పెద్దవంగర మండల చైర్మన్ డాక్టర్ కుమ్మరి రామ్మూర్తి,డివిజన్ కమిటీ సభ్యులు మదేని మహంకాళి సభ్యులు తదితరులు ఉన్నారు.

# చక్కని ఆరోగ్యం

## గాయాలు అయిన వారు ఇలాంటి నీటిలోకి దిగితే ప్రమాదకరం..



మాంసాన్ని తినేసే బ్యాక్టీరియాగా పిలిచే కొన్ని రకాల సూక్ష్మజీవులు వేడెక్కుతున్న సముద్ర జలాల్లో వేగంగా విస్తరిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ముఖ్యంగా విబ్రియో వల్నిఫికస్ అనే బ్యాక్టీరియా గాయాల ద్వారా శరీరంలోకి ప్రవేశించి తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుంది. అరుదుగా సంభవించినప్పటికీ, ఈ ఇన్ఫెక్షన్ వేగంగా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉండటంతో సముద్రంలో ఈత కొట్టేవారు, మత్స్యకారులు, పచ్చి సముద్ర ఆహారం తినేవారు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. మాంసాన్ని తినే బ్యాక్టీరియా అనే పదం వాస్తవానికి చర్మాన్ని తినేయడం అనే అర్థంలో కాదు. కొన్ని బ్యాక్టీరియాలు నెక్రోటైజింగ్ ఫాసియైటిస్ అనే అరుదైన తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు కారణమవుతాయి. ఇవి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత విషపదార్థాలను విడుదల చేసి చర్మం కింద ఉండే కణజాలంతోపాటు కండరాలు, నరాలు, రక్తనాళాలను దెబ్బతీస్తాయి. బ్యాక్టీరియా రక్తప్రవాహంలోకి చేరితే ఇతర అవయవాలకు కూడా వేగంగా వ్యాపిస్తుంది. చికిత్స అందకపోతే కొన్నిసార్లు 48 గంటల్లోనే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుంది. నెక్రోటైజింగ్ ఫాసియైటిస్‌కు సాధారణంగా గ్రూప్ ఎ స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియా ప్రధాన కారణంగా ఉంటుంది. అయితే విబ్రియో వల్నిఫికస్ కూడా ఈ తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు కారణమయ్యే బ్యాక్టీరియాల్లో ఒకటిగా ఉంది. అమెరికాలో ప్రతి ఏడాది సుమారు 150 నుంచి 200 వరకు విబ్రియో వల్నిఫికస్ ఇన్ఫెక్షన్లు నమోదవుతున్నప్పటికీ, వీటిలో సుమారు ఐదుగురిలో ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారు. యూరప్‌లోనూ ఈ ఇన్ఫెక్షన్ల సంఖ్య పెరుగుతున్నట్లు సమాచారం. విబ్రియో వల్నిఫికస్ ప్రధానంగా వేడిగా ఉండే సముద్రపు నీటిలో జీవిస్తుంది. సముద్రం, మంచినీరు కలిసే ఉప్పునీటి ప్రాంతాల్లోనూ ఇది కనిపిస్తుంది. సాధారణంగా వెచ్చని నెలల్లో ఇన్ఫెక్షన్లు ఎక్కువగా నమోదవుతాయి. సముద్రంలో ఈత కొట్టడం, చేపలు పట్టడం లేదా నీటిలోకి దిగిన సమయంలో శరీరంపై ఉన్న చిన్న గాయం, కోత లేదా పుండ్ల ద్వారా బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుంది. సముద్రపు నీటిలో పట్టిన షెల్‌ఫిష్, ముఖ్యంగా ఆయిస్టర్లు వంటి సముద్ర ఆహారంలోనూ ఈ బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంటుంది. వాటిని పచ్చిగా లేదా సరిగ్గా ఉడికించకుండా తినడం వల్ల ఆహార సంబంధిత ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాగే చేతిపై గాయం ఉన్నప్పుడు పచ్చి చేపలు లేదా సముద్ర ఆహారాన్ని శుభ్రం చేయడం, పట్టుకోవడం ద్వారా కూడా బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుంది. వాతావరణ మార్పులు, సముద్రపు నీటి ఉష్ణోగ్రతలు పెరగడం కూడా ఈ బ్యాక్టీరియా వ్యాప్తికి అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. గతంలో కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన విబ్రియో వల్నిఫికస్ ఇప్పుడు అమెరికా తూర్పు తీరంలోని మరిన్ని ఉత్తర ప్రాంతాల్లోనూ కనిపిస్తోంది. తూర్పు అమెరికాలో 1988 నుంచి 2018 మధ్య ఈ బ్యాక్టీరియాతో ఏర్పడే గాయాల ఇన్ఫెక్షన్లు ఎనిమిది రెట్లు పెరిగినట్లు ఒక అధ్యయనం వెల్లడించింది. వాతావరణ మార్పుల కారణంగా ఉత్తర యూరప్, బాల్టిక్ సముద్ర ప్రాంతాల్లోని తీర జలాలు కూడా వేడెక్కుతున్నాయి. దీంతో అక్కడ కూడా విబ్రియో బ్యాక్టీరియా వ్యాప్తికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

## కవిరితో గోరింటాకు ఎరుపు!



అరచేత పెట్టుకున్న గోరింటాకు ఎర్రగా పండాలని కోరుకోని వారుంటారా? నిజానికి ఆకు పెరిగే నేల, సారాన్ని బట్టి దాని రంగు వస్తుంది. అయితే, రుబ్బే ఆకులో కాస్తంత కవిరి ముక్క కూడా వేసి చూడండి. ఎర్రగా పండుతుంది. కవిరికి కథ్థా, కాటేచు, ఖదిర, కాచు... ఇలా చాలా పేర్లే ఉన్నాయి. ఇది ఓ సహజ ఆయుర్వేద మూలిక. అకాసియా కాటెచు దీని శాస్త్రీయ నామం. చెట్టు బెరడు నుంచి చిన్న చిన్న ముక్కలుగా చేసి గంటల తరబడి మట్టి కుండల్లో వేసి ఉడకబెడతారు. ఆ కషాయాన్ని వడకట్టి చిక్కటి గుజ్జులా మారుస్తారు. ఈ మిశ్రమాన్ని చల్లార్చి నిల్వ ఉంచితే గడ్డకడుతుంది. దాన్నే బిళ్లలుగా, ముక్కలుగా కోసి అమ్ముతారు. దీన్ని గోరింటాకుతోపాటు తాంబూలంలో వక్క, సున్నంతో కలిపి వాడతారు. ఇంతకీ రంగు ఎలా వస్తుందనే కదా మీ సందేహం... కవిరిలో సహజంగా లభించే టానిన్లు గోరింటాకులో ఉండే లాసోన్ అనే వర్ణ పదార్థంతో కలిసి పనిచేస్తాయి.

దీని వల్ల మెహందీ ముదురు ఎరుపు రంగులోకి మారుతుంది. అంతేకాదు.... మామూలుగా గోరింటాకు కొన్ని రోజుల్లోనే వెలిసిపోతుంది. కవిరి కలిపితే మాత్రం... ఎక్కువ రోజులు ప్రకాశవంతంగా కనిపిస్తుంది. అంతేకాదు, ఆయుర్వేదం ప్రకారం– దీనికి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీసెప్టిక్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. గోరింటాకుతో కలిపి పెట్టుకోవడం వల్ల చేతులపై ఉండే బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. గోళ్లకు రక్షణగానూ ఉంటాయి. కవిరి ఒంట్లో వేడినీ తగ్గించగలదట. దీన్ని రుబ్బిన వెంటనే కాకుండా ఓ గంట పక్కనపెట్టి ఆ తర్వాత పెట్టుకుంటే మంచి ఫలితం వస్తుంది. అయితే, ఎంత ఆయుర్వేదం అయినప్పటికీ దేన్నీ అతిగా వాడకూడదన్న సూత్రాన్ని మర్చిపోవద్దు.

## వాటిని తొలగించుకోవాలంటే..!



అవాంఛిత రోమాలు మహిళల అందాన్ని దెబ్బ తీస్తుంటాయి. ముఖ్యంగా పైపెదవి, గడ్డం, కొంతమందికి బుగ్గల పైనా ఇవి పెరుగుతుంటాయి. ఫలితంగా ఎదురయ్యే అసౌకర్యాన్ని దూరం చేసుకోవడానికి చాలామంది వ్యాక్సింగ్ పద్ధతిని ఆశ్రయిస్తుంటారు. అయితే సహజసిద్ధమైన పద్ధతులను పాటించి కూడా ముఖంపై అవాంఛిత రోమాల్ని తొలగించుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున చక్కెర, నిమ్మరసానికి.. పది టేబుల్‌స్పూన్ల నీళ్లు చేర్చి కలుపుకోవాలి. ఇది కాస్త చిక్కపడే దాకా మరిగించుకొని చల్లార్చుకోవాలి. ఈ మిశ్రమాన్ని హెయిర్ గ్రోత్ దిశలో అప్లై చేసి, వ్యతిరేక దిశలో తొలగించుకోవాలి. రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున చక్కెర, నిమ్మరసం తీసుకొని.. దానికి టేబుల్‌స్పూన్ తేనె కలుపుకోవాలి. దీన్ని ఐదు నిమిషాల పాటు వేడి చేస్తే చిక్కబడుతుంది. ముందు వెంట్రుకలు ఉన్న చోట కార్న్‌స్టార్చ్ అప్లై చేసుకొని.. చల్లారిన చక్కెర మిశ్రమాన్ని వెంట్రుకలు మొలిచే దిశలో అప్లై చేసుకోవాలి. ఆ తర్వాత ఒక కాటన్ క్లాత్ సహాయంతో వ్యతిరేక దిశలో తొలగించుకోవాలి. టేబుల్‌స్పూన్ చొప్పున తేనె, నిమ్మరసం తీసుకొని.. దానికి ఐదు టేబుల్‌స్పూన్ల బంగాళాదుంప రసం కలుపుకోవాలి. మరోవైపు రాత్రంతా నానబెట్టిన శెనగపప్పును పేస్ట్ చేసుకోవాలి. వీటన్నింటినీ కలుపుకొని సమస్య ఉన్న చోట అప్లై చేసుకోవాలి. ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. అయితే ఈ చిట్కా ఈ చిట్కా అవాంఛిత రోమాలను తొలగించే ప్రక్రియలో వాటిని బలహీనపరచడానికి ఉపయోగపడుతుందట. అయితే ఈ చిట్కాల వల్ల ఆశించిన ఫలితం లేకపోయినా, వీటిని పాటించేంత ఓపిక, సమయం లేవనుకున్నా; ఇతర దుష్ప్రభావాలేమైనా ఎదురైనా.. చర్మ సంబంధిత నిపుణుల్ని సంప్రదించి ఆరోగ్యకరమైన పద్ధతుల్లో తగిన చికిత్స తీసుకోవడం మంచిది.

## వానల వేళ... అందం జాగ్రత్త!

వాన చినుకులు పడటం ఆలస్యం... అప్పటి దాకా వేడి కారణంగా కలిగిన చిరాకంతా పోతుంది. అందుకే చూస్తూ, హాయిగా వాటిలో తడుస్తూ ఆనందిస్తాం. కానీ జాగ్రత్త! ఎండలే కాదు... వర్షాల వేళా చర్మం, కురులకు కలిగే హాని తక్కువేం కాదు. ఈకాలం వాతావరణంలోని తేమ జిడ్డుని పెంచుతుంది. అంతేనా, చర్మరంధ్రాలు మూసుకుపోయి యాక్నే రావడానికి కారణమవుతుంది. కాబట్టి, స్కిన్ కేర్ తప్పనిసరి. రెండు పూటలా ముఖాన్ని తప్పక శుభ్రం చేసుకోవాలి. అయితే మీ చర్మానికి తగ్గ జెంటిల్ క్లెన్సర్‌ని వాడాలి. వాతావరణం తేమగా ఉంది కదా... మాయిశ్చరైజర్ అవసరం లేదు అనుకోవద్దు. తేలికపాటి, నాన్ కమడోజెనిక్ క్రీములు రాయాలి. చల్లగా ఉన్నా యూవీ కిరణాల ప్రభావం ఉంటుంది. అందుకని కనీసం 30 ఎస్‌పీఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్‌ని రొటీన్‌లో భాగం చేసుకోవాలి. మృతకణాలు చర్మరంధ్రాల్ని మూసుకుపోయేలా చేస్తాయి. కాబట్టి, వారానికోసారి స్క్రబ్ చేయడం తప్పనిసరి చేసుకోండి. వానలో తడిస్తే వీలైనంత త్వరగా దుస్తులు మార్చుకోవడం, తడిలేకుండా చూసుకోవాలి. లేదంటే ఇన్‌ఫెక్షన్ల బారిన పడే ప్రమాదముంది. చల్లదనానికి బద్ధకంగా అనిపిస్తుంది కానీ... తలస్నానాన్ని అశ్రద్ధ చేయొద్దు. వారానికి కనీసం రెండుసార్లు మైల్డ్ షాంపూతో తప్పక చేయాలి. కండిషనర్ కూడా వాడితే మేలు. తడిగా ఉన్నప్పుడు బిగుతుగా జడ వేయొద్దు. పూర్తిగా ఆరాకే వేసుకోవాలి. లేదంటే చుండ్రు, ఇన్‌ఫెక్షన్లకు దారితీసి కురులు రాలే ప్రమాదముంది. తలస్నానానికి కనీసం అరగంట ముందైనా గోరువెచ్చని కొబ్బరి లేదా బాదం నూనెతో తలకి మసాజ్ చేస్తే మేలు. అయితే ఈ కాలం రాత్రంతా నూనె మాత్రం పెట్టి ఉంచకూడదు.



తడి తలతో పడుకోవద్దు. తువాలు, దువ్వెనలను పంచుకోవద్దు... ఇన్‌ఫెక్షన్లకు దారి తీయొచ్చు. అలాగే, ఈ కాలం విటమిన్ సి ఎక్కువగా ఉండే నారింజ, జామ, కివీ వంటి పండ్లను తీసుకోవాలి. నీళ్లూ తగినంతగా తాగాలి. ఇవి ఆరోగ్యానికే కాదు... చర్మానికీ మేలు చేస్తాయి. గుడ్డు, చేప, పప్పుదినుసులు, నట్స్, సీడ్స్ వంటివీ చేర్చుకోండి. వీటిల్లోని ప్రొటీన్, ఐరన్, బయోటిన్, జింక్ కురులకు మేలు చేస్తాయి.

## భారత మార్కెట్‌లో విచ్చలవిడిగా నకిలీ జీఎల్‌పీ-1 మందులు..

ఊబకాయం ఒక దీర్ఘకాలిక వ్యాధి. ఈ విషయాన్ని వైద్య రంగం గుర్తించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా చికిత్సా విధానాలు, ప్రభుత్వ విధానాలు, పెట్టుబడుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఈ మార్పుకు ప్రధాన కారణంగా జీఎల్‌పీ–1 మందులు నిలుస్తున్నాయి. బరువు నియంత్రణ, మధుమేహ నియంత్రణతో పాటు గుండె సంబంధిత ప్రమాదాలను తగ్గించడంలో ఇవి వైద్యపరంగా గణనీయమైన ఫలితాలను అందిస్తున్నాయి. జీఎల్‌పీ–1 మందులకు డిమాండ్ వేగంగా పెరుగుతున్న సమయంలో, వాటికి సంబంధించిన పేటెంట్ల గడువు కూడా ముగుస్తోంది. దీంతో ఈ రంగంలో తదుపరి దశ రోగుల నమ్మకాన్ని ఎలా కాపాడుకోవాలనే అంశంపై ఆధారపడనుంది. ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికి పైగా ప్రజలు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి తీవ్రత కారణంగా ఆరోగ్య వ్యవస్థలు ఊబకాయాన్ని ఒక కీలక వైద్య సమస్యగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జీఎల్‌పీ–1 చికిత్సలు కీలకంగా మారాయి. ఇవి కేవలం బరువు తగ్గడం, టైప్–2 మధుమేహం నియంత్రణకే పరిమితం కాకుండా గుండె సంబంధిత ప్రమాదాలను తగ్గించడంలో కూడా ఉపయోగపడుతున్నాయి. దీంతో పరస్పరం సంబంధం ఉన్న అనేక ఆరోగ్య సమస్యలను ఒకే చికిత్సా వర్గం ద్వారా లక్ష్యంగా చేసుకునే అవకాశం వైద్యులకు లభించింది. ప్రభుత్వాలు, ఆరోగ్య వ్యవస్థలు కూడా ఈ మార్పును గుర్తించాయి. అమెరికాలో ఆహారం, ఔషధాల పరిపాలనా సంస్థ ఆమోదించిన ఊబకాయం చికిత్సా జీఎల్‌పీ–1 మందులకు మెడికెయిడ్ ప్రిస్క్రిప్షన్లు 2019 నుంచి 2024 మధ్య ఏకంగా 546 శాతం పెరిగాయి. ఈ పెరుగుదల జీఎల్‌పీ–1 మందులు ఎంత వేగంగా ప్రధాన చికిత్సా విధానంగా మారుతున్నాయో చూపిస్తోంది. మార్కెట్ విశ్లేషకుల అంచనాల ప్రకారం 2035 నాటికి ప్రపంచ జీఎల్‌పీ–1 మార్కెట్ 190 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటే అవకాశం ఉంది. ఈ గణాంకాలు ఔషధ తయారీ సంస్థలు, పెట్టుబడిదారులు, నియంత్రణ సంస్థల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫలితంగా ఈ మార్కెట్లో వేగవంతమైన నిర్మాణాత్మక మార్పులకు పరిస్థితులు సిద్ధమవుతున్నాయి. ఐక్యూవీఐఏ అంచనా ప్రకారం 2026 కీలక సంవత్సరంగా మారనుంది. భారత్ వంటి మార్కెట్లలో సెమాగ్లూటైడ్ పేటెంట్ల గడువు ముగియడం ప్రారంభం అయింది. పేటెంట్ల గడువు ముగిసిన తర్వాత జనరిక్, తదుపరి తరం ఔషధ తయారీ సంస్థలు మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. తయారీ రంగంలో పోటీ పెరగడం వల్ల ధరలు తగ్గి, ప్రస్తుతం అధిక ధరల కారణంగా ఈ మందులకు దూరంగా ఉన్న ప్రజలకు ఇవి మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటికే పలు సంస్థలు జనరిక్ మందులను విక్రయిస్తుండగా, రానున్న రోజుల్లో మరిన్ని ఔషధాలు అందుబాటులోకి రానున్నాయి.

బ్రెజిల్ ఇప్పటికే ఈ మార్పు ఎలా ఉంటుందో చూపించింది. అక్కడ పేటెంట్ గడువు ముగిసిన తర్వాత ఐదు కొత్త ఇంజెక్టబుల్ సెమాగ్లూటైడ్ ఉత్పత్తులకు అనుమతులు లభించాయి. ప్రత్యేక హక్కుల అడ్డంకులు తొలగినప్పుడు మార్కెట్లు ఎంత వేగంగా విస్తరించగలవో ఈ పరిణామం వెల్లడించింది. భారత్ కూడా ఇలాంటి కీలక మలుపు వద్ద నిలిచింది. తయారీ, ఔషధ సూత్రీకరణలో నమ్మకమైన ఆవిష్కరణ కేంద్రంగా ఎదగడానికి దేశానికి ఇది మంచి అవకాశం. భారత్‌లో ఇప్పటికే ఉన్న ఔషధ తయారీ మౌలిక వసతులు పెద్ద స్థాయిలో ఉత్పత్తిని పెంచేందుకు అనుకూలంగా ఉన్నాయి. అయితే అదే సమయంలో రోగులు, నియంత్రణ సంస్థలు కోరే నాణ్యత ప్రమాణాలను కూడా తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.




## ఐరన్ లోపంతో థైరాయిడ్‌పై ప్రభావమా? ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు



శరీరంలో థైరాయిడ్ ఆరోగ్యం, ఐరన్ స్థాయిలు అనేక రోజువారీ శారీరక విధులతో సన్నిహితంగా సంబంధం కలిగి ఉంటాయి. వీటిలో ఏదైనా అసమతుల్యంగా ఉన్నప్పుడు అలసట, జుట్టు రాలడం, చలి ఎక్కువగా అనిపించడం, నిద్ర సరిగా లేకపోవడం, మెదడు మందగించినట్లుగా అనిపించడం లేదా బరువులో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాల్లో కొన్ని ఒకదానితో ఒకటి పోలి ఉండటం వల్ల ఒక్క పరీక్ష ఫలితాన్ని మాత్రమే చూసి అసలు సమస్యను గుర్తించకుండా ఉండే అవకాశం ఉంటుంది. పోషకాహార నిపుణులు తెలిపిన ప్రకారం.. థైరాయిడ్ పరీక్షల్లో వచ్చే సంఖ్యలను మాత్రమే పరిశీలించడం కంటే, పూర్తి ఐరన్ ప్యానెల్‌తోపాటు థైరాయిడ్ సూచికలను పరిశీలించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. థైరాయిడ్ హార్మోన్ల తయారీలో కీలకమైన ఓ ఎంజైమ్‌కు ఐరన్ అవసరమని వివరించారు. అందువల్ల శరీరంలో ఐరన్ నిల్వలు తగ్గినప్పుడు థైరాయిడ్ పనితీరుపైనా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా శరీరంలో నిల్వగా ఉన్న ఐరన్‌కు సూచికగా ఉండే ఫెరిటిన్ స్థాయిని ప్రస్తావించారు. ఫెరిటిన్ తగ్గినప్పుడు టీఎస్‌హెచ్ పెరుగుతుంది. థైరాయిడ్ పనితీరుకు జీర్ణాశయంలోని ఆమ్లం, ఐరన్ శోషణతోనూ సంబంధం ఉంటుంది. అలాగే ఐరన్ స్థాయిలు తక్కువగా ఉండటం వల్ల అధికంగా రుతుస్రావం జరిగే అవకాశం ఉంటుంది. దాంతో శరీరం నుంచి మరింత ఐరన్ కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఫెరిటిన్ స్థాయిలు తగ్గడం, థైరాయిడ్ పనితీరు మందగించడం, టీఎస్‌హెచ్ పెరగడం, కడుపులో ఆమ్లం తగ్గడం, అధికంగా రుతుస్రావం కావడం, తద్వారా ఫెరిటిన్ మరింత తగ్గడం వంటి పరిణామాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. ఒక్క రక్త పరీక్షలోని ఒక సంఖ్యను మాత్రమే పరిశీలించడం ద్వారా పూర్తి ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకోవడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. ఫెరిటిన్‌కు 70 నుంచి 100 నానోగ్రాములు ప్రతి మిల్లీలీటర్‌కు, సీరమ్ ఐరన్‌కు 85 నుంచి 130 మైక్రోగ్రాములు ప్రతి డెసీలీటర్‌కు, టీఎస్‌హెచ్‌కు 0.8 నుంచి 2.3 మిల్లీ ఇంటర్నేషనల్ యూనిట్లు ప్రతి లీటర్‌కు, యాంటీ–టీపీఓకు 0 నుంచి 6.8 ఇంటర్నేషనల్ యూనిట్లు ప్రతి మిల్లీలీటర్‌కు, యాంటీ–టీజీకి 0 నుంచి 1 ఇంటర్నేషనల్ యూనిట్ ప్రతి మిల్లీలీటర్‌కు మార్గదర్శక స్థాయిలుగా సూచిస్తారు. అయితే ఇవి మార్గదర్శకంగా ఉపయోగించే స్థాయిలే తప్ప, అందరికీ వర్తించే సార్వత్రిక వైద్య లక్ష్య స్థాయిలు కావు. వివిధ ప్రయోగశాలల్లో సూచించే సాధారణ స్థాయిలు మారుతాయి. అలాగే థైరాయిడ్, ఐరన్ పరీక్షల ఫలితాలను లక్షణాలు, వైద్య చరిత్ర, ఇతర పరీక్షల ఫలితాలతో కలిపి వైద్య నిపుణులు అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి ఏదైనా పరీక్షలో స్థాయి తక్కువగా లేదా ఎక్కువగా ఉందని మాత్రమే ఆధారంగా చేసుకుని స్వయంగా చికిత్స ప్రారంభించడం కాకుండా వైద్య నిపుణుల సలహా తీసుకోవడం ముఖ్యం.

## మళ్లీ LCD డిస్‌ప్లేల వైపు స్మార్ట్‌ఫోన్ కంపెనీలు..



స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ప్రస్తుతం ఖర్చులు తగ్గించుకునే పనిలో పడ్డాయి. మెమొరీ చిప్‌ల ధరల పెరుగుదలతో స్మార్ట్‌ఫోన్ తయారీ వ్యయాన్ని భర్తీ చేసేందుకు డిస్‌ప్లే ఖర్చును తగ్గించుకుంటున్నాయి. ఒకప్పుడు రూ.20వేల ధరలో అమోలెడ్ స్క్రీన్లతో ఫోన్లు లాంచ్ చేసిన కంపెనీలు.. ఇప్పుడు రూ.30వేల బడ్జెట్ కలిగిన స్మార్ట్‌ఫోన్‌లోనూ ఎల్‌సీడీ డిస్‌ప్లేతో సరిపెట్టేస్తున్నాయి. ఇటీవల కాలంలో లాంచ్ అయిన ఫోన్లే అందుకు ఉదాహరణ. OLED డిస్‌ప్లే: ఓఎల్ఈడీ అంటే ఆర్గానిక్ లైట్ ఎమిటింగ్ డయోడ్. ఇందులో ప్రతి పిక్సెల్ సొంతంగా లైటింగ్‌ను ఉత్పత్తి చేస్తుంది. అంటే ప్రతి చిన్న డాట్‌కు సొంత లైటింగ్‌ను, రంగును ఇస్తుంది. దీనికి ప్రత్యేకంగా ఎలాంటి బ్యాక్‌లైట్ ఉండదు. నలుపు రంగులను చూపించాల్సి వచ్చినప్పుడు ఆ పిక్సెల్స్ పూర్తిగా ఆఫ్ అయిపోతుంది.




# ప్రపంచంలో అత్యంత ఆదరణ పొందిన కంపెనీ యాపిల్

ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ మరో ఘనత సాధించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన కంపెనీగా నిలిచింది. మైక్రోసాఫ్ట్, అమెజాన్ కంపెనీలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ మేరకు ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ కార్న్ ఫెర్రీ, ఫార్చ్యూన్.కామ్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 1500 కంపెనీలపై సర్వే నిర్వహించి ఈ ర్యాకింగ్‌లు ఇచ్చారు. ఆదాయం




ఎక్కువ ఉన్న కంపెనీలను వడబోసి జాబితా రూపొందించారు. 3 వేల మందికి పైగా ఎగ్జిక్యూటివ్‌లు, డైరెక్టర్లు, సెక్యూరిటీస్ విశ్లేషకుల ఆధారంగా టాప్-50 ర్యాంకులను నిర్ణయించారు. ఆవిష్కరణలు, నిర్వహణ, సామాజిక బాధ్యత, కంపెనీ ఆస్తులు వంటి పలు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి యాపిల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఏఐ రంగంలో నాయకత్వం, ఓపెన్‌ఏఐ భాగస్వామ్యం, కోపైలట్ బ్రాండెడ్ ఏఐ అప్లికేషన్స్ ఆధారంగా మైక్రోసాఫ్ట్ రెండో స్థానంలో నిలిచింది. అమెజాన్-3, ఎన్విడియా-4, జేపీమోర్గాన్ చేజ్-5, బెర్క్‌షైర్ హాత్వే-6, కాస్ట్‌కో హోల్‌సేల్-7, ఆల్ఫాబెట్-8, వాల్‌మార్ట్-9, అమెరికన్ ఎక్స్‌ప్రెస్-10వ స్థానాలను ఆక్రమించాయి.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 'టగ్ ఆఫ్ వార్'ను ఎదుర్కొంటోంది: క్రిస్టిలినా జార్జివా



పశ్చిమాసియా నుంచి వచ్చే ప్రతికూలతలు, ఏఐ రంగానికి లభిస్తోన్న సానుకూల డిమాండ్‌కు మధ్య ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 'టగ్ ఆఫ్ వార్' లాంటి పరిస్థితిని ఎదుర్కొంటోందని ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్(IMF) ఎండీ క్రిస్టిలినా జార్జివా తెలిపారు. పశ్చిమాసియాలోని పరిణామాలతో చమురు సరఫరాకు ఎదురైన ఇబ్బందులను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే మెరుగ్గానే ఎదుర్కొందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే సమయంలో కృత్రిమ మేధ (AI) రంగంలో పెరుగుతోన్న పెట్టుబడులు ప్రపంచ వృద్ధికి ఊతమిస్తున్నాయని చెప్పారు. హర్మూజ్ జలసంధి మూసివేతతో ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని.. గల్ఫ్ ప్రాంతాల నుంచి సరఫరా పెరగడం వంటి అంశాలు కొంతమేర తగ్గించాయని వివరించారు.అమెరికాలో మొదలైన ఏఐ పెట్టుబడుల జోరు ఇప్పుడు ఇతర దేశాలకూ విస్తరిస్తోందని ఆమె చెప్పారు. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం ఎక్కువై.. కేంద్ర బ్యాంకులు కఠిన విధానాలను కొనసాగించవచ్చని వివరించారు. దీంతో రుణభారం, ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం పడుతుందన్నారు. తక్కువ ఆదాయం కలిగిన దేశాలు ఇంధన దిగుమతులపై ఆధారపడటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారొచ్చని జార్జివా తెలిపారు.

# దేశీయంగా హెచ్‌ఐవీ నివారణ ఇంజెక్షన్ తయారీ



హెచ్‌ఐవీ సంక్రమణను అడ్డుకునే ఇంజెక్షన్ లెనాకాపవిర్ త్వరలోనే భారత మార్కెట్లోకి వచ్చేందుకు మార్గం సుగమమైంది. హెచ్‌ఐవీ ముప్పు ఎక్కువగా ఉన్న, కనీసం 35 కిలోల బరువు ఉండే పెద్దలు, యుక్తవయస్కుల్లో లైంగిక సంపర్కం ద్వారా వచ్చే హెచ్‌ఐవీ-1 వ్యాప్తిని అడ్డుకునేందుకు ఈ నివారణ మందును ఏడాదికి 2 సార్లు ఇవ్వాలని సిఫారసు చేస్తున్నారు. ఈ సూదిమందును దేశీయంగా ఉత్పత్తి చేయడానికి, విక్రయించేందుకు వీలుగా డాక్టర్ రెడ్డీస్, ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్‌కు మూడో దశ క్లినికల్ పరీక్షలు, బయోఈక్వివలెన్స్ అధ్యయనాల నుంచి మినహాయింపు ఇవ్వాలని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ)కు చెందిన సబ్జెక్టు నిపుణుల కమిటీ (ఎస్ఈసీ) నిర్ణయం తీసుకుంది. ఈ నెలలో జరిగిన సమావేశంలో కమిటీ ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. మార్కెట్లోకి వచ్చిన తర్వాత నిర్వహించే ఫేజ్-4 క్లినికల్ పరీక్షల ద్వారా ప్రభావశీలత వివరాలను సేకరించి, సమర్పించాలని ఈ కంపెనీలను ఆదేశించింది. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఈ ఇంజెక్షన్‌ను 463.5 మిల్లీగ్రాములు/1.5మిల్లీలీటర్ల మోతాదు సామర్థ్యంతో దేశంలో తయారు చేసి, విక్రయించేందుకు అనుమతి కోరుతూ ప్రతిపాదనలు సమర్పించింది. దేశీయంగా క్లినికల్-3 ట్రయల్స్, అధ్యయనాల నుంచి మినహాయింపు ఇవ్వడానికి గల కారణాలను వివరించింది. ఎంక్యూర్ కూడా ఇదే రకమైన ప్రతిపాదనలను సమర్పించింది. మార్కెటింగ్ అనుమతులు లభించిన మూడు నెలల వ్యవధిలో, ఈ రెండు కంపెనీలు ఫేజ్-4 అధ్యయన ప్రణాళికలను సీడీఎస్‌సీఓకు సమర్పించాలి. అమెరికాలో గిలియడ్ సైన్సెస్ విక్రయించే బ్రాండెడ్ ఔషధానికి ఏడాదికి ఒక వ్యక్తి దాదాపు 28,000 డాలర్లు (సుమారు రూ.26.60 లక్షలు) వెచ్చించాలి. భారతీయ జెనరిక్ కంపెనీలు ఏడాదికి ఒక వ్యక్తికి కేవలం 40 డాలర్ల (సమారు రూ.3,800) ధరకే అందించే వీలుంది. భారత్‌లో దీని తుది ధర ఎంతనేది ఆయా కంపెనీల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

# నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ.. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం సూచీలను పడేసింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సూచీలు నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 183.15 పాయింట్లు కోల్పోయి 77,472.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 126.80 పాయింట్లు పతనమై 24,207.75 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30లో ప్రధానంగా ఇన్ఫోసిస్, భారతీఎయిర్‌టెల్, ఎల్అండ్‌టీ, పవర్‌గ్రిడ్, టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీ షేర్లు నష్టాలను చవిచూశాయి. కోటక్‌బ్యాంక్, అల్ట్రాటెక్‌సిమెంట్, యాక్సిస్‌బ్యాంక్, టాటాస్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ షేర్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 85.88 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,618.87 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# త్వరలో దేశీయ మార్కెట్‌లోకి ఫిలిప్స్ స్మార్ట్‌ఫోన్స్

ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫిలిప్స్ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లోకి అడుగుపెడుతోంది. ఇప్పటి వరకూ ఫీచర్ ఫోన్లకే పరిమితమైన ఈ కంపెనీ.. త్వరలోనే కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేయనుంది. S7221 పేరిట తీసుకురాబోతుంది. ఇందుకు సంబంధించి ఫోన్ డిజైన్‌ను ఇప్పటికే అమెజాన్ మైక్రోసైట్‌లో కంపెనీ విడుదల చేసింది. ఫోన్ ధరలను, లాంచ్ తేదీని కంపెనీ పేర్కోనప్పటికీ.. కొన్ని ఫీచర్లను మాత్రం వెల్లడించింది. మైక్రోసైట్‌లోని వివరాల ప్రకారం.. 6జీబీ, 8జీబీ ర్యామ్, 128జీబీ, 256 జీబీ స్టోరేజ్ సదుపాయంతో ఈ ఫోన్ రానుంది. 5జీకి సపోర్ట్ చేస్తుంది. డ్యూయల్ స్టీరియో స్పీకర్స్ అల్ట్రా మాక్స్ ఆడియో ఫీచర్లు ఉన్నాయి. ఫోన్ వెనుక వైపు 64ఎంపీ ఏఐ ప్రధాన కెమెరా, ముందు వైపు 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంటుంది. ఐపీ 64 రేటింగ్‌తో రానున్న ఈ ఫోన్ వెనుక భాగంలో LED ఫ్లాష్‌లైట్ ఉంది. బ్లాక్, సిల్వర్, వైట్ రంగుల్లో లభ్యం కానుంది. అమెజాన్ ద్వారా ఈ స్మార్ట్‌ఫోన్ విక్రయించనున్నారు.







## ఫైనల్లో ప్రజ్ఞానంద



సెయింట్ లూయిస్ (అమెరికా): గ్రాండ్ చెస్ టూర్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో విన్సెంట్ కీమర్ (జర్మనీ)పై అతడు 19-9తో విజయం సాధించాడు. మంగళవారం రెండు ర్యాపిడ్ గేమ్‌లలో కీమర్‌ను ఓడించి తిరుగులేని ఆధిక్యంలో నిలిచిన భారత కుర్రాడు.. బ్లిట్జ్‌లో ఒక గేమ్ గెలిచి 17-3తో ఫైనల్ బెర్తు ఖరారు చేసుకున్నాడు. ఫలితం అప్పటికే తేలినా.. నిబంధనల ప్రకారం తర్వాత ఆడిన మూడు గేమ్‌లలో కీమర్ నెగ్గి.. ప్రజ్ఞానంద ఆధిక్యాన్ని కాస్త తగ్గించాడు. ఫైనల్ చేరాలంటే కనీసం 15 పాయింట్లు సాధించాలి. తుది పోరులో ఫాబియానో కరువానా (అమెరికా)తో ప్రజ్ఞానంద తలపడనున్నాడు. మరో సెమీస్‌లో కరువానా 18-9తో వెస్లీ సో (అమెరికా)ను ఓడించాడు. మూడో స్థానం కోసం కీమర్‌తో వెస్లీ తలపడనున్నాడు. ఈ టోర్నీలో టాప్-3 స్థానాల్లో నిలిచే ప్లేయర్లు వచ్చే ఏడాది గ్రాండ్ చెస్ టూర్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తారు.

# నాలుగో రోజు ముగిసిన ఆట



భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టు టెస్టులో నాలుగో రోజు ఆట ముగిసింది. శ్రీలంక ఫాలోఆన్ ఆడుతుండగా.. 72.4 ఓవర్ల ఆట పూర్తయిన తర్వాత వర్షం మొదలైంది. దీంతో ఆటను నిలిపివేశారు. వర్షం తగ్గే సూచనలు కనిపించకపోవడంతో నాలుగో రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 229/6. కేశర నువాంతు (3), సోనల్ దినూష (7) క్రీజులో ఉన్నారు. శ్రీలంక ప్రస్తుతం 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం ఫస్ట్ ఇన్నింగ్స్‌లో లంక 290 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో భారత్ విజయావకాశాలు వాతావరణంపై ఆధారపడి ఉన్నాయి. గురువారం వరుణుడు కరుణించి ఆటకు అంతరాయం కలిగించకపోతే టీమ్‌ఇండియా విజయం సాధించడం ఖాయమే.

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు నాలుగో రోజు ఆటలో చివరి సెషన్‌లో భారత బౌలర్లు విజృంభిస్తున్నారు. సారాంశ్ జైన్ వేసిన 64.2 ఓవర్‌కు నిరోషన్ డిక్వెల్లా (6) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దీంతో టీ బ్రేక్ తర్వాత శ్రీలంక మూడో వికెట్ కోల్పోయింది. ప్రస్తుతం లంక స్కోరు 218/6. సోనల్ దినూష(2), కేశర నువాంతు (0) క్రీజులో ఉన్నారు. ఆ జట్టు ఐదు పరుగుల ఆధిక్యంలో ఉంది. పసిందు సూర్యబండార (92; 173 బంతుల్లో) సెంచరీ ముంగిట ఔటయ్యాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో (60.3 ఓవర్) స్టంపౌట్ అయ్యాడు. దీంతో లంక ఐదో వికెట్ కోల్పోయింది. తర్వాత క్రీజులోకి వచ్చిన నిరోషన్ డిక్వెల్లా (5) ఫోర్ బాదడంతో లంక ఆధిక్యంలోకి వచ్చింది. 61 ఓవర్లు ముగిసేసరికి ఆ జట్టు స్కోరు 217/5. ప్రస్తుతం శ్రీలంక నాలుగు పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఫాలో ఆన్ ఆడుతున్న శ్రీలంక 209 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది. ధనంజయ డిసిల్వా (23) ఔటయ్యాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో పడిక్కల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 59 ఓవర్లకు లంక స్కోరు 212/4. పసిందు సూర్యబండార (91) సెంచరీకి చేరువలో ఉన్నాడు. సోనల్ దినూష (1) క్రీజులో ఉన్నారు. శ్రీలంక ఇంకా మూడు పరుగుల వెనుకంజలో ఉంది.

శ్రీలంక, భారత్ మధ్య రెండో టెస్టులో నాలుగో రోజు ఆట కొనసాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు ఆలౌటై ఫాలో ఆన్ ఆడుతున్న శ్రీలంక.. టీ విరామ సమయానికి 199/3 స్కోరుతో నిలిచింది. రెండో సెషన్‌లో శ్రీలంక 34 ఓవర్లలో 116 పరుగులు చేసి ఒక వికెట్ కోల్పోయింది. ఆ జట్టు ఇంకా 14 పరుగుల వెనుకజంలో ఉంది. ధనంజయ డిసిల్వా (14), పసిందు సూర్యబండార (90) క్రీజులో ఉన్నారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసింది.

దాదాపు 28 ఓవర్ల తర్వాత భారత్‌కు వికెట్ లభించింది. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన (43.1వ ఓవర్) బంతిని కమిందు మెండిస్ (55) భారీ షాట్ కొట్టేందుకు యత్నించాడు. అయితే, స్క్వేర్ లెగ్ వైపు పరుగెత్తి మరీ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుతంగా క్యాచ్‌ను ఒడిసిపట్టాడు. దీంతో 178 పరుగుల వద్ద శ్రీలంక మూడో వికెట్‌ను కోల్పోయింది. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 179/3. క్రీజ్‌లో ధనంజయ డిసిల్వా (1★), పసిందు (83★) ఉన్నారు. ఇంకా శ్రీలంక 34 పరుగులు వెనుకబడి ఉంది.

ఫాలో ఆన్‌లో శ్రీలంక దూకుడుగా బ్యాటింగ్ చేస్తోంది. పసిందు సూరియబండారా (69★)తోపాటు కమిందు మెండిస్ (54★) కూడా హాఫ్ సెంచరీ సాధించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు శతక భాగస్వామ్యం నిర్మించారు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 41 ఓవర్లకు 163/2. ఇంకా 50 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది. మూడో వికెట్ తీసేందుకు భారత బౌలర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

శ్రీలంక బ్యాటర్లు క్రీజ్‌లో పాతుకుపోయారు. పిచ్ నుంచి బౌలింగ్‌కు సహకారం పెద్దగా లభించడం లేదు. భారత్ దాదాపు 22 ఓవర్ల నుంచి వికెట్ దక్కలేదు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 37 ఓవర్లకు 142/2. క్రీజ్‌లో పసిందు (62★), కమిందు మెండిస్ (40★) ఉన్నారు.

# మిచెల్ స్టార్క్ అగ్రస్థానం.. టాప్-10లోకి రిషభ్ పంత్

ఐసీసీ టెస్టు ర్యాంకులు విడుదలయ్యాయి. బౌలింగ్ విభాగంలో ఇప్పటి వరకూ అగ్రస్థానంలో ఉన్న జస్‌ప్రీత్ బుమ్రా రెండో స్థానానికి చేరాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో బుమ్రా ఆడని విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో నిప్పులు చెరిగే బౌలింగ్ వేసిన ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 872 పాయిం ట్లు ఉన్నాయి. బుమ్రా (862), మ్యాట్ హెన్రీ (861) తర్వాత స్థానాల్లో నిలిచారు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ (807) కూడా ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని నాలుగో ర్యాంక్ అందుకొన్నాడు. కేఎల్ రాహుల్, పంత్ పైకి బ్యాటింగ్ విభాగంలో భారత ఆటగాళ్లు రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ (35 నుంచి 30వ స్థానం) తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. అయితే, యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారాడు. టాప్ -10లో టీమ్‌ఇండియా నుంచి ఇద్దరు మాత్రమే చోటు దక్కించుకున్నారు. రిషభ్ పంత్ (711) ఆరు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరాడు. శుభ్‌మన్ గిల్ (711) ఎనిమిదో స్థానానికి పడిపోయాడు. ఈ విభాగంలో ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ (874), జో రూట్ (850), స్టీవ్ స్మిత్ (840), ట్రావిస్ హెడ్ (811), టెంబా బవుమా (775) తొలి ఐదు ర్యాంకుల్లో నిలిచారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా (428)దే అగ్రస్థానం.






## 'టాప్-5 టెస్టు పేసర్లు' వీరే!

భారత్ తరఫున టెస్టుల్లో అద్భుత ప్రదర్శన చేసిన టాప్-5 టెస్టు బౌలర్ల జాబితాను మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పుజారా వెల్లడించాడు. ఇందులో ఒకప్పటి సహచరుడు మహ్మద్ షమీకి అవకాశం దక్కకపోవడం గమనార్హం. మరో స్టార్ పేసర్ వెంకటేశ్ ప్రసాద్‌కూ ఇందులో చోటు దక్కలేదు. పుజారా తన జాబితాలో తొలి స్థానాన్ని దిగ్గజ క్రికెటర్, వరల్డ్ కప్ విన్నర్ కపిల్ దేవ్‌కు ఇచ్చాడు. ఇప్పటికీ భారత్ తరఫున అత్యధిక టెస్టు వికెట్లు తీసిన పేస్ బౌలర్‌గా కపిల్ దేవ్ కొనసాగుతున్నారు. 131 మ్యాచుల్లో 434 వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత జహీర్ ఖాన్, జవగళ్ శ్రీనాథ్, జస్‌ప్రీత్ బుమ్రా, ఇషాంత్ శర్మ ఉంటారని పుజారా తెలిపారు. జహీర్ కెరీర్ చివరి దశలో ఉన్నప్పుడే.. పుజారా (2010-2023) జట్టులోకి వచ్చాడు. ఆ కాస్త సమయం డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం చాలా ఆనందంగా ఉందని పుజారా తెలిపాడు. ఇక బుమ్రా, ఇషాంత్‌తో కలిసి పుజారా ద్వైపాక్షిక సిరీసులు ఆడాడు. భారత వెటరన్ పేసర్ మహ్మద్ షమీకి టాప్-5లో కాకుండా.. టాప్ -10లో స్థానం కల్పించాడు. ఆరో స్థానం ఇచ్చాడు. దాదాపు పదేళ్లపాటు వీరిద్దరూ కలిసి జట్టుకు ఆడారు. తన బౌలింగ్‌తో భారత్‌కు ఎన్నో అద్భుత విజయాలు అందించాడు. ఇక సిరాజ్‌ను కూడా పుజారా తన టాప్-10 జాబితాలో చేర్చాడు. ప్రస్తుతం శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో ప్రధాన పేసర్‌గా సిరాజ్ ఉన్న సంగతి తెలిసిందే. బుమ్రా గైర్హాజరీలో పేస్ విభాగాన్ని నడిపిస్తున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు (48 టెస్టుల్లో 144 వికెట్లు) తీసిన పేసర్‌గానూ అతడే కొనసాగుతున్నాడు.



# స్కూల్‌పై ఆసీస్ మాజీ క్రికెటర్ దావా



విల్ పుకోవిస్కి.. ఆస్ట్రేలియా తరఫున కేవలం ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడి 27 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 36 మ్యాచులు ఆడాడు. ఇంత త్వరగా అతడు ఆటకు గుడ్‌బై చెప్పడానికి కారణం విపరీతంగా గాయాలు కావడమే. అయితే, ఇలా జరగడానికి మాత్రం తాను చదువుకున్న స్కూలేనని ఆరోపిస్తూ తాజాగా దావా వేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. టీనేజర్‌గా విల్ 2014లో మెల్‌బోర్న్‌లోని బ్రైటన్ ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్యసించాడు. ఆ సమయంలో ఫుట్‌బాల్ ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. అప్పుడు అతడి వయసు 16 ఏళ్లు. తలకు గాయం కాగా.. స్కూల్ యాజమాన్యం మాత్రం సరైన వైద్యం అందించలేదని.. అందుకే తన క్రికెట్ కెరీర్‌లో 13సార్లు కంకషన్ ఎదుర్కోవాల్సి వచ్చిందని విల్ ఆరోపించాడు. దీంతో 2024లో క్రీడలకు వీడ్కోలు చెప్పాలని స్వతంత్ర మెడికల్ ప్యానల్ రికమెండ్ చేసినట్లు గుర్తు చేశాడు.


# వుదయం సినిమా

MOVIE TIME!

# 'రాకా'లో రకరకాల వింతలు చూశా..

## అంచనాలు పెంచేసిన మంచు లక్ష్మి

**వుదయం సినిమా:** అల్లు అర్జున్–అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. టైటిల్, బన్నీ లుక్ మినహా ఇప్పటి వరకు సినిమాకు సంబంధించిన పెద్దగా వివరాలు బయటకు రాకపోయినా.. ఇటీవల విడుదలైన పోస్టర్ ఈ మూవీ హాలీవుడ్ స్థాయిలో ఉండ






బోతుందనే ఆసక్తిని పెంచింది. ఇక తాజాగా నటి మంచు లక్ష్మీప్రసన్న చేసిన వ్యాఖ్యలు 'రాకా'పై అంచనాలను మరింత పెంచుతున్నాయి.తాజాగా తాను 'రాకా' మూవీ సెట్ నుంచి వస్తున్నట్లు మంచు లక్ష్మి వెల్లడించింది. అల్లు అర్జున్ తనను ఎప్పటినుంచో సినిమా సెట్ చూసేందుకు పిలుస్తున్నాడని.. తాజాగా ముంబైలోని 'రాకా' సెట్‌కు వెళ్లి వచ్చానని ఆమె తెలిపింది. అక్కడ చూసిన భారీ సెట్, విభిన్నమైన జంతువులను చూసి తాను ఆశ్చర్యపోయానని చెప్పింది.'రాకా సెట్ చూసి నోరు వెళ్ళబెట్టాను. వచ్చి కారులో కూర్చునే దాకా నా నోరు మూతబడలేదు. 'రాకా'లో రకరకాల వింతలు నేను చూశాను. అంతరా నుంచి వింత జంతవులు తీసుకొచ్చారు అనుకుంటా. నేను ఇంతకు ముందెన్నడూ అలాంటి జంతువులను చూడలేదు. బన్నీ లాంటి మనుషులను గానీ, ఎన్నో డిపార్మెంట్స్ తో కూడిన ఇలాంటి సెట్ ని గానీ నేనెప్పుడూ చూడలేదు. మామూలుగా లేదు. పిచ్చెక్కిపోయింది. వావ్ అనిపించేలా ఉంది. నిజంగా అద్భుతంగా ఉంది. నేను ఈ సినిమా కోసం ఆగలేకపోతున్నాను. ఇంకా ఎన్నో విషయాలను షేర్ చేసుకోవాలని ఉంది కానీ, బయటకు చెప్పలేను' అని మంచు లక్ష్మి చెప్పుకొచ్చింది.ఇప్పటికే భారీ బడ్జెట్, హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో తెరకెక్కుతున్న సినిమాగా 'రాకా'పై ఆసక్తి నెలకొంది. తాజాగా మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఇంతకీ అల్లు అర్జున్, అట్లీ కలిసి తెరపై ఎలాంటి అద్భుతాలను చూపించబోతున్నారో తెలియాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే.

# 'కింగ్100' 29న టైటిల్ గ్లింప్స్ రిలీజ్

**వుదయం సినిమా:** కింగ్ నాగార్జున ప్రస్తుతం తన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంలో నటిస్తున్నారు. #King100 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందిస్తున్నారు. రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో ఆయన తెలుగులో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఆగస్టు 29న నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. తమ అభిమాన హీరో 100వ సినిమాకు ఎలాంటి టైటిల్ పెట్టబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.ఈ చిత్రంలో నటి టబు కీలక పాత్రలో నటిస్తున్నారు. 'నిన్నే పెళ్లాడతా', 'ఆవిడ మా ఆవిడే' వంటి చిత్రాల్లో నాగార్జునతో కలిసి నటించిన టబు.. చాలా కాలం తర్వాత మరోసారి ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం సినిమాపై అంచనాలను పెంచుతోంది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్‌తో పాటు సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను కూడా మేకర్స్ వెల్లడించనున్నారు. నాగార్జున పుట్టినరోజుకు మరో మూడు రోజులు మాత్రమే ఉండటంతో #King100 టైటిల్ గ్లింప్స్‌పై ఆసక్తి మరింత పెరుగుతోంది.



# అంచనాలు పెంచేలా సుహాస్, సూరి 'మండాడి' టీజర్



**వుదయం సినిమా:** సుహాస్, సూరి ముఖ్య పాత్రలుగా ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ మీద మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన చిత్రం 'మండాడి'. ఈ మూవీని ఎల్రెడ్ కుమార్ నిర్మించారు. ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు ఇతర కీలక పాత్రలను పోషించారు. ఈ మూవీని సెప్టెంబర్ 10న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి భారీ ఎత్తున విడుదల చేయనుంది.ఈ క్రమంలో తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. 'పందెమే మనల్ని కాపాడుతుంది.. పందెన్నీ మనం కాపాడటం లేదు', 'బరిలోకి దిగే ప్లేయర్స్‌లో నిజాయితీ ఉంటే.. ఈ గాలి, సముద్రం మిమ్మల్ని ఎప్పటికీ ఒగ్గేయదు' అనే డైలాగ్స్, టీజర్‌లో చూపించిన విజువల్స్, బోట్ సీక్వెన్స్, పడవ పందెంలకు సంబంధించిన సీన్లు హైలెట్‌గా నిలుస్తున్నాయి. ఇక సుహాస్, సూరి పవర్ ఫుల్ ఎంట్రీలు, జీవీ ప్రకాష్ ఇచ్చిన బీజీఎం నెక్ట్స్ లెవెల్ అని చెప్పుకోవచ్చు. ఎస్.ఆర్. కథిర్ సినిమాటోగ్రఫీ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. టీజర్‌తో ఒక్కసారిగా అంచనాలు రెట్టింపు అయ్యాయి. డైలాగ్స్, ఎమోషన్స్, యాక్షన్స్ ఇలా అన్ని రకాలుగా 'మండాడి' ఇంటెన్స్‌గా ఉండబోతోందని అర్థం అవుతోంది. ఈ సినిమాకి సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, ఎస్.ఆర్. కథిర్ సినిమాటోగ్రఫర్‌గా పని చేశారు. ప్రొడక్షన్ డిజైన్‌ను డి.ఆర్.కె. కిరణ్, ఎడిటింగ్‌ను ప్రదీప్ ఇ. రాఘవ్, యాక్షన్ సన్నివేశాలకు పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బరాయన్, మహేష్ మాథ్యూ కంపోజ్ చేశారు.

# "అంబా'స్ రివెంజ్" చిత్ర టీజర్ లాంచ్

**వుదయం సినిమా:** నక్క తోక ఫిలిమ్స్ బ్యానర్ పై జైవర్ధన్ మేడి దర్శకత్వంలో యోగేంద్ర ప్రసాద్ పొట్లూరి, రాణి మాడిసన్ నిర్మాతలుగా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఎఐ (AI) చిత్రం "అంబా'స్ రివెంజ్". ప్రమోద్ ఎంసి సంగీతం అందించిన ఈ ఎఐ చిత్రానికి హ్యారీ బ్రెయిన్ ఎడిటింగ్ & డిఐ చేయగా కిషోర్ కుమార్ ఏనుగు డైలాగ్స్ & లిరిక్స్ అందించారు. ప్రస్తుతం ప్రజలకు చేరువ అవుతున్న లేటెస్ట్ ఎఐ టెక్నాలజీ ద్వారా రూపొందిన ఈ విజువల్ ఫీస్ట్ చిత్రం భారత దేశపు ఇతిహాసాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన మహాభారతంలోని అంబ ప్రతీకారం నుండి తీసుకోబడింది. మహాభారతంలో భీష్ముని వల్ల ఒక జన్మలో మరణించిన కారణం, మరో జన్మలో భీష్ముని పై ఆమె పగ తీర్చుకున్న ప్రయాణాన్ని చూపించే దిశగా ఈ చిత్రం ఉంటుంది. మనుషులు ఎవరు నటించకుండా కేవలం ఎఐ ద్వారా రూపొందించిన ఈ చిత్ర టీజర్ నేడు మీడియా సమక్షంలో విడుదల చేయడం జరిగింది.విజువల్ డైరెక్టర్ సాయి నేత మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చి మాకు సపోర్ట్ అందిస్తున్న అందరికీ నమస్కారం. ఈ సినిమా కోసం చాలా కష్టపడి పనిచేయడం జరిగింది. ప్రేక్షకులు అందరూ మా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను" అన్నారు.సంగీత దర్శకుడు ప్రమోద్ ఎంసి మాట్లాడుతూ... "మహాభారతంలోని ఒక అంశాన్ని తీసుకుని సినిమాగా ప్రేక్షకుల ముందుకు రానున్నాము. మీడియా వారి సపోర్ట్ ఉండవల్సిందిగా కోరుకుంటున్నాము" అన్నారు.డైలాగ్స్ & లిరిక్స్ రచయిత కిషోర్ కుమార్ ఏనుగు మాట్లాడుతూ... "నాకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. ఈ సినిమాలో 2 పాటలు ఉంటాయి. నేటి తరానికి అర్థం అయ్యేలా ఈ చిత్రాన్ని తెరకి ఎక్కించడం జరిగింది" అన్నారు.




# సుజయ్ ప్రొడక్షన్స్ & అర్ఎన్ క్రియేషన్స్ నూతన చిత్రం ప్రారంభం!!!



**వుదయం సినిమా:** యష్ తేజ్, జయశ్రీ జంటగా సుజయ్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో అర్ఎన్ క్రియేషన్స్ సమర్పణలో చందు దర్శకత్వంలో కె గోపాల్, జె రవీందర్ నిర్మాతలుగా తెరకెక్కబోతున్న ప్రేమకథ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది.ఈ కార్యక్రమంలో నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ కెమెరా స్విచ్ ఆన్ చెయ్యగా ముహూర్తం సన్నివేశానికి దర్శకుడు విఎన్ ఆదిత్య క్లాప్ కొట్టారు అలాగే మామిడి హరికృష్ణ స్క్రిప్ట్ ను చిత్ర యూనిట్ కు అందజేశారు.ప్రేమించుకొనే యువత తల్లి తండ్రులని దృష్టిలో ఉంచుకుంటే ఏం జరుగుతుంది? ప్రేమలో ఉన్న అబ్బాయి అమ్మాయి వారి పేరెంట్స్ గురుంచి ఎలా ఆలోచిస్తారు? వంటి సంఘటనలతో ఈ సినిమా కథాంశం ఉంటుందని దర్శకుడు చందు చెబుతున్నారు ఒక సరికొత్త ప్రేమను తెరమీద ఆవిష్కరించబోతున్నందుకు ఆనందంగా ఉందని నిర్మాతలు కె గోపాల్, జె రవీందర్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ భూపతి యాదగిరి, సంగీతం నాగ వంశీ, సినిమాటోగ్రఫీ నాని బిశెట్టి, సురేష్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎర్రం రామకృష్ణ.

# 'డాయ్‌రా' న్యూ పోస్టర్



**వుదయం సినిమా:** ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'డాయ్‌రా' చిత్ర బృందం న్యూ అప్‌డేట్ ఇచ్చింది. కరీనా కపూర్ ఖాన్, పృథ్వీరాజ్ సుకుమారన్‌లతో కాంబినేషన్‌లో ఒక పవర్ ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌తో సినిమా ఎలా ఉండబోతోందనే హింట్‌ను టీం ఇచ్చింది. ఆగస్టు 31న ట్రైలర్ విడుదల కానున్న తరుణంలో ఈ పోస్టర్, అందులోని హింట్స్ అన్నీ కూడా ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసేలా ఉన్నాయి. కథ పట్ల ఆసక్తిని రేకెత్తించేలా కొన్ని అంశాలను రివీల్ చేస్తూనే ఆ పాత్రల మధ్య ఉన్న సంబంధం గురించి అనేక ప్రశ్నలను లేవనెత్తేలా పోస్టర్ ఉంది.పోలీసుల హెచ్చరిక టేప్ (police tape) మధ్య, ఒకరికొకరు వ్యతిరేకదిశలో నిలబడి ఉన్న కరీనా కపూర్ ఖాన్, పృథ్వీరాజ్ సుకుమారన్‌లతో పాటు, బ్యాక్గ్రౌండ్‌లో అస్పష్టంగా కనిపించే ఒకముఖం ఈపోస్టర్‌లో ఆకట్టుకునేలా ఉన్నాయి.

# "రోమాంచకం" ట్రైలర్ రిలీజ్ ఈవెంట్



**వుదయం సినిమా:** బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం". సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్నారు. ఈ రోజు "రోమాంచకం" చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోకాస్ట్యూమ్ డిజైనర్ కీర్తన మాట్లాడుతూ – ఈ సినిమా కోసం నేను డిఫరెంట్ గా కాస్ట్యూమ్స్ డిజైన్ చేసేందుకు ప్రయత్నించాను. అందుకు మా అమ్మ, అమ్మమ్మ వాళ్ల చీరలు కట్ చేసి కొత్త కాస్ట్యూమ్స్ డిజైన్ చేశాను. ఈ సినిమాకు వర్క్ చేస్తున్నప్పుడు మేము కొత్త వాళ్లం అనే ఫీల్ ను రానీయలేదు మా డైరెక్టర్, ప్రొడ్యూసర్. "రోమాంచకం" సినిమా మీ అందరినీ ఎంటర్ టైన్ చేస్తుంది. అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ వాసుకి వైభవ్ మాట్లాడుతూ – నేను సందీప్ వంగా గారిని అభిమానిస్తాను. మీలాగే ఆయన సినిమాలను థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేశాను. భద్రకాళీ సంస్థలో పనిచేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా. నాకు తెలుగు పూర్తిగా రాదు.

# "చిరంజీవి" ప్రీ రిలీజ్

**వుదయం సినిమా:** కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా "చిరంజీవి". ఈ చిత్రంలో ఈశ్వరి రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను కికు ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. శుభ సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. "చిరంజీవి" సినిమా ఈ నెల



28న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ లో ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ యష్ మిట్టల్ మాట్లాడుతూ – మా కికు "చిరంజీవి" సినిమా సరికొత్త కంటెంట్ తో మీ ముందుకు రాబోతోంది. ఈ నెల 28న థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారుకొరియోగ్రాఫర్ గోవింద్ మాట్లాడుతూ – ఈ సినిమా నాకొక పెద్ద అవకాశంగా భావిస్తున్నా. ఈ చిత్రంలో డిఫరెంట్ కాన్సెప్ట్ తో సాంగ్ కొరియోగ్రాఫ్ చేశాం. సినిమా ఒక యూనిక్ కాన్సెప్ట్ తో మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. అన్నారు.డీవోపీ రామకృష్ణ మాట్లాడుతూ – కికు "చిరంజీవి" సినిమాను ప్రేక్షకులు సీట్ ఎడ్జ్ లో కూర్చుని చూస్తారు. అంత థ్రిల్లింగ్ గా సినిమా మొత్తం ఉంటుంది. ఈ చిత్రానికి మీ సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా. అన్నారు.యాక్టర్ గిరీష్ మాట్లాడుతూ – ఈ సినిమా ఫస్ట్ ఫ్రేమ్ నుంచి చివరి ఫ్రేమ్ వరకు మిమ్మల్ని ఎంగేజ్ చేస్తుంది. ఇల్లు కట్టి చూడు పెళ్లి చేసి చూడు అన్నట్లు సినిమా తీసి చూడు అని చెప్పాలి. ఈ సినిమా కోసం కికు చాలా కష్టపడ్డాడు. ఆయన కష్టానికి ఫలితంగా మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నా. అన్నారు.యాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ – ఈ నెల 28న మా సినిమా రిలీజ్ కు వస్తోంది. తెలుగు ఆడియెన్స్ తెలుగు సినిమాలను చూసేందుకు ప్రాధాన్యత ఇస్తారని భావిస్తున్నా. ఈ చిత్రానికి కికు అన్నీ తానై చూసుకున్నాడు. కొత్తదనం నిండిన సినిమాగా కికు "చిరంజీవి" మీ అందరినీ ఆకట్టుకుంటుంది అన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.